www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 03 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి కార్తిక శుద్ధ దశమి
11-17 నవంబర్ 2024
వెల : ₹20/-



## భవ్య భవిష్యత్తుకు వాహకం
# సెమీ కండక్టర్

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# దీపావళి నుండి సంక్రాంతి వరకు

# జాగృతి కానుక !

## సంవత్సర చందా రూ.750/-
## 5 సంవత్సరాల చందా రూ.3500/-

ధర్మరక్షణ కోసం, ఈ మట్టి పరిమళంతో వెలువడుతున్న పత్రిక జాగృతి...
1948లో ప్రారంభమై 77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ భావాల పత్రిక..జాగృతి...
గర్వించదగిన తెలుగు వారపత్రిక... ఎన్నో ప్రత్యేక సంచికలను వెలువరిస్తున్నది.

**ఇలాంటి పత్రికలో మీరు కూడా భాగస్వాములు కావాలని**

**నవంబర్ 1 నుంచి జనవరి 15 వరకు**

**సం॥ర చందాలో రూ.100/- మరియు 5 సం॥రాల చందాలో రూ.500లు**

**ప్రత్యేక తగ్గింపును అందిస్తుంది.**

**కావున వెంటనే మీరు చందారులుగా చేరండి.. చేర్పించండి...**

**వివాహం, పుట్టినరోజు మొదలగు శుభ కార్యాల్లో జాగృతి చందాను గిఫ్టుగా ఇవ్వగలరు.**

సంవత్సర చందా రూ.750/-
http://payit.cc/S18970

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.


5 సం.రాల చందా రూ.3500/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1374/-
https://payit.cc/S32796

**Jagriti Bank A/c details**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad. IFSC : UTIB0002157,

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ :
**040-2756 1453**
**99599 97013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.


ఆ మహా దేవుడు శివుని ఆశీస్సులు
ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ..
హిందూబంధువులందరికీ
కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
పార్లమెంట్ సభ్యులు, నిజామాబాద్

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.3500** | **సంవత్సర చందా రూ.750**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


కెనడా అచ్చంగా పులిస్వారీ చేస్తున్నది. బుజ్జగింపు రాజకీయాలతో ఖలిస్తానీ ఉగ్రవాదుల కొమ్ముకాస్తున్నది. ఇప్పుడున్న ప్రధాని జస్టిన్ ట్రూడో సంకీర్ణ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి నానా గడ్డీ కరుస్తున్నది. బ్రాంప్టన్ కేంద్రంగా దీపావళి తరువాత అక్కడ జరిగిన పరిణామాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. నవంబర్ 3న బ్రాంప్టన్‌లో ఉన్న హిందూ సభ మందిరం దగ్గర హిందువుల మీద ఖలిస్తానీ అనుకూలురు దాడికి దిగారు. ఇందుకు నిరసనగా మరునాడు, నవంబర్ 4న హిందువులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. కెనడాలో హిందూ ప్రార్థనా స్థలాల మీద తరుచు జరుగుతున్న దాడులకు నిరసన పేరుతో ఈ కార్యక్రమం జరిగింది. ఖలిస్తానీ ఉగ్రవాదులనీ, వారి మద్దతుదారులనీ అంటకాగకుండా, దేశంలో శాంతిభద్రతలను సక్రమంగా నిర్వహించవలసిందని కూడా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన సంఘాలు కెనడా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. దాదాపు వేయి మంది హిందువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవంబర్ 3 ఆదివారం బ్రాంప్టన్ హిందూ సభ మందిరం, భారత దౌత్య కార్యాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమం మీద ఖలిస్తానీ ఉగ్రవాదులు దాడి చేసి భగ్నం చేశారు. ఎలాంటి సిగ్గూ లజ్జా లేకుండా ఖలిస్తానీ జెండాలతోనే దుండగులు భక్తుల మీద దాడికి దిగారు. ఆ దాడి సిక్కు మతాన్నీ, అది చెప్పే మూల సూత్రాలనూ తీవ్రంగా అవమానించేదే. చిన్నారులూ, స్త్రీలు అని చూడకుండా హిందూ సభ మందిరానికి వచ్చిన వారి మీద, అంటే భక్తుల మీద, ఖలిస్తాన్ అనుకూలురు దాడి చేశారు. హిందూ కెనడియన్ ఫౌండేషన్ విడుదల చేసిన వీడియోలో ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దాడిని పలువురు ఖండించారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రతిపక్ష నేత పియరే పోలీవర్, టొరంటో ఎంపీ కెవిన్ వాంగ్, మరొక ఎంపీ చంద్ర ఆర్య ఖండించిన వారిలో ఉన్నారు. 'హిందువులకు రక్షణ కల్పించడంలో మా దేశ నాయకులు విఫలమయ్యారు' అని కెవిన్ వాంగ్ నిష్కర్షగానే చెప్పారు. ఖలిస్తానీలు అన్ని హద్దులను అతిక్రమించారని చంద్ర ఆర్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

కెనడాలో జరిగిన ఖలిస్తానీ ఉగ్రవాదుల హత్యలకు భారత్ కారణమంటూ ఇటీవల

**శాలివాహన 1946 శ్రీ క్రోధి కార్తిక శుద్ధ దశమి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**భవిష్యత్తుకు వాహకం సెమీ కండక్టర్**

జాతీయం

**విపక్షాల వికృత 'కులగణన'!**

12లో



ప్రత్యేక వ్యాసం

**కమనీయం కార్తిక కౌముది**

26లో



# జాగృతి

## సంపాదకీయం

ఆ దేశ అధికార ప్రతినిధులు నోరు పారేసుకున్నారు. ఆ హత్యలతో భారత హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యక్ష సంబంధం ఉన్నదంటూ మంత్రుల స్థాయి వారు కూడా వ్యాఖ్యానించి, మరింత అభాసుపాలయ్యారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా ఇలాంటి ఆరోపణ చేయడం గుడ్డెద్దు చేలో పడిన చందంగానే ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 3న దుర్ఘటన జరిగింది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అంత తీవ్రంగా స్పందించవలసి వచ్చింది. 'ఈ దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. మా దౌత్యవేత్తలను భయభ్రాంతులకు గురి చేయాలన్న ఇలాంటి పిరికిపంద చర్యలను అపవలసిందిగా కూడా సూచిస్తున్నాను. ఇలాంటి దాడులు,

# బ్రామ్‌టన్ హిందువుల నిరసన

చర్యలు హింసకు వ్యతిరేకంగా భారత్ అనుసరించే విధానాన్ని బలహీన పరచలేవు. న్యాయం చేయమని, శాంతిభద్రతలను పరిరక్షించమని కెనడా ప్రభుత్వాన్ని కోరుతున్నాను' అని ఎక్స్ వేదికగా అన్నారు మోదీ. అంతకు ముందు మన విదేశ వ్యవహారాల శాఖ, 'ఇలాంటి దురాగతాల నుంచి అన్ని ప్రార్థనా స్థలాలకు రక్షణ కల్పించాలి. శాంతి భద్రతలు నెలకొల్పాలి. ఇవి కెనడా చేయగలదని భావిస్తున్నాం' అని మన విదేశాంగ శాఖ చురక వేసింది. ఇది అత్యంత తీవ్ర దుర్ఘటన అని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వ్యాఖ్యానించారు.

ఆ దాడి ముమ్మాటికీ హిందువులను తీవ్రంగా కలవరపరిచేదే. 'ఈ దాడితో మేమెంతో మనస్తాపం చెందాం. కెనడా పురోభివృద్ధిలో హిందువుల సేవ చాలా ఉంది. హిందూ సమాజం పురోగమన సమాజం. కెనడా ఆర్థిక పరిపుష్టికి ఎంతో చేసింది. మేం చట్టబద్ధంగానే వ్యవహరిస్తాం. అయినా కొంతమంది రాజకీయ నాయకులు, భద్రతా బలగాలు మా పట్ల ఇంత అవమానకరంగా ప్రవర్తించడం దారుణం' అని నవంబర్ 4 నాటి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రిషభ్ వ్యాఖ్యానించారు. గడచిన రెండు దశాబ్దాలుగా ఇవే దురాగతాలు సాగుతున్నాయని మరొక హిందువు గుర్తు చేశారు. మేం ఇక్కడ నిరసన చేపట్టినదే కెనడా పోలీస్ మా పట్ల చూపిన వివక్ష ఎలాంటిదో లోకానికి తెలియచేయడానికని ఆయన అన్నారు. దాడికి గురైన వారు హిందువులే. జాతీయ మీడియాలో వచ్చిన కొన్ని వీడియోలు ఇందుకు సాక్ష్యం చెబుతున్నాయి. కానీ బాధిత హిందువులనే పోలీసులు లక్ష్యంగా చేసుకోవడం అక్కడి వికృతం. అసలు రక్షకులే భక్షకులుగా మారిపోవడం మరొక వాస్తవం. కెనడా పోలీసు ఉద్యోగులలోను ఖలిస్తానీలు చొరబడిన సంగతి స్పష్టమైంది. ఖలిస్తానీలకు అనుకూలంగా బ్రామ్‌టన్‌లోనే జరిగిన ప్రదర్శనలో పాల్గొన్నందుకు హరిందర్ సోహి అనే పోలీసు ఉద్యోగిని సస్పెండ్ చేయవలసి వచ్చింది. ఇతడు ఖలిస్తాన్ జెండా పట్టుకుని, భారత వ్యతిరేక నినాదాలు చేస్తున్న సంగతి వీడియోలో నమోదైంది. పీల్ ప్రాంతీయ పోలీసు విభాగంలో సోహి సార్జెంట్. మరొక వాస్తవం కూడా గుర్తు చేసుకోవాలి. అక్కడ భారతీయ హిందువుల దేవాలయాలే కాదు, నేపాల్, పాకిస్తాన్, బాంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన హిందువులు నిర్మించినవీ ఉన్నాయి. వాటి జోలికి పోకుండా కేవలం భారతీయ హిందువుల ప్రార్థనా మందిరాల మీద దాడులు జరుగుతున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుంచి కెనడాలో సిక్కుల ప్రాబల్యం ఉంది. అక్కడి ప్రభుత్వంలో వారు మంత్రులు కూడా అయ్యారు. హిందూ ధర్మ పరిరక్షణ కూడా ఖల్సా ఏర్పాటులో భాగం. అది ఈ రోజున ఒక వర్గం సిక్కులు పూర్తిగా విస్మరిస్తున్నారు. అటు పాక్‌ను నెత్తికెక్కించుకుంటూ ఇటు భారత్‌ను ద్వేషించడం వీరి రుగ్మత. కెనడా ఉగ్రవాదం పాక్ ఉగ్రవాదంతో చేరుతోంది. కాబట్టి ఈ పాపంలో కెనడాకూ భాగం సుస్పష్టం. ★

11 నవంబర్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




36లో

కథ


**రహస్య ప్రపంచాలు**

– రామా చంద్రమౌళి





| | | |
|---|---|---|
| సర్వేలతో పాలన పక్కదారి? (తెలంగాణ) | - | 14 |
| వైద్యరంగంలో అవినీతి 'సుస్తీ'కి చికిత్స (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| కాంగ్రెస్‌కు ఉరి బిగిస్తున్న ఉచితాలు (జాతీయం-1) | - | 20 |
| నూతన ప్రపంచ క్రమానికి నాంది (అంతర్జాతీయం-1) | - | 22 |
| 'అమ్మ' మాట... బంగరు బాట (మహిళ) | - | 28 |
| బాల వినోదం - వికసిత భారత్ (సృష్టి) | - | 30 |
| వక్ఫ్‌బోర్డు మీద ఉన్న శ్రద్ధ ఆలయాలపై ఏది? (ఆవిష్కరణ) | - | 32 |
| సువర్ణాక్షరాల ఉక్కుమనిషి (నివాళి) | - | 40 |
| భారత టెస్ట్ క్రికెట్‌కు బీటలు! (క్రీడ) | - | 43 |
| 'లక్కీ భాస్కర్' (సినిమా) | - | 50 |



# భవ్య భవిష్యత్తుకు వా


మానవ శరీరం ఎంత భారీగా ఉన్నా, గుండె మాత్రం పిడికెడే ఉంటుందిట. అయినప్పటికీ, మనిషి ఆరోగ్యంగా తిరిగేందుకు విశ్రమించకుండా, నిరంతరం పని చేస్తుంది. నేడు ఎలక్ట్రానిక్ నుంచి రక్షణ రంగం వరకూ సూక్ష్మమైన సెమీ కండక్టర్లు కూడా అలాగే పని చేస్తున్నాయనడం అతిశయోక్తి కాదేమో. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, టెలికమ్యూనికేషన్లలో పెరుగుతున్న మార్కెట్ డిమాండ్ సెమీ కండక్టర్ల ఉత్పత్తికి బలమైన డిమాండ్‌ను సృష్టిస్తోంది. అత్యంత సూక్ష్మమైన ఈ చిప్‌లను తయారు చేయడం అంత తేలికైన విషయం కాదు. దానికి ఎంతో నైపుణ్యం కావాలి. అత్యధిక సంఖ్యలో ఇంజినీర్లను తయారు చేస్తున్న యువ దేశమైన భారత్ ఈ రంగంలో ప్రపంచ నాయకత్వం వహించాలనుకోవడంలో ఆక్షేపించవలసింది ఏమీ లేదు.

పెరుగుతున్న దేశీయ మార్కెట్లు, ప్రభుత్వ సానుకూల చొరవలు, అత్యధిక సంఖ్యలో ప్రతిభగల యువతతో 2030 నాటికి ప్రపంచ సెమీ కండక్టర్ల పరిశ్రమలో ప్రధాన శక్తిగా భారత దేశం ఎదగగలుగుతుంది. అయితే, సాంకేతికత, నైపుణ్యాల (టెక్నాలజీ – స్కిల్స్) మధ్య ఉన్న గణనీయమైన అంతరాలను అధిగమించడం వంటి సవాళ్లను అది ఎదుర్కోవలసి వస్తుంది. ఆ మేరకు కేవలం మాటలే కాదు, చేతలను కూడా భారత ప్రభుత్వం ప్రారంభించింది.

ఆధునిక ఎలక్ట్రానిక్స్‌కు శక్తినిచ్చే కీలక భాగాలైన సెమీ కండక్టర్లకు ప్రపంచ కేంద్రంగా నిలిచేందుకు భారత్ యత్నిస్తోంది. మనం నిత్యం ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువులు, రక్షణ రంగాలలో సెమీ కండక్టర్లకు పెరుగుతున్న ప్రాముఖ్యత, ఆవశ్యకతలతో ప్రపంచం నేడు వాటి వ్యూహాత్మక ప్రాధాన్యతను గుర్తిస్తోంది. ఒక పక్క ప్రపంచ సరఫరా లంకెలో ఏర్పడిన అవరోధాలు, మరోవైపు సాంకేతికత కోసం ఒకరిపై ఒకరు ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఈ కీలక రంగంలో తాను ఒక ప్రధాన శక్తిగా అవతరించేందుకు అవకాశాన్ని భారత్ పరిగణిస్తోంది. కాగా, భారత్ విజయవంతం కావాలంటే అనేక సాంకేతికత, ప్రతిభకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించుకోవాలి. ఈ వ్యాసం భారత్ ప్రస్తుత సెమీ కండక్టర్ రంగ పరిస్థితిని, పూడ్చవలసిన అంతరాలను, దేశం విజయం సాధించేందుకు తన శక్తిని ఎలా ఉపయోగించాలన్న అంశాన్ని చర్చిస్తుంది.

### సెమీ కండక్టర్ల వ్యూహాత్మక ప్రాధాన్యత

అటు ఆర్థిక స్థిరత్వానికీ, జాతీయ భద్రతకు సెమీ కండక్టర్లు నేడు అత్యవసరం అయ్యాయి. యునైటెడ్ స్టేట్స్, జపాన్, చైనా వంటి దేశాలు సరఫరా



# హాకం సెమీ కండక్టర్

లంకెలను పరిరక్షించుకునేందుకు, బహిర్గత మూలాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడానికి సెమీ కండక్టర్ల ఉత్పత్తికి ప్రాధాన్యతను ఇచ్చాయి. దాదాపుగా ఇవే లక్ష్యాలతో, ఆత్మనిర్భర్ భారత్ చొరవకు అనుగుణంగా ఈ రంగంలో 2030 నాటికి ప్రపంచ నాయకుడిగా ఎదగాలన్న లక్ష్యంతో భారత్ సెమీ కండక్టర్ల మిషన్‌ను పారంభించింది.

ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పిఎల్ఐ) పథకంలో భాగంగా దాదాపు 10 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రోత్సాహకాలు సహా భారీ ఆర్థిక మద్దతును ఇచ్చేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. తన సెమీ కండక్టర్ లక్ష్యాలను సాధించేందుకు భారత్ మొత్తం చిప్ రూపకల్పన, ఉత్పత్తి, కూర్పు, పరీక్షించడం, ప్యాకేజింగ్ (ఎటిఎంపి) సహా మొత్తం విలువ ఆధారిత లంకెను అభివృద్ధి చేసుకోవలసి ఉంది. అభివృద్ధి చెందుతున్న ఐటి రంగం కారణంగా నమూనా రూపకల్పనలో భారత్ బలమైన ఉనికిని కలిగి ఉన్నప్పటికీ, సెమీ కండక్టర్ కల్పన లేదా సృష్టిలో, ఉత్పత్తిలో గణనీయమైన సాంకేతిక, నైపుణ్యాల అంతరాలను, లోటును ఎదుర్కొంటోంది.

## సాంకేతిక సవాళ్లు

భారత్‌కు అతి పెద్ద సవాలు సెమీ కండక్టర్ తయారీ కేంద్రాలు (ఫ్యాబ్స్) ఉనికిలో లేకపోవడమే. ఈ ఫ్యాబ్స్‌ను నిర్మించడానికి అత్యంత స్వచ్ఛమైన నీరు (అల్ట్రా ప్యూర్ వాటర్), విశ్వసనీయ ఇంధనం (విద్యుత్), ఆధునిక సాంకేతికత సహా అత్యాధునిక మౌలిక సదుపాయాలు అవసరం అవుతాయి. అదనంగా, ఒక ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి భారీ ఆర్థిక పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, ముడి సరుకు అందుబాటులో ఉండటం అవసరం. నానో మీటర్ (మీటరులో వెయ్యి కోట్ల వంతు) స్కేల్ (దాదాపు 2 నానోమీటర్ల)లో ఫ్యాబ్రికేషన్ పని చేయాలి. ఇందుకు భారత్ అత్యాధునిక సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవలసి ఉంది.

సెమీ కండక్టర్ల రూపకల్పనలో విజయాలున్నప్పటికీ, భారత్ సెమీ కండక్టర్ల విలువ లంకెలో వెనుకబడి ఉంది– అవి వేఫర్ ఉత్పాదన, పరీక్ష, ప్యాకేజింగ్. ఇందుకు భిన్నంగా, తైవాన్, దక్షిణ కొరియా, చైనా సెమీకండక్టర్ల ఉత్పాదనకు చుట్టూ పూర్తి పర్యావరణ వ్యవస్థను (ఈకో సిస్టమ్) అభివృద్ధి చేసుకున్నాయి. ఉదాహరణకు ఈ రంగంలో తైవాన్ విజయానికి కారణం దాని సమగ్ర పర్యావరణ వ్యవస్థే. ప్యాకేజింగ్ సాంకేతికతలు, ముడి సరుకు, డిజైన్ సాఫ్ట్‌వేర్‌కు తోడ్పడే ఫ్యాబ్స్‌తో సహా స్థానిక సరఫరా వ్యవస్థ గల సమగ్ర వ్యవస్థే తోడ్పడుతోంది. ఇందులో భారత్ పోటీపడాలన్నా, ముందుండాలన్నా అటువంటి నమూనాలను అనుసరించాలి.

## నైపుణ్యాల కొరత, విద్య

సెమీ కండక్టర్ల రంగంలో నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్ కొరత అనేది మరొక ప్రధాన సవాలు. పరిశ్రమ డిమాండ్‌ను నెరవేర్చేందుకు 2030 నాటికి భారత్‌కు 1.2 మిలియన్ల మంది నైపుణ్యం కలిగిన కార్మికులు కావాలి. ప్రతి ఏడాదీ లక్షలమంది ఇంజినీర్లను భారత్ తయారు చేస్తున్నప్పటికీ, కొద్దిమందికి మాత్రమే సెమీకండక్టర్ సంబంధిత పాత్రలకు అవసరమైన ప్రత్యేక విజ్ఞానం ఉంటోంది. ప్రస్తుత విద్యా వ్యవస్థ చిప్ రూపకల్పన, ఉత్పత్తికి అవసరమైన ఆధునిక ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీ, వస్తు పరిశోధన విభాగాలలో వెనుకబడి ఉన్నది.

సెమీకండక్టర్ సాంకేతికతలో నాయకత్వం వహిస్తున్న అమెరికా, దక్షిణ కొరియా వంటి దేశాలు 'స్టెమ్' సాంకేతికతల (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథమెటిక్స్) విద్యలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. విద్యకు సంబంధించిన ప్రపంచ ర్యాంకింగ్ లలో 139వ స్థానంలో ఉన్న భారతదేశం, ఈ నైపుణ్యాల అంతరాన్ని పూడ్చేందుకు భారీ సంస్కరణలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఉపాధి కోసం స్టెమ్, నైపుణ్యాల సముపార్జన, విజ్ఞాన జాగృతి ప్రోత్సాహం (సంకల్ప్)వంటి కార్యక్రమాలకు నూతన విద్యావిధానం ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, జరగాల్సింది మరెంతో ఉంది.

యూనివర్సిటీలలో సెమీ కండక్టర్ సాంకేతికతకు సంబంధించి ప్రత్యేక కోర్సులను అందించాలి. పరిశ్రమకు, విద్యారంగానికీ మధ్య భాగస్వామ్యాన్ని మరింత విస్తరించవలసి ఉన్నది. నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రస్తుతమున్న ఫ్యాకల్టీకి శిక్షణ, సాంకేతికత సంస్థలలో పరిశోధనలను పెంచి పోషించడం ఇందుకు అవసరం అవుతాయి. తైవాన్, దక్షిణ కొరియా, అమెరికాలతో సమన్వయం కావడం ద్వారా ప్రపంచస్థాయి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం భారత్‌కు తేలిక అవుతుంది.

## ప్రపంచ సవాళ్ల నుంచి పాఠాలు నేర్చుకోవడం

తమ సెమీ కండక్టర్ పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవడంలో అనేక దేశాలు కష్టాలను ఎదుర్కొన్నాయి. ప్రపంచ వైఫల్యాల నుంచి నేర్చుకోవలసిన కీలక పాఠం ఏమిటంటే, ఇందులో వ్యూహాత్మక ప్రణాళిక, లక్ష్మిత పెట్టుబడి అవసర మని. ఉదాహరణకు, అమెరికా సెమీకండక్టర్ల ఉత్పత్తిలో తన నాయకత్వ హోదాను కోల్పోగా, తైవాన్, దక్షిణ కొరియా దాని స్థానాన్ని ఆక్రమించాయి. అమెరికా వైఫల్యానికి కారణం, ఫ్యాబ్రికేషన్ సాంకేతికతలో తగినంత పెట్టుబడులు పెట్టకపోవడమే.

అలాగే, తన వద్ద అత్యాధునిక సాంకేతికత ఉన్నప్పటికీ, జపాన్ ఈ రెండు దేశాలతో తగినంతగా పోటీపడలేకపోయింది. అందుకు కారణం, సెమీ కండక్టర్ల ఉత్పత్తికి సంబంధించిన అసమగ్ర విధానాలు, పరిశోధన, అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు లేకపోవడమే. విలువ లంకెను (వాల్యూ చైన్) విడివిడిగా కన్నా మొత్తం సెమీ కండక్టర్ పర్యావరణ వ్యవస్థలను రూపొందించడంపై దృష్టి పెట్టడం భారత్‌కు అవసరం. దీనితో పాటుగా దీర్ఘకాలిక సమగ్ర వ్యూహంతో, ఇటువంటి తప్పులను

నివారించుకోవాలి. పెట్టుబడులు నిర్దిష్టంగా ఉండాలి, సాంకేతిక ప్రతిభపై ఆధారపడి తమ భాగస్వాములను, ప్రాంతాలను ఎంచుకునే స్వేచ్ఛ ప్రైవేటు రంగానికి ఉండాలి తప్ప రాజకీయ ఇష్టాయిష్టాలకు అనుకూలంగా కాదు. ఇది భారీ ప్రపంచ సాంకేతిక సంస్థల నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తుంది.

**భారత్‌కు గల వ్యూహాత్మక లాభాలు**

ఎన్ని సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, భారత్ తన లక్ష్యాలను సాధించేందుకు అనువైన స్థితిలో ఉంది. మొదటగా, సెమీ కండక్టర్ల రూపకల్పన కలిగిన ప్రతిభ విషయానికి వస్తే ప్రపంచంలోనే 20 శాతం ప్రతిభ దేశంలోనే ఉండటమే కాక, భారీ సంఖ్యలో సాంకేతికంగా నైపుణ్యం కలిగిన కార్మిక శక్తిని కలిగి ఉంది. అదనంగా, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, టెలికమ్యూనికేషన్లలో పెరుగుతున్న మార్కెట్ డిమాండ్ అన్నది సెమీ కండక్టర్ల ఉత్పత్తికి బలమైన డిమాండ్‌ను సృష్టిస్తుంది. ఇది ఫ్యాబ్‌లను, ఎటిఎంపి యూనిట్లను ఏర్పాటు చేయాలనుకునే బహుళ జాతి సంస్థలకు భారత్ ఒక ఆకర్షణీయమైన గమ్యంగా మారుస్తోంది.

భారత ప్రభుత్వ సానుకూల విధానాలు కూడా వృద్ధికి తగిన సమగ్ర వాతావరణాన్ని సృష్టించేందుకు తోడ్పడుతున్నాయి. గుజరాత్, అస్సాంలలో సెమీ కండక్టర్ ఫ్యాబ్‌లను నిర్మించాలన్న ప్రణాళికలతో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి)కి ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రకటించడం అన్నది బలమైన సెమీ కండక్టర్ పర్యావరణ వ్యవస్థను సృష్టించే దిశగా సానుకూల అడుగులు. చైనా నుంచి తమ సరఫరా లంకెలను బహుముఖం చేయాలనుకుంటున్న దేశాల నుంచి తన వ్యూహాత్మక స్థాయిలో ఉన్న భారత్ పెట్టుబడులను ఆకర్షించే యత్నం చేయాలి.

**లక్ష్య సాధనకు చర్యలు**

తన సెమీ కండక్టర్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు భారత్ సాంకేతికత, మానవ పెట్టుబడి సవాళ్లను పరిష్కరించుకోవాలి.

**మౌలిక సదుపాయాల అభివృద్ధి:**

సెమీ కండక్టర్ ఫ్యాబ్‌లను ఆకర్షించేందుకు నీరు, విద్యుత్, రవాణా వంటి అత్యవసర మౌలిక సదుపాయాలలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం కీలకం.

**నైపుణ్యాల అభివృద్ధి:**

సెమీ కండక్టర్ ప్రత్యేక నైపుణ్యాలపై దృష్టి పెట్టి భారత్ తన విద్యా వ్యవస్థను పునరుద్ధరించాలి. స్టెమ్ విద్యను విస్తరించడం, యూనివర్సిటీలలో విశిష్ట కార్యక్రమాలను అభివృద్ధి చేయడం, పరిశ్రమ–విద్యావేత్తల భాగస్వామ్యాన్ని పెంచి పోషించడం అన్నవి నైపుణ్యాలు కలిగిన కార్మిక శక్తిని నిర్మించేందుకు తోడ్పడతాయి.

**పెట్టుబడులను ఆకర్షించడం**

కొంతకాలంవరకూ వడ్డీ మనహాయింపు లేదా వడ్డీ తక్కువ రుణాలు వంటి ఆర్థిక ప్రోత్సాహకాలు విదేశీ సెమీ కండక్టర్ కంపెనీలను ఆకర్షిస్తాయి. సాంకేతికత బదలాయింపునకు తైవాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు సౌలభ్యాన్ని కలిగిస్తాయి. ఆటంకాలు లేకుండా నిరంతరంగా ఆర్ అండ్ డీలో పెట్టుబడులు పెట్టడం అన్నది సెమీ కండక్టర్ పరిశ్రమలో పోటీతత్వాన్ని నిర్వహించేందుకు కీలకం. అత్యాధునిక చిప్ డిజైన్, ఫ్యాకేజింగ్, ఫ్యాబ్రికే షన్లపై దృష్టి పెట్టి పరిశోధన చేసేందుకు కేంద్రాలను భారత్ ఏర్పాటు చేయాలి.

**సరఫరా లంకెకు సంబంధించిన పర్యావరణ వ్యవస్థ నిర్మాణం**

పరికరాల సరఫరాదారులు, సాఫ్ట్‌వేర్ డిజైన్ చేసేవారు, ముడి సరుకులు సహా సమగ్రమైన సెమీ కండక్టర్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం అన్నది దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ పరిశ్రమను బలోపేతం చేస్తుంది.



## ‘శక్తి’కి ప్రోత్సాహం

అమెరికాతో కలిసి భారత్ భద్రతా రంగంలో ఏర్పాటు చేస్తున్న తొలి సెమీ కండక్టర్ల ఫ్యాబ్రికేషన్ కేంద్రం భవిష్యత్ యుద్ధ తంత్రంలో మనకు సాంకేతిక ప్రయోజనాన్ని అందించనుంది.


రక్షణ లేదా భద్రతా సెమీ కండక్టర్లపై భారత్–అమెరికాల మధ్య జరిగిన ఒప్పందం పై ప్రపంచంలో సంచలనం రేకెత్తడానికి కారణం లేకపోలేదు. ఈ ఒప్పందం యుద్ధ రంగంలో భారత్ వినియోగించనున్న సైనిక హార్డ్‌వేర్‌కు ఆధునిక గ్రాహకత, సమాచారం, హైవోల్టేజ్ విద్యుత్ ఎలక్ట్రానిక్స్‌లో భారీ ప్రయోజనాన్ని ఇవ్వనుంది.

ఈ మల్టీ మెటీరియల్ (బహుళ– పదార్థ) చిప్పుల ఉత్పత్తి ప్లాంట్ చైనా పాకిస్తాన్‌లు సహా దక్షిణ, ఆగ్నేయ ఆసియాలో భవిష్యత్ యుద్ధాలలో మనకు అదనపు రక్షణను అందిస్తుంది.

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన ‘విల్మింగ్టన్ ఒప్పందం’ అన్నది భారత్ ప్రత్యర్థులకు సందేశాన్నివ్వడంలో గణీయమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. ఈ వార్త వచ్చిన తక్షణమే వెలువడిన స్పందనలను పరిశీలిస్తే, చైనా కమ్యూనిస్టు పార్టీ, అధ్యక్షుడి జీ జిన్ పింగ్ ఈ కీలక ఒప్పందం పట్ల అనాసక్తి ప్రదర్శించడం కనిపిస్తుంది.

కాగా, యుఎస్ స్పేస్ ఫోర్స్, జనరల్ అటామిక్స్‌తో భారత్ సెమీ, 3వ సాంకేతిక భాగస్వామ్యానికి ‘ఇండియా సెమీ కండక్టర్స్ మిషన్’ తోడ్పాటునందిస్తుంది. ఇన్‌ఫ్రారెడ్, గాలియం నైట్రైడ్, సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్ల ఉత్పత్తి అనేది మన భద్రతా రూపావళిలో ఎంతో తోడ్పడుతుంది.

రక్షణలో సెమీ కండక్టర్ల ఒప్పందాన్ని కొందరు విశ్లేషకులు పౌర అణు ఒప్పందంతో పోల్చడం అన్నది భారతీయ భద్రతా/రక్షణ ఉపకరణాలను మరొక స్థాయికి తీసుకువెడతోంది. పౌర అణు ఒప్పందం సమయంలో నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని దాదాపు గద్దె దింపేంతగా దేశం లోపల, బయట కూడా రకరకాల హోదాలలో ఉన్న కమ్యూనిస్టు మిత్రులు గొంతులు చించుకున్నట్టుగా ఇప్పుడు కూడా చేసే అవకాశం ఉంది. ప్రధాని మోదీ తాజా అమెరికా పర్యటనలో ఈ ఒప్పందం కచ్చితంగా ఒక కేంద్ర



భారత్‌ను ప్రపంచ సాంకేతిక పవర్ హౌజ్‌గా మార్చి, ముందుకు తీసుకువెళ్లే సామర్థ్యాన్ని భారతీయ సెమీ కండక్టర్ మిషన్‌కు కలిగి ఉంది. సాంకేతికత, నైపుణ్యాల పరంగా గణనీయమైన అంతరాలు ఉన్నప్పటికీ, పెరుగుతున్న భారత దేశీయ మార్కెట్టు, ప్రభుత్వ సానుకూల చర్యలు, సమృద్ధిగా ఉన్న ప్రతిభగల యువత దాని విజయానికి ఒక బలమైన పునాదిగా నిలుస్తారు. సెమీ కండక్టర్ పర్యావరణ వ్యవస్థలో వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టడం, ప్రపంచ అనుభవాల నుంచి నేర్చుకోవడం ద్వారా భారత్ 2030 నాటికి ప్రపంచ సెమీ కండక్టర్ మార్కెట్‌లో ఒక ప్రధాన శక్తిగా అవతరించాలన్న లక్ష్యాన్ని సాధించగలదు.

**సెమీ కండక్టర్ ఉత్పత్తికి కేంద్రంగా ఉండాలన్న ఆకాంక్ష**

- ప్రస్తుతం ప్రపంచ సెమీ కండక్టర్ డిజైన్ ప్రతిభలో 20 శాతం భారత్‌దే.
- రానున్న సంవత్సరాలలో పరిశ్రమలో పని చేసేందుకు సిద్ధంగా ఉండే టెక్నీషియన్లను, ఇంజినీర్లు, ఆర్ అండ్ డి నిపుణులు సహా 85,000 మంది నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్‌తో కార్మికశక్తిని సృష్టించాలని భారత ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది.
- భారతదేశ పరిశోధనా సామర్థ్యాలను పెంచుకునేందుకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ కింద రూ 1 ట్రిలియన్ పరిశోధన నిధిని భారత్ ఏర్పాటు చేసింది.
- రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా ప్రక్రియలో పాలుపంచుకుంటూ ఏర్పాటు చేసే సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలకు 50శాతం ఆర్థిక మద్దతును ప్రభుత్వం అందిస్తోంది.
- సెమీ కండక్టర్ పరిశ్రమకు కీలకమైన ఖనిజాలను సేకరించి, భద్రపరిచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.
- దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ, విదేశాల నుంచి కూడా ఈ ఖనిజాలను సేకరించేందుకు ప్రభుత్వం క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించింది.
- జపాన్, అమెరికా సహా పలు దేశాలతో భారత్ సన్నిహితంగా కలిసి పని చేస్తోంది.
- క్వాడ్ సెమీ కండక్టర్ సరఫరా లంకె చొరవలో భారత్ కీలక భాగస్వామి. ఇందులో భాగంగా, ప్రపంచ సెమీ కండక్టర్ సహకారాన్ని బలోపేతం చేసేందుకు పలు ఒప్పందాలపై సంతకాలు చేసింది.

బిందువే.

అత్యద్భుతమైన సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణ సామర్థ్యాలు కలిగిన భారతదేశం ప్రతి ఏడాదీ భద్రతా సెమీకండక్టర్ చిప్‌లను సేకరించేందుకు ఒక బిలియన్ డాలర్లను వెచ్చించడంలో అర్థం లేదు. ఈ క్రమంలోనే భారత్– అమెరికా ఒప్పందంలో భాగంగా కోల్‌కతా విద్యుత్ కేంద్రంలో గ్లోబల్ ఫౌండ్రీస్ ఫెసిలిటీని ఏర్పాటు చేయడం అన్నది చిప్స్ ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరింప చేయనుంది.

తమ వాణిజ్య, ఉత్పాదక ప్రయోజనాల కోసం చైనాకు చెందిన సెమీకండక్టర్ల విలువ లంకె (వాల్యూచైన్) నుంచి తప్పుకోవడానికి సంకేతంగా ఈ ఒప్పందాన్ని చెప్పవచ్చు. సెమీకండక్టర్లకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యత కారణంగా, దేశంలోనే పారిశ్రామిక అనువర్తనలు తదితరాల కోసం చిప్‌లను ఉత్పత్తి చేసేందుకు అంతర్జాతీయ సంస్థలకు నూతన అవకాశాలు ఏర్పడతాయి. ఉన్నత నాణ్యత కలిగిన చిప్‌లను ప్రతి ఏడాదీ ఉత్పత్తి చేసేందుకు యుఎస్, యూరోప్, తైవాన్, సింగపూర్‌కు చెందిన కంపెనీలలో భారత్ ఎంతో చాతుర్యంతో భాగస్వామి అయింది.

ప్రతి రోజూ ఏడు కోట్ల చిప్‌లను ఉత్పత్తి చేసేందుకు రూ. 1.5 లక్షల కోట్లను పెట్టుబడిగా ప్రభుత్వం పెడుతున్నది. విస్తరణవాద చైనా నుంచి విడివడి ప్రత్యామ్నాయ సరఫరా లంకెలను ఏర్పాటు చేయాలన్న విస్తృత లక్ష్యంలో భాగమిది.

ప్రపంచంలోని ఉన్నత శ్రేణి ఐదు భారీ సంస్థల్లో ఒకటిగా ఉద్భవించేందుకు భారత్ నాలుగు అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. సెమీ కండక్టర్ చిప్స్ తయారీ కోసం కేన్స్ సెమీకాన్, సిజి పవర్ వంటి భారీ కంపెనీలు గుజరాత్‌లోని సనంద్‌లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, మిగిలిన రెండింటిలో ఒకటి గుజరాత్‌లోని ధదేరా లోనూ, మరొకటి అస్సాంలోని మోరెగాంవ్ లోనూ టాటా ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు చేయనుంది.

నూతన సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసే సామర్థ్యం గురించి 2021లో భారత్ ఒక అవగాహనకు వచ్చింది. సెమీకండక్టర్ చిప్స్ ఉత్పతిని, ప్రక్రియలను, అభివృద్ధి, మొత్తం పర్యావరణ వ్యవస్థ పరిణామాన్ని ప్రోత్సహించేందుకు ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం కింద రూ. 76వేల కోట్లు అందించాలని నిర్ణయించింది. భారత్‌లో సెమీ కండక్టర్ల మార్కెట్టు 2030 నాటికి ప్రస్తుతమున్న 38 బిలియన్ డాలర్ల వాణిజ్య అవకాశాల నుంచి 109 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని అంచనా.

సెమీకండక్టర్లనేది అధిక ప్రభావం చూపగల వ్యాపార కార్యకలాపం. అది కేవలం దేశ జీడీపీకి బిలియన్ల డాలర్లను చేర్చడమే కాక, అత్యున్నత నైపుణ్యం కలిగిన మిలియన్ల కొద్దీ ఉద్యోగాలను సృష్టించగల సంభావ్యతను (పొటెన్షియల్) కలిగి ఉంది. దిగుమతులపై ఆధారపడడం తగ్గడమే కాదు, క్రమంగా భారత్ పారిశ్రామిక అనువర్తనలు, ఆటోమొబైళ్లు, మొబైల్ పరిశ్రమ సహా పలు రకాల పరిశ్రమలకు సెమీకండక్టర్ చిప్స్ నికర సరఫరా దారుగా ఉద్భవించనుంది.

భారత్ గత కొద్ది ఏళ్లగా చేసుకున్న అనేకానేక ఒప్పందాల వరుసలో విద్యుత్ సరఫరా, పారిశ్రామిక జోన్లు, మౌలిక సదుపాయాల సంబంధ లాజిస్టిక్స్‌కు కూడా ప్రోత్సాహం లభించనుంది. ఈ పరిస్థితుల్లో సెమీకండక్టర్ల నిపుణులకు డిమాండ్ సహజంగానే పెరుగుతుంది కనుక విశిష్ట విద్యా కార్యక్రమాలు, నూతన నైపుణ్యాల అభివృద్ధి చొరవలను రూపొందించి, అమలు చేయవలసి ఉంది.

సెమీకండక్టర్ల సరఫరాకు హామీ ఇవ్వడం ద్వారా ఎలక్ట్రానిక్స్ తయారీ, టెలికమ్యూనికేషన్లు, ఆటోమేటివ్ పరిశ్రమ విస్తరణను సృష్టించవచ్చు. భద్రతా ఉపకరణాలు, భవిష్యత్ యుద్ధాలు లేక సంఘర్షణలలో సెమీకండక్టర్లకు గల ప్రాధాన్యత కారణంగా భారత్ భౌగోళిక–రాజకీయ ప్రభావం కూడా విస్తరించ నుంది. ఇప్పటికే, వినూత్న ప్రాజెక్టులను చేపట్టేందుకు సెమీకండక్టర్ల వ్యాపారంలో భారీ స్టార్టప్‌ల నెట్‌వర్క్ ప్రారంభం అయింది.

కనుక, గత వైఫల్యాలను పక్కకు పెట్టి, ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత భారత్‌పైనే ఉంది. ★



- ఈ దశాబ్దం ఆఖరు నాటికి ఎలక్ట్రానిక్స్ రంగాన్ని 500 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచి, 6 మిలియన్ ఉద్యోగాలను సృష్టించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో సెమీకండక్టర్ ముఖ్య పాత్ర పోషించనుంది.

**దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ చర్యలు**

- భారతదేశ సెమీ కండక్టర్ మార్కెట్ 2023 నాటికి 38 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి 109 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. సెమీ కండక్టర్ల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది.
- దేశంలో సెమీ కండక్టర్ల అభివృద్ధి, డిస్ప్లే ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థ కోసం మొత్తం రూ. 76,000 కోట్ల పెట్టుబడితో సెమికాన్ ఇండియా కార్యక్రమాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. సెమీ కండక్టర్లు, డిస్ప్లే ఉత్పత్తి, డిజైన్ పర్యావరణ వ్యవస్థలో పెట్టుబడి పెట్టే కంపెనీలకు ఆర్థిక మద్దతునివ్వాలన్నది ఈ కార్యక్రమ లక్ష్యం.
- బ్రౌన్ ఫీల్డ్ (పునరుద్ధరించిన) ఫ్యాబ్‌గా మొహాలీ లోని సెమీ కండక్టర్ ప్రయోగశాలను ఆధునీక రించేందుకు ప్రభుత్వం ఆమోదాన్ని తెలిపింది.

**సెమీ కండక్టర్ ఉత్పత్తిలో పెట్టుబడులు**

- ప్యాకేజింగ్, పరీక్షించే యూనిట్‌తో పాటుగా డిస్ప్లే యూనిట్‌తో సెమీ కండక్టర్ ఫ్యాబ్‌ను ఏర్పాటు తొలి దశలో వేదాంత గ్రూప్ 5 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టనుంది.
- భారత్‌లో ఒఎస్ఎటి (ఒసాట్) ప్లాంట్ కోసం హెచ్‌సిఎల్‌తో కలిసి చేపట్టనున్న ఇంకా పేరు పెట్టని సెమీ కండక్టర్ జాయింట్ వెంచర్ (జేవీ)లో ఫాక్స్‌కాన్ సంస్థ రూ. 4.24 బిలియన్లు పెట్టుబడి పెట్టనుంది.
- గుజరాత్‌లోని ధొలేరాలో అదనంగా రెండు ఫ్యాబ్రికేషన్ కేంద్రాలు (ఫ్యాబ్స్)తో తన సెమీ కండక్టర్ ఉత్పత్తి సామర్థ్యాలను టాటా ఎలక్ట్రానిక్స్ విస్తరించనుంది. తైవాన్‌కు చెందిన పిఎస్ఎంసి భాగస్వామ్యంతో తలపెట్టిన మొదటి ఫ్యాబ్ ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. ఇది ఆటోమేటివ్, ఎఐ, వైర్‌లెస్ కమ్యూనికేషన్ల రంగాలకు అవసరమైన చిప్స్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఈ కేంద్రం 2026 నాటికి ఉత్పత్తిని ప్రారంభించి, నెలకు 50,000 వేఫర్లను తయారు చేస్తుందని అంచనా.
- ఇజ్రాయెల్‌కు చెందిన టవర్ సెమీ కండక్టర్, భారత్ అదానీ గ్రూప్ మధ్య 10 బిలియన్ డాలర్ల విలువైన సంయుక్త సెమీకండక్టర్ ఫ్యాబ్ ప్రతిపాదన ప్రస్తుతం భారత్ సెమీ కండక్టర్ మిషన్‌లో (ఐఎస్ఎం) భాగంగా సమీక్ష కింద ఉంది.
- భారత్‌లో 2027నాటికి 15 ఉత్పత్తులను రూపకల్పన చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఫ్యాబ్‌లేని చిప్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు 300 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్టు లార్సన్ అండ్ టుబ్రో కంపెనీ ప్రకటించింది.
- గుజరాత్, అస్సాంలో గల తన సెమీ కండక్టర్ కేంద్రాలకు పరికరాలను, సేవలను కొనుగోలు చేసేందుకు భారత్‌కు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ టోక్యో ఎలక్ట్రాన్ (టిఇఎల్)తో ఎంఒయుపై సంతకాలు చేసినట్టు సెప్టెంబర్9, 2024న వార్తలు వచ్చాయి. ఈ భాగస్వామ్యం కార్మికశక్తి శిక్షణ, ఆర్ అండ్ డి, సెమీ కండక్టర్ మౌలిక సదుపాయాల పెంపుపై దృష్టి పెడుతుంది.
- సెప్టెంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సింగపూర్‌లో పర్యటించినప్పుడు సెమీ కండక్టర్ క్లస్టర్ అభివృద్ధి, సెమీ కండక్టర్ డిజైన్, ఉత్పత్తి ప్రతిభను అలవరచుకోవడం సహా పలు అంశాలలో భారత్, సింగపూర్ బహుళ ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

**పెరుగుతున్న ఎగుమతులు**

- 2022లో భారతీయ సెమీ కండక్టర్ మార్కెట్ విలువను 26.3 బిలియన్ డాలర్లుగా విలువ కట్టారు, 2032 నాటికి 26,3 శాతం సిఎజిఆర్ విస్తరణతో 271.9 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేశారు.
- 2017లో భారత్ నుంచి సెమీ కండక్టర్ ఎగుమతులు 0.21 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 4.65 బిలియన్లకన్నా ఎక్కువగా ఉన్నాయి.
- 2019లో ఎగుమతులు 0.33బిలియన్లకు పెరగ్గా, దిగుమతులు 3.15 బిలియన్లకు పడిపోయాయి.
- 2020లో కొవిడ్ మహమ్మారి, ప్రపంచ ఆర్థిక విధ్వంసం ప్రభావంతో ఎగుమతులు, దిగు మతులు రెండూ తిరోగమనంలో ఉన్నాయి.
- 2022లో భారత్ నుంచి ఎగుమతులు ఎన్నడూ లేనివిధంగా 0.52 బిలియన్లకు పెరిగాయి.

**విదేశీ కీలక పెట్టుబడిదారులు**

- మైక్రాన్ టెక్నాలజీ
- అప్లైడ్ మెటీరియల్స్
- అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్
- ఫాక్స్‌కాన్
- కార్నింగ్

**భారత కీలక సంస్థలు**

- వేదాంత
- టాటా ఎలక్ట్రానిక్స్
- హీరానందానీ
- రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్
- లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి)
- మురుగప్ప

(– ఆర్గనైజర్ నుంచి)

తమ దేశంలో సిక్కు వేర్పాటువాదుల హత్యల వెనుక భారత హోంశాఖ మంత్రి అమిత్ షా హస్తముందంటూ కెనడా చేసిన ఆరోపణలు పెద్ద దుమారమే సృష్టించాయి. కెనడా డిప్యూటీ విదేశాంగ మంత్రి డేవిడ్ మోర్రిసన్ 'కెనడాలో జరుగుతున్న కుట్రల వెనుక అమిత్ షా హస్తముందని' తాను 'వాషింగ్టన్ పోస్ట్'కు చెప్పానన్న సంగతిని, పార్లమెంటరీ ప్యానల్ వద్ద అంగీకరించారు. ఈ అంశపై భారత్ తీవ్రంగా స్పందించి, కెనడా హైకమిషన్ ప్రతినిధిని పిలిచి, ఆదేశ వ్యవహార శైలిపై తీవ్రస్థాయిలో నిరసన తెలియ జేసింది. కెనడా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే, దౌత్యపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది కూడా. దీనిపై అమెరికా స్పందిస్తూ, కెనడా చేసిన ఆరోపణలు బాధాకరమని పేర్కొంటూనే, ఈ సమస్యపై కెనడా ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామంటూ సన్నాయి నొక్కులు నొక్కింది.



## సిక్కు ఓట్ల కోసం కెనడా తెంపరితనం:

# అమిత్ షాపై అర్థంలేని ఆరోపణలు!

నిజానికి నిజ్జర్ హత్య కేసులో కెనడా విచారణకు భారత్ సహకరించడంలేదంటూ ఆరోపిస్తోంది. ఆ విధంగా కెనడాకు మద్దతిస్తున్న అమెరికాతో పాటు యు.కె. కూడా వంతపాడింది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారతీయ ఏజెంట్ల పాత్ర ఉన్నదంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన స్పర్థలు మొదలై వేగంగా క్షీణించడం వర్తమానచరిత్ర.

**ఖలిస్తానీల చేతిలో కీలుబొమ్మ**

రెండుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న తరుణంలో రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) కమిషనర్ మైక్ డుహిమే, 'కెనడా లోని నేరగాళ్లు, భారత్‌లో కార్యకలాపాలను నియంత్రించే అవకాశాలున్నాయి' అంటూ అక్టోబర్ నెలలో పార్లమెంటరీ కమిటీ విచారణకు హాజరైన సందర్భంగా పేర్కొనడం, జస్టిన్ ట్రూడో ప్రభుత్వం ఖలిస్తానీల చేతిలో కీలుబొమ్మగా మారిందన్న సత్యాన్ని వెల్లడిస్తోంది. ముఖ్యంగా వచ్చే ఏడాది ఎన్నికల్లో సిక్కుల ఓట్లకోసం జస్టిన్ ట్రూడో ఆడుతున్న నాటకంగా దీన్ని పరిగణించినా, ఈ నాటకం వెనుక అమెరికా హస్తం లేకపోలేదన్న సత్యాన్ని గుర్తించాలి. ఆంగ్లో సాగ్జన్ దేశాలైన 'ఫైవ్ ఐ నేషన్స్' (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, అమెరికా, యు.కె) ఇతర దేశాలతో వ్యవహరించే సమయంలో పరస్పరం మద్దతుగా నిలుస్తాయన్న సంగతి తెలిసిందే. ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతుంటే, ఆయుధాల అమ్మకం ద్వారా అమెరికా లాభపడటమనేది ఇప్పటికీ జరుగుతున్న తంతు. చైనా బూచిని చూపి భారత్–తైవాన్‌లకు, ఉత్తర కొరియాను చూపి దక్షిణ కొరియాకు, ఆఖరికి ఇరాన్‌ను చూపి సౌదీ అరేబియాకు ఆయుధాలను అమ్మడానికి అమెరికా విశ్వ ప్రయత్నం చేస్తున్నది. భారత్ ఈ ఉచ్చులో పడలేదు. పైగా చైనాతో ఒప్పందం కుదుర్చుకోవడం అమెరికాకు ఎంతమాత్రం కొరుకుడుపడని అంశం. రష్యా ప్రమేయంతో చైనా దిగివచ్చి సైన్యాన్ని వెనక్కి తీసుకోవడానికి అంగీకరించడంతో భారత్‌తో దానికి సయోధ్య కుదిరింది. ఇటువంటి పరిస్థితుల్లో భారత్‌ను ఏదో రకంగా ఇబ్బంది పెట్టడానికి కెనడాను వాడుకుంటున్నదని భావించాలి. ముఖ్యంగా మరో దేశానికి చెందిన బాధ్యతాయుత పదవిలో ఉన్న ప్రముఖ నాయకుడిపై ఈరకమైన ఆరోపణలు చేయడం ఇప్పటివరకు ఎన్నడూ జరిగిన దాఖలాలు లేవు. ఇదే సమయంలో మన ఆగర్భ శత్రువు పాకిస్తాన్, దాని డీప్ స్టేట్, కెనడాలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ కెనడియన్ ముస్లిమ్స్ సంస్థ ద్వారా, భారత్–కెనడాల మధ్య సంబంధాలను దెబ్బతీయడానికి కృషిచేస్తోంది.

**కెనడా దిగజారుడు వైఖరి**

ఉగ్రవాదంతో సతమతమవుతూ, దానిపై అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత్‌పై ముఖ్యంగా హోంమంత్రి అమిత్‌షాపై, ట్రూడో ప్రభుత్వం ఆరోపణలు చేయడం రాజకీయ నైతిక పతనానికి పరాకాష్ట. ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నును వెనకేసుకొస్తున్న అమెరికా, ఇప్పుడు జస్టిన్ ట్రూడోను పావుగా వాడుకుంటూ ఇటువంటి దిగజారుడు ఆరోపణలు చేసేలా ప్రోత్సహిస్తోంది. దీనికి తోడు ట్రూడో ఓట్ల రాజకీయం ఇందులో ఇమిడి ఉంది. తాజాగా చైనా, రష్యా, ఇరాన్, ఉత్తరకొరియా, ఇండియాల నుంచి సైబర్ దాడులు జరగే అవకాశ ముందంటూ కెనడా ప్రభుత్వం ఒక నోట్‌ను విడుదల చేయడం ఇందులో భాగమే! భారత్‌పై ఈవిధమైన నోట్‌ను జారీచేయడం ఇదే ప్రథమం. నిజానికి అమెరికా, కెనడాలు ఎంతగా ప్రయత్నించినా భారత్‌ను చికాకు పెట్టగలవేమో కాని, ఇబ్బందికి గురిచేసే స్థాయిలేదు. అంతెందుకు, అమెరికా మనదేశంతో సంబంధాలను ఎట్టిపరిస్థితుల్లో వదులు కోవడం సాధ్యం కాదు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు మనతో సన్నిహిత సంబంధాలు నెరుపుతున్నాయి. ఇక యూరప్ దేశాలు సరేసరి. స్పెయిన్ ప్రధాని పెట్రో సాంజ్ మనదేశంలో పర్యటించి రైలు ప్రాజెక్టులు, కల్చర్, పర్యాటకం మొదలైన ఎం.ఒ.యు.లపై సంతకాలు చేశారు. ప్రధాని మోదీతో కలిసి పెట్రోసాంజ్ వడోదరలో ఒక ప్రైవేటు మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్ ప్లాంట్‌ను ప్రారంభించారు. జర్మనీ మనదేశంతో సంబంధాలను పెంచుకోవడానికి తహతహలాడుతోంది. గ్రీస్ ప్రధాని కైరియోకాస్ మిట్సోటాకిస్, ప్రధానితో తాజాగా జరిపిన టెలిఫోన్ సంభాషణల్లో ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతపై ముచ్చటించారు. ఈ ఏడాది మొదట్లో

ఆయన మనదేశంలో పర్యటించిన తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగయ్యాయి. భారత్-చైనాల మధ్య అంగీకారం కుదిరిన తర్వాత స్విట్జర్లాండ్ మనదేశంలో వంద బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. వాస్తవానికి ఈ పెట్టుబడులను చైనాలో పెట్టాల్సింది. భారత్ మాత్రమే అత్యంత సురక్షితమైన దేశమని విశ్వసించిన స్విట్జర్లాండ్ ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత సానుకూల పరిణామం. అంతేకాదు ఒక్క బుల్లెట్ కాల్చకుండా, సరిహద్దులో ప్రతిష్టంభనకు చక్కటి పరిష్కారం సాధించిన భారత దౌత్యనీతిని, నాయకత్వ పటిమను యూరప్ దేశాలు అభినందిస్తున్నాయి. ఇన్ని పరిణామాల నేపథ్యంలో భారత్‌పై తాను చేసిన ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత ఇప్పుడు కెనడాపై ఉంది. పరిణామాలు పరిశీలిస్తే ఈ ఆరోపణలన్నీ బూమరాంగ్ అయి జస్టిన్ ట్రూడో ప్రభుత్వం మెడకు చుట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

**హిందువులే లక్ష్యం**

ప్రస్తుతం జస్టిన్ ట్రూడో, కెనడాలోని హిందువులను తన రాజకీయ లక్ష్యంగా చేసుకోవడం తాజా పరిణామం. ఖలిస్తానీ ఉగ్రవాదుల నేపథ్యంలో, సిక్కులను, మతఛాందసవాదం నేపథ్యంలో ముస్లింలను హిందువులు వ్యతిరేకించడమే ఇందుకు కారణం. కెనడాలో దీపావళి వేడుకలను రద్దుచేయడం ఇందులో భాగమే. దీనిపై భారత్ తీవ్ర అక్షేపణ తెలపడమే కాదు, ఇది బాధ్యతారహిత చర్యగా పేర్కొంది. కెనడా విపక్షనేత పియర్రీ పోయిలీవర్, ఒట్టావోలోని పార్లమెంట్ హిల్‌లో జరిగే దీపావళి వేడుకలను రద్దుచేయడం అక్కడి ఓటుబ్యాంకు పతన రాజకీయాలకు పరాకాష్ట. గతంలో కెనడాలోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు దీపావళి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు. భారత్‌పై దౌత్యపరమైన దాడులకు మద్దతివ్వాలని జస్టిన్ ట్రూడో విపక్ష పార్టీలను కోరుతున్న నేపథ్యం లో ఈ పరిణామం జరగడం గమనార్హం. ఓవర్‌సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా- కెనడా (ఓఎఫ్ఐసీ) అధ్యక్షుడు శివభాస్కర్, దీపావళి వేడుకల రద్దు విషయంలో పియర్రీ పోయిలీవర్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదిలావుండగా భారత్ తాజాగా కెనడా సరిహద్దు పోలీసు అధికారి సందీప్ సింగ్ సిద్ధూ పేరును విచారణ జరపాల్సిన ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. పాకిస్తాన్‌లోని ఖలిస్తానీ ఉగ్రవాది లఖ్బీర్ సింగ్ రోడెతో సన్నిహిత సంబంధాలు నెరపుతూ, పంజాబ్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాడన్న ఆరోపణలు ఇతగాడిపై వున్నాయి. మొత్తంమీద పరిశీలిస్తే, వచ్చే ఏడాది ఎన్నికల వరకు కెనడా రాజకీయపార్టీలు, ఓట్లకోసం భారత వ్యతిరేక వ్యవహారశైలిని విడిచిపెట్టే పరిస్థితి కనిపించడంలేదు!


– విఠల్



# విపక్షాల

బిహార్‌లో కులగణన జరిగిందనిపించారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా కులగణన చేపడుతున్నది. ఈ నేపథ్యంలో నరేంద్రమోదీ గతంలో ప్రస్తావించిన అంశాల ప్రాధాన్యం గుర్తించాలి. 'మందిని బట్టి హక్కు' అనే కాంగ్రెస్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం ప్రస్తుతమున్న 129 స్థానాలనుంచి 100కు దిగువకు పడిపోతుందన్నారు. ఈ పరిణామాన్ని దక్షిణాది రాష్ట్రాలు అంగీకరిస్తాయా? కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' గ్రూపు దక్షిణాదికి జరిగే అన్యాయంపై ఏం సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. అంతేకాదు కాంగ్రెస్ చెబుతున్న కులగణన వల్ల ముస్లిం మైనారిటీలు తీవ్రంగా నష్టపోతారని కూడా ఆయన చేస్తున్న ఎదురుదాడికి విపక్షాల వద్ద స్పష్టమైన సమాధానం లేక గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టుగా కిమ్మనడంలేదు. ఎంతసేపూ మైనారిటీల బుజ్జగింపు రాజకీయాలు, ఓటు రాజకీయాలు తప్ప అవి వెలగబెడుతున్నదేమీ లేదు. నిజంగా కాంగ్రెస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే, అత్యధిక కాలం అధికారంలో కూడా ఉన్నది ఈ పార్టీయే కాబట్టి, బీసీల అభివృద్ధికి పాటుపడి ఉండేది. కాంగ్రెస్ మాట, చేతలు అన్నీ కేవలం రాజకీయాల కోసమే. ఇప్పుడు విభజన రాజకీయాలే పరమార్థంగా ప్రతి మాట మాట్లాడుతున్నది.

ఇక్కడ గుర్తించాల్సిన అంశమేంటంటే ముస్లింలు, క్రైస్తవుల్లో కూడా వెనుకబడిన వర్గాలవారున్నారు. హిందూ ఉన్నత కులాల నుంచి ముస్లింలుగా మారినవారిని అష్రాఫ్‌లని, హిందూ నిమ్న కులాల నుంచి ఇస్లాంలోకి మారిన వారిని 'అజ్లాఫ్' అని వ్యవహరిస్తారు. అష్రాఫేతరులందరిని ముస్లింలలో వెనుకబడిన తరగతుల వారిగా పరిగణిస్తారు. అజ్లాఫ్, అర్జాల్‌లను కలిపి 'పస్మంద' గ్రూపులుగా వ్యవహరించే విధానాన్ని ప్రస్తుతం అనుసరిస్తున్నారు. అదేవిధంగా క్రైస్తవుల్లో కూడా హిందూ నిమ్నకులాల నుంచి మత మార్పిడులకు గురైనవారు సామాజికంగా ఏవిధమైన ఉన్నత స్థితిని పొందడంలేదు. హిందువుగా ఉన్నప్పుడు పరిస్థితి ఎట్లా ఉందో, అదే పరిస్థితి మతాంతరీకరణ తరువాత కూడా కొనసాగుతోంది. మరి కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు చేస్తున్న వాదన ప్రకారం కులగణన చేపడితే, ఈ మతాల వారిలో కూడా దీన్ని



# వికృత 'కులగణన'!

అమలు చేయాల్సిందే. అప్పుడే మతాతీతంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది.

**హిందీబెల్ట్‌పై విపక్షాల దృష్టి**

కులగణన వల్ల ముఖ్యంగా హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో, వెనుకబడిన వర్గాల ఓట్లను కొల్లగొట్టాలన్నది విపక్షాల వ్యూహం. సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ పార్టీలు సంప్రదాయికంగా వస్తున్న బీసీ ఓటు బ్యాంకును మరింత పటిష్టం చేసుకోవాలంటే సంక్షేమం కంటే, కులగణన అవసరమని భావిస్తున్నాయి. ఈ ఏడాది హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ కూడా క్రిమీలేయర్ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షకు వార్షికాదాయ పరిమితిని పెంచక తప్పలేదు. ఒకరకంగా చెప్పాలంటే కులగణన వల్ల తేనెతుట్టెను కెలకడమే అవుతుంది. ఇప్పటివరకు నడుస్తున్న 'సంక్షేమ రాజకీయాల' నుంచి రాజకీయ పార్టీలు 'కుల రాజకీయాల'వైపు మళ్లుతాయి. దీనివల్ల ప్రతికూల ఫలితాలు తప్ప సానుకూలత ఉండే అవకాశాలు చాలా తక్కువ అనేది ఎవరైనా ఇట్టే చెప్పగలరు.

**మండల్ కమిషన్‌తో మొదలు**


1990 దశకంలో మండల్ కమిషన్ నివేదిక నేపథ్యంలో భారత్‌లో కులరాజకీయాలకు పార్టీలు ప్రాధాన్యతనివ్వడం మొదలైంది. అంతకుముందే ఈ పద్ధతి ఉన్నప్పటికీ, మండల్ కమిషన్ నివేదిక పుణ్యమాని సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్ ఇతర పార్టీలు కుల రాజకీయాలను ముమ్మరం చేశాయి. సరిగ్గా ఇదే సమయంలో హిందువుల ఐక్యత లక్ష్యంగా పనిచేస్తున్న భారతీయ జనతాపార్టీ ఈ కుల రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ముస్లింలు, క్రైస్తవులు తదితర మతాలను వదిలిపెట్టి హిందువుల ఓట్లను మాత్రమే కులాల వారీగా విడగొట్టడం రాజకీయ లబ్ధి కోసమేనని బీజేపీ వాదిస్తూ వస్తోంది. సంప్రదాయికంగా వస్తున్న ఎస్సీ/ఎస్టీ జనాభా గణనను పక్కనబెట్టే విధంగా సామాజిక ఆర్థిక కులగణన (ఎస్‌ఈసీసీ) చేపడితే పరిపాలనా పరమైన అడ్డంకులు ఏర్పడతాయంటూ, కేంద్రం 2021లో ఈ ప్రతిపాదనను తిరస్కరించింది కూడా.

**బిహార్‌లో కులగణన**

2022లో నితిష్‌కుమార్ ప్రభుత్వం రూ.5 బిలియన్ ఖర్చుతో కులగణన చేపట్టింది. ఈ మొత్తాన్ని ఆగంతుక నిధి నుంచి ఖర్చు చేసింది. ఈ సమగ్ర సర్వే రాష్ట్రంలో 214కులాలను నమోదు చేసింది. దీని ప్రకారం ఓబీసీలు 27%, బాగా వెనుకబడిన కులాలు (ఈబీసీలు) 36% ఉన్నట్లు తేలింది. అంటే ఈ రెండు వర్గాలు కలిపి బిహార్ జనాభాలో 63%. ఇక ఎస్సీలు 20%, ఎస్టీలు 1.6%గా తేల్చింది. 2023, నవంబర్ 9న బిహార్ అసెంబ్లీ ఈ అన్ని వర్గాలకు కలిపి ప్రస్తుతం అమలు చేస్తున్న 50% రిజర్వేషన్లను 65%కు పెంచుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కాగా అప్పటివరకు బీసీ మహిళలకు ఇస్తున్న 3% రిజర్వేషన్లను బుట్టదాఖలా చేయడం గమనా ర్హం. దీన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించిన పట్నా హైకోర్టు, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ అసెంబ్లీ తీర్మానాన్ని కొట్టివేసింది. ప్రస్తుతం చేపట్టిన కులగణన ద్వారా, ఆయా వర్గాలకు ఉద్యోగాల్లో ఇప్పటికే తగిన ప్రాతినిధ్యం లభిస్తున్న సంగతి స్పష్టమైనందున, రిజర్వేషన్ల పరిమితిని 50% కొనసాగిస్తూ, క్రిమిలేయర్‌ను రిజర్వేషన్ల పరిధినుంచి తొలగించాలని ప్రభుత్వానికి సూచించింది. అయితే నితిష్ ప్రభుత్వం ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు గడపతొక్కింది. నిజం చెప్పాలంటే గత 50ఏళ్లుగా రిజర్వేషన్లను పొడిగించడమే తప్ప, ఆయా వర్గాలకు అనుకున్న స్థాయి సమానత్వ సాధన జరగలేదు. ఎందుకంటే గతంలో సామాజికంగా అట్టడుగున ఉన్నట్టుగా గుర్తించిన చాలా కులాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదు.

**హిందూ సమాజంపైనే దృష్టి**

కేవలం హిందూ సమాజాన్ని విడగొట్టి రాజకీయ లబ్ధిని పొందేందుకు కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాలు నేడు ప్రజలకు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఇటీవల ఇండియా టుడే కోసం సిఓటర్ దేశవ్యాప్తంగా నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ (ఎంఓటీఎన్) సర్వేలో 74శాతం మంది కులగణన జరపడం సముచితమేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 2024 ఫిబ్రవరిలో నిర్వహించిన ఇదే సర్వేలో 59 శాతం మంది మాత్రమే కులగణనకు మద్దతు పలికారు. అంటే కులగణనకు మద్దతిచ్చేవారి సంఖ్య పెరుగుతున్నదనే అర్థం. అతి స్వల్ప వ్యవధిలో ఈ మార్పు వెనుక ఉన్నది ఏమిటో ఊహించడం కష్టం కాదు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ కులగణన ఓటుబ్యాంకు రాజకీయాల కోసం కాకూడదని స్పష్టం చేస్తోంది. కులాలన్నవి ముస్లింలు, క్రైస్తవులు వంటి మైనారిటీ వర్గాల్లో కొనసాగుతున్నప్పుడు వాటిల్లో కూడా కులగణన చేపట్టాలన్న ప్రధాని మోదీ అభిప్రాయం సముచితం. సెక్యులర్ దేశమని చెప్పినప్పుడు, అందరికీ అన్నీ వర్తించాలి. అంతేకాని కొందరికి కొన్ని మాత్రమే పరిమితం కాకూడదు. విపక్షాలు ప్రధానంగా ముస్లిం మైనారిటీల ఓట్లు గంపగుత్తగా పొందడమే కాకుండా, హిందూ సమాజంలోని వెనుకబడిన కులాలనుంచి కూడా ఓటు బ్యాంకు రాజకీయాలు నెరపాలన్న సంకుచిత ఉద్దేశం స్పష్టంగా వ్యక్తమవుతోంది. అదేమంటే ముస్లింల జనాభా చాలా తక్కువ అయినందున వారిని కేంద్రంగా తీసుకోవాల్సిన అవసరం లేదన్న వాదనలు అసంబద్ధం. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలు, మతాలకు ఒక్కటే నిబంధన అమలవుతుంది. ముస్లింలు తమను తాము ప్రత్యేక వర్గంగా పరిగణించుకుంటూ, ఇతర సమాజంతో కలిసిపోవడానికి ఇష్టపడక పోవడం, ఇతర మతాలను గౌరవించే సంప్రదాయం లేకపోవడం వల్ల సమస్య వస్తోంది. అంతేకాదు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సదుపాయాలను అనుభవిస్తూ, తమకోసం పనిచేసే ప్రభుత్వం కంటే, మతం నిర్దేశించిన వారికి మాత్రమే ఓటు వేయడం, సంకుచిత రాజకీయ పార్టీలకు వరంగా మారింది. వారిలోని బలహీనతను తమ రాజకీయాలకు అనుకూలంగా మలచుకుంటూ అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నారు. తాము రాజకీయ పార్టీలకు పావులుగా మారుతున్నామన్న సంగతిని వారు గుర్తించడం లేదు. ఏ సమాజమైతే ఆధునిక విద్యను, ఆధునిక పోకడలను ఆహ్వానిస్తుందో ఆ సమాజం అభ్యున్నతి సాధిస్తుంది. అటువంటి పురోగామి లక్షణం లేని సమాజం తాను అభివృద్ధి చెందదు, ఇతరులను ప్రగతిపథంలో పయనించ నీయదు. ఇదే ప్రస్తుతం మనదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య!



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# సర్వేలతో పాలన పక్కదారి?



తెలంగాణ రాష్ట్రంలో పాలన పక్కకు జరిగిందా? ప్రభుత్వాలు తమ పంతం నెగ్గించుకోవడం, రాజకీయ ఆకాంక్షలే ప్రధానంగా ముందుకెళ్తున్నాయా? ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా అధికారంలోకి వచ్చిన అప్పటి టీఆర్ఎస్.. ఇప్పటి బీఆర్ఎస్ ఆ ఆలోచనతోనే దశాబ్దకాలం వెళ్లదీసిందా? దాదాపు యేడాది క్రితం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కూడా అదే బాటలో పయనిస్తోందా? ఈ ప్రశ్నలన్నీ తెలంగాణవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జరుగుతున్న పరిణామాలు చూస్తే, ప్రభుత్వాల వైఖరి గమనిస్తే ఈ అంశాలు తేటతెల్లమవుతున్నాయంటున్నారు విశ్లేషకులు. అంతేకాదు.. ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నాయన్న విమర్శలు కూడా ప్రభుత్వాలు మూటగట్టుకుంటున్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పేరిట తమ సమయాన్ని వృథా చేస్తూ, ఓ రకంగా తమ స్వేచ్ఛకు కూడా భంగం కలిగిస్తున్నాయన్న ఆరోపణలు ప్రజల నుంచే వినిపిస్తున్నాయి. ఎందుకంటే 2014లో ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరుతో వివరాలు సేకరించింది. రాష్ట్రం మొత్తం ఒకే రోజు.. ఆ సర్వే చేపట్టింది. డూప్లికేషన్ లేకుండా, పొరపాట్లు దొర్లకుండా, తప్పులు చోటు చేసుకోకుండా.. ఒకేరోజు ఈ సర్వే చేపట్టినట్లు అప్పట్లో టీఆర్ఎస్ సర్కారు ప్రకటనలు చేసింది. 2014 ఆగస్టు 19వ తేదీన యావత్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ ఇంటికే పరిమితమయ్యారు. ఆ రోజు అత్యవసర సేవలు, మీడియా మినహా అన్ని సంస్థలకు ప్రభుత్వం బలవంతపు సెలవు ఇచ్చింది. దీంతో, ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితమయ్యారు. ఆ సర్వేలో నమోదు కాకుంటే అసలు వాళ్లు తెలంగాణ ప్రజలే కాదని, వాళ్లకు సంబంధించిన ఆస్తుల వివరాలు చెప్ప కుంటే ఇకపై ఆ ఆస్తులన్నీ వాళ్లవి కావని అప్పటి ప్రభుత్వం అందరినీ భయపెట్టింది.

తెలంగాణలో ఉండేవాళ్లే కాదు..ఉన్నత విద్య కోసమో, ఉపాధి కోసమో, ఉద్యోగం కోసమో, టూర్లకోసమో తెలంగాణ దాటి వెళ్లిన వాళ్లు, దేశ విదేశాల్లో నివసిస్తున్న వాళ్లు కూడా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరిగిన రోజు తప్పనిసరిగా తెలంగాణలోనే అందుబాటులో ఉండాలని, తమ సొంతింట్లో ఉండి అధికారులకు వివరాలు తెలియజేయాలని సర్కారు ఆదేశించింది. దీంతో, విదేశాల్లో ఉన్నవాళ్లు కూడా 2014 ఆగస్టు 19వ తేదీన తెలంగాణకు వచ్చారు. కేవలం తమ వివరాలు అధికారులకు చెప్పడం కోసం మాత్రమే లక్షల రూపాయలు కూడా ఖర్చు పెట్టి వచ్చి స్వయంగా తమ వివరాలు వెల్లడించారు. మరి.. అప్పుడేమైంది? ఆ తర్వాత ఏం జరిగింది? అసలు ఆ సమగ్ర సర్వే వివరాలే ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాలేదు. అట్టహాసంగా నిర్వహించిన ఆ సర్వే కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్భాటాలకు పోయింది. పదుల కోట్ల రూపాయలు వెచ్చించింది. ఆ కోట్లాది రూపాయలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అసలు ఆరోజు నిర్వహించిన తెలంగాణ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలు ఏ ప్రభుత్వ పథకానికీ పనికి రాలేదు. ఎవరికీ అవసరానికి అక్కరకు రాలేదు. ఎంతోమంది వేల రూపాయలు, లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వాళ్లు ఇతర దేశాల్లో ఉంటున్న వాళ్లు అత్యవసరంగా బస్సులు, రైళ్లు, విమానాల్లో వచ్చి మరీ వివరాలు అందజేశారు. తెలంగాణ కొత్త రాష్ట్రం వచ్చిందన్న సంబరం, కొత్త ప్రభుత్వం ఏదో చేస్తున్న ఆశ అప్పుడు.. అందరినీ ఎంత ఖర్చయినా పర్వాలేదన్న ఆలోచన కలిగించింది. కానీ, వాళ్ల ఖర్చుకూడా వృథా అయ్యిందన్నది నిర్వివాదాంశం.

ఇప్పుడు మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబసర్వేను తెరపైకి తెచ్చింది. అమలు కూడా మొదలెట్టింది. 'తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే' పేరుతో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సర్వేలో ప్రభుత్వంతో పాటు.. కాంగ్రెస్‌పార్టీ హడావిడి కూడా కనిపిస్తోంది.

సర్కారు ఆధ్వర్యంలో చేపట్టాల్సిన సర్వేకు రాజకీయ పార్టీగా కాంగ్రెస్‌పార్టీ ఇన్వాల్వ్ అవడం విమర్శలకు తావిస్తోంది. తెలంగాణలో చేపడుతున్న సమగ్ర కుటుంబసర్వేను కాంగ్రెస్‌పార్టీ జాతీయస్థాయిలో రాజకీయ ప్రయోజనం పొందేందుకు వినియోగించుకుంటోందన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇక, సర్వేలో భాగంగా ఈసారి కూడా అనేక ప్రశ్నలను సంధిస్తున్నారు. మొత్తం 75 ప్రశ్నలతో సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే ఫారాలు రూపొందించింది. ప్రధానంగా తెలంగాణ ప్రజలకు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఉన్న ఆస్తులెన్ని? అప్పులెన్ని? అనేవి లెక్కిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలేమైనా పొందారా? ఆ ఇంట్లోంచి ఎవరైనా విదేశాలకు వెళ్లారా? ఇప్పటివరకు ఆ కుటుంబంలోని వ్యక్తులెవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా? వంటి ప్రధాన ప్రశ్నలను సమగ్ర కుటుంబసర్వే వివరాల్లో చేర్చారు. ఇలా.. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ఈ నెల 6వ తేదీన మొదలయ్యింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తున్నారు ఎన్యూమరేటర్లు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు కూడా వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి, ఉద్యోగ వివరాలను కూడా సేకరిస్తున్నారు. కుటుంబంలో

ఎవరైనా విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఏ కారణంతో వెళ్లారనేది కూడా సర్వేలో నమోదు చేస్తున్నారు.

ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా? వంటి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా విదేశాలకు వెళ్తే కొన్ని దేశాలను గుర్తించి వాటికి ప్రత్యేక కోడ్ కేటాయించారు. యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు ఒక్కో దేశానికి ఒక్కో ప్రత్యేక కోడ్ నమోదు చేస్తున్నారు. ఇవి కాకుండా ఇతర దేశాలకు ఎవరైనా వెళ్లి ఉంటే ఇతర దేశం అనే కోడ్ ఎంచుకుంటున్నారు. ఈ వివరాలు తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు? ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.



ఇప్పటిదాకా తెలంగాణలో ప్రజలు తీసుకున్న రుణాలపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతున్నారు. గత ఐదేళ్లలో ఏమైనా అప్పులు తీసుకున్నారా? ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? ఎక్కడి నుంచి ఆ రుణం పొందారు? అనే ప్రశ్నలను ప్రతి కుటుంబాన్ని అడుగుతున్నారు. బ్యాంకులు, స్వయంసహాయక సంఘాల నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పుల వివరాలు కూడా ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్నారు. ఇక, కుటుంబ సభ్యులందరి స్థిర, చరాస్తుల వివరాలన్నీ ఈ నివేదికల్లో చేర్చుతున్నారు. చరాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేస్తున్నారు. వీటిలో బైకు, స్కూటర్, సొంత అవసరాలకు వాడే కారు, కిరాయికి తిప్పుతున్న కారు వంటివి ఉన్నాయా? ఇంట్లో వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల చరాస్తుల వివరాలన్నీ సేకరిస్తున్నారు ఎన్యూమరేటర్లు. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి ఇవన్నీ ఎన్ని ఉన్నాయి? వాటి విలువ ఎంత అనేది కూడా నమోదు చేస్తున్నారు. ఇక, ఇంటి విషయానికి వస్తే.. ఇల్లు ఎన్ని గజాల్లో నిర్మించారు? ఆ ఇల్లు ఏ ప్రాంతంలో ఉంది? ఇంటిలో ఉన్న మొత్తం గదులెన్ని? బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా? ఇలాంటి వివరాలన్నీ పరిశీలించడంతో పాటు.. కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుంటున్నారు. వ్యవసాయ, వాణిజ్య భూమి ఏమైనా ఉందా? ఉంటే.. ఎంత భూమి, ఎన్ని ఎకరాల్లో ఉంది? అది పట్టా భూమా? లేక ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమా? లేదంటే పట్టాలేని అటవీ భూమా? వంటి వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇక, గడిచిన ఐదేళ్ల కాలంలో ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారా? ఆ పథకాల వివరాలను కూడా సేకరిస్తున్నారు. అటు.. రాజకీయ సంబంధిత కుటుంబమా? అనేది తేల్చేందుకు కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా? అనే వివరాలు నమోదు చేస్తున్నారు. రాష్ట్రపతి, ప్రధాని తప్ప మిగతా ఏ హోదాలో ప్రజాప్రతినిధిగా పనిచేసినా వివరాలు తమ ఫారాల్లో నింపుతున్నారు. వార్డు సభ్యుడి నుంచి కేంద్రమంత్రి, గవర్నర్, సీఎం దాకా ఏ పదవి పొందినా సరే ఈ సర్వేలో వివరాలు నమోదు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేయడానికి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరిట ఈ సర్వే చేపట్టింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరుగుతోంది. దాదాపు 80 వేల మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటున్నారు. వీరిలో విద్యాశాఖ నుంచి 48వేల 229 మందిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రాథమిక పాఠశాలలను ఒంటిపూట నడుపుతున్నారు. మధ్యాహ్నం తరువాత టీచర్లు సర్వే చేస్తున్నారు. ఉపాధ్యాయులే కాకుండా ఇతర కేటగిరీల ఉద్యోగులను సైతం వీలును బట్టి సర్వేకు వినియోగిస్తున్నారు.

సర్వే పూర్తయిన ఇంటిగోడపై స్టిక్కర్ అతికిస్తున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇళ్ల వరకూ సర్వే చేస్తారు. సర్వే చేసిన తర్వాత ఫారాల్లో నమోదు చేసిన వివరాలను వెంటనే కంప్యూటర్లో నిక్షిప్తం చేస్తున్నారు. వీటికోసం ప్రణాళికశాఖ జిల్లా, మండలాల్లో అవసరమైన డేటాఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చింది. ప్రతిరోజూ ఎన్యూమరేటర్లు తీసుకువచ్చిన వివరాల్ని నమోదు చేస్తున్నారు. అయితే, సర్వే సమయంలో కుటుంబం నుంచి తీసుకున్న సమాచారం విషయంలో గోప్యత పాటించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఆ డేటాను ఇతరులకు తెలియజేయకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇప్పుడు బీఆర్ఎస్‌గా మారిన.. అప్పటి టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా అనేకసార్లు విమర్శలు చేసింది. ఆ సర్వే వివరాలు ఏమయ్యాయని నిలదీసింది. అప్పటి ప్రభుత్వం వైఖరిపై ప్రతిపక్షంగా విమర్శలు గుప్పించింది. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఏమాత్రం స్పందించలేదు. ఈ అంశాన్ని పూర్తిగా వదిలేసింది. మరి.. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ కూడా అదే కోవలో పయనిస్తోంది.

అప్పుడు బీఆర్ఎస్‌ను ఎండగట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు మళ్లీ అదే పేరుతో తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబసర్వే నిర్వహిస్తోంది. అయితే, రెంటికీ చిన్న తేడా మాత్రమే ఉంది. అప్పుడు టీఆర్ఎస్ సర్కారు ఒకేరోజు సర్వే చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 25 రోజుల పాటు సర్వే చేస్తామని ప్రకటించింది. అయితే, ఈసారి కూడా సర్వే కోసం వందలకోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరి.. ఈసారైనా ఆసర్వే వివరాలు అటు ప్రభుత్వానికి గానీ, ఇటు ప్రజలకు గానీ ఉపయోగపడతాయా అన్నది ఇప్పటికైతే మిలియన్ డాలర్ల ప్రశ్నగానే చెప్పుకోవచ్చు.

**సుజాత గోపగోని,**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

వైద్య రంగ ప్రక్షాళనకు ఎన్డీఏ ప్రభుత్వం నడుం కట్టింది. ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేస్తున్న మందుల ధరల అవినీతి వ్యవహారంపై ఆ శాఖ మంత్రి వై.సత్యకుమార్ విచారణ చేపట్టారు. ప్రభుత్వాసుపత్రుల్లో సిబ్బంది పనివేళలు పాటించకపోవడం, మందులు, వైద్యపరీక్షల పరికరాలు అందుబాటులో లేకపోవడం, ఉన్నా పనిచేయకపోవడం వంటివి ఆయన దృష్టికి రావడంతో వాటిని పరిష్కరించే పని చేపట్టారు. మౌలిక సదపాయాలు, బోధనాసుపత్రుల నిర్మాణం, ఖాళీల భర్తీ, ఆసుపత్రుల సమగ్ర నిర్వహణపై దృష్టిపెట్టారు. ఆగిపోయిన బోధనాసుపత్రుల నిర్మాణం పూర్తిచేసేందుకు ఢిల్లీ వెళ్లి నీతి ఆయోగ్‌ను కలసి అదనపు నిధుల కోసం ప్రయత్నం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ రకాల పరీక్షా పరికరాలు ఏడాదిలోగా సమకూర్చుకునేందుకు ప్రణాళిక రూపొందించారు.




# వైద్యరంగంలో అవినీతి 'సుస్తీ'కి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాణాధార మందుల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం గుర్తించింది. ఆ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నివేదించాలని సత్యకుమార్ ఆదేశించారు. రాష్ట్ర వైద్యసేవలు, మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ ఐడీసీ) టెండర్ ద్వారా ఎంపికైన మందుల సరఫరా సంస్థ అత్యవసర మందులను ఆసుపత్రులకు బహిరంగ మార్కెట్లో కంటే నాలుగైదు రెట్లు అదనపు ధరలకు విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రాష్ట్రంలోని బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులకు మందుల అవసరాలకు కేటాయించే బడ్జెట్లో 80 శాతంమేర ఏపీఎంఎస్ఐడీసీకి మళ్లిస్తారు. ఈ నిధులతో ఏపీఎంఎస్ఐడీసీ తయారీదారుల వద్ద కొన్న మందులను ఆసుపత్రులకు పంపిణీ చేస్తోంది. మిగిలిన 20 శాతం నిధులతో అత్యవసర మందులను ఆసుపత్రుల సూపరింటెండెంట్లు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో స్థానికంగా కొనే విధానానికి 2022 జులైలో అప్పటి వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. శ్రీకృష్ణ ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఎంఆర్‌ఎలో 35.6 శాతం రాయితీతో మందులు పంపిణీ చేయాలన్న నిబంధనతో టెండరు దక్కించుకుంది. సరఫరా చేయాల్సిన 106 రకాల మందుల జాబితాలో జనరిక్, జనరల్ మందులు ఉన్నాయి. ఈ సంస్థ కోట్ చేసిన ధరకు... హోల్‌సేల్/ రిటైల్ మార్కెట్లో ధరలతో పోల్చితే భారీ వ్యత్యాసం ఉంది. జనరిక్ మందుల దుకాణాలు హోల్‌సేల్‌లో 10 నుంచి 85 శాతం వరకు తగ్గిస్తున్నాయి. జనరల్ మందుల్లోనూ ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. తమకు అందిన ఫిర్యాదుల మేరకు, మంత్రి సత్యకుమార్ కాకినాడ, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖ బోధనాసుప త్రుల నుంచి వివరాలు తెప్పించగా.. ప్రాణాధార మందుల ధరలు బాగోతం బయట పడింది.


మంత్రి వై.సత్యకుమార్

ఇమ్యూనోగ్లోబులిన్ (ఐవీ)ని శ్రీకృష్ణ సంస్థ ఆసుపత్రులకు రూ.12,469కు సరఫరా చేసింది. బయట మార్కెట్లో దీని ధర రూ. 6,300 నుంచి రూ.9,400 మధ్య ఉంది. ఇలాగే పలు మందులు ఆసుపత్రులకు ఇచ్చిన ధరల్లో దాదాపు సగానికే బయట మార్కెట్లో దొరుకుతున్నాయి. ఈ ఐదు ఆస్పత్రుల్లోనే కృష్ణా ఫార్మాస్యూటికల్స్ రూ.46 కోట్ల మేర అధిక ధరలకు మందులు సరఫరా చేసిందం టున్నారు. డీఎంఈ పరిధిలో 30 ఆస్పత్రులు ఉండగా.. సెకండరీ గ్రేడ్ హెల్త్ (ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్) పరిధిలో 200 ఆస్పత్రులు నడుస్తున్నాయి. వీటన్నింటికీ 20 శాతం మేర కృష్ణా ఫార్మాస్యూటికల్స్ మందులు సరఫరా చేసింది. ఐదు ఆస్పత్రుల్లోనే రూ.46 కోట్లు తేడా వస్తే ఈ మొత్తం ఆస్పత్రులన్నింటికి సరఫరా చేసిన మందులలో భారీ ఎత్తును స్కాం జరిగిందన్న వాదనలు బలపడు తున్నాయి. అసలు పూర్వ విధానాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చింది? దీనికి కారకులు ఎవరు? అధిక ధరలతో ఖజానాకు ఎంతమేర నష్టం వాటిల్లింది? నిరోధక చర్యలు, ఇతర వివరాలపై సమగ్రంగా విచారణ జరిపి, నివేదిక అందజేయాలి' అని సత్యకుమార్ తమ శాఖ అధికారులను ఆదేశించారు. ఇకపై ఆసుపత్రులు కమిటీల ద్వారా స్థానికంగానే మందులను కొనాలని స్పష్టంచేశారు.

**బోధనాసుపత్రుల నిర్మాణానికి ప్రాధాన్యత**

రాష్ట్రంలో బోధనాసుపత్రుల నిర్మాణం కుంటుపడిన నేపథ్యంలో వీటి నిర్మాణాన్ని సత్వరం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు మంత్రి ప్రయత్నాలు చేస్తున్నారు. బోధనాసుపత్రులకు చెందిన కళాశాలల నిర్మాణం పూర్తిచేయకపోవడంతో 500 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రాలేదు. రాష్ట్రంలో రెండు, మూడు దశల్లో 12 కొత్త వైద్య విద్యా కళాశాలలు నిర్మించాల్సి ఉండగా, అందులో పాడేరు, పిడుగురాళ్ల కళాశాలల నిర్మాణం కేంద్రం సాయంతో జరుగుతోంది. కొత్త వైద్య కళాశాలలను ఒక్కోదానిని దాదాపు రూ.500 కోట్ల ఖర్చుతో నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కళాశాల నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ.200 కోట్ల ఖర్చవుతుందని అంచనా. మొత్తం 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటును 2021లో ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన నాటి ప్రభుత్వం, వాటి నిర్మాణంలో మాత్రం పూర్తి నిర్లక్ష్యం వహించింది. రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధుల్ని కూడా సరిగా విడుదల చేయకుండా కేంద్రంతో పాటు నాబార్డు ఇచ్చిన నిధుల్ని కూడా పెద్ద మొత్తంలో దారి మళ్లించడంతో ఈ కళాశాలల నిర్మాణంలో తీవ్ర ఆలస్యం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో అన్య



# చికిత్స

మార్గాల ద్వారా కొత్త కళాశాలల నిర్మాణాన్ని చేపట్టాలని సత్యకుమార్ భావించారు. సుదూర, జిల్లా స్థాయిలో ఈ కళాశాలల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉన్నందున కేంద్రం నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం ఆయన నీతి అయోగ్‌తో చర్చించారు. జిల్లా ఆస్పత్రులలో క్రిటికల్ కేర్ బ్లాకుల్ని అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే సాయంపై కూడా చర్చించారు. ప్రమాదాలు, ట్రామా కేర్ కేసులు ఎక్కువ అవుతున్నందున ఈ సేవల్ని పటిష్టం చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 15 యాస్పిరేషనల్ బ్లాకుల్లో వివిధ రంగాల అభివృద్ధికి కేంద్రం సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా ఆయా బ్లాకుల్లో వైద్య సేవల అభివృద్ధికి కేంద్రం సాయంపై కూడా మంత్రి చర్చించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్థానిక పరిస్థితుల దృష్ట్యా మరికొన్ని అదనపు బ్లాకులను యాస్పిరేషన్ బ్లాకులుగా గుర్తించాలని మంత్రి నీతి అయోగ్‌ను కోరారు.

## వైద్య సదుపాయాలపై చర్యలు

రాష్ట్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల పర్యటనలో గంటల కొద్దీ రోగులు వేచి ఉండటాన్ని గమనించిన మంత్రి , వైద్య సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. అరగంట వ్యవధిలో అవుట్ పేషంట్ (ఓపీ)లకు సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. తాము పొందిన సేవలపై రోగుల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించాలని నిర్ణయించారు. ఆసుపత్రుల నిర్వహణలో, వైద్య సిబ్బంది అవినీతి అక్రమాలు, తదితర అంశాలపై ప్రస్తుతం ఆడిటింగ్ జరిపిస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల పనితీరు మెరుగుకై 30 అంశాల కార్యాచరణ ప్రణాళికను స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రాదిపదికన అమలు చేయాలని నిర్ణయించారు. అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చడం, వైద్యాధికారులు, సిబ్బందికొరత నివారణకై ఖాళీపోస్టులను భర్తీచేయాలని భావించారు.

## త్వరలో పోస్టుల భర్తీ

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 వేల వైద్యాధికారులు అవసరం ఉండగా, ప్రస్తుతం 3,100 వైద్యాధికారుల కొరత ఉంది. ఆ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో అంతరాయం ఉండరాదని, ఆసుపత్రులకు బకాయిలు చెల్లింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. మొదటి విడతలో రూ.162 కోట్లు, రెండోవిడతలో నేడు రూ.200 కోట్లు ఇచ్చారు. త్వరలో మరో రూ.300 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. స్వల్పకాలిక ప్రణాళికలో భాగంగా మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో ఆసుపత్రులు, వాటిల్లోని మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తారు. సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తారు. ఓపీ వార్డులకు దగ్గరగా వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఫలితాలను మధ్యాహ్నం 2 గంటలకు రోగుల సెల్ఫోన్లకు సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఉదయం రోగులను చూసిన వైద్యులు.. మధ్యా హ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలి. అరకుతో పాటు రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో విస్తరించిన సికెల్‌సెల్( రక్తహీనత) నివారణలో భాగంగా వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సదుపాయం అందచేయాలని, బ్లడ్ బ్యాంక్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## హాజరుపై పర్యవేక్షణ


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యున్నత ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రులు వరకు వైద్యులు, సహాయక సిబ్బంది. హాజరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. నిర్దేశిత సమయానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మూడు రోజుల పాటు నిర్ణీత సమయానికి హాజరు కాకపోయినా, గైర్హాజరయినా ఒక రోజు వేతనం కోత విధిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఎఫ్ఆర్ఎస్ విధానంలో వైద్య సిబ్బంది హాజరు నమోదుకు రూపొందించిన యాప్‌ను, దానిద్వారా సెప్టెంబరులో నమోదైన హాజరును మంత్రి పరిశీలించారు. పనివేళల నిబంధనను ఉల్లంఘించే వారికి ఆటోమెటిక్ షోకాజ్ జారీ చేసేలా మార్పులు చేయాలని మంత్రి ఆదేశించారు.

## వైద్యపరికరాలపై దృష్టి


ప్రభుత్వాసుపత్రుల్లో ఏడాదిలోగా ఎక్స్‌రే యంత్రాలు, సీటీ స్కాన్లు, వెంటిలేటర్లు, అల్ట్రాసౌండ్ సిస్టమ్స్ వంటి పరికరాలు, యంత్రాలను సమకూర్చుకునేందుకు మంత్రి చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును అనుసరించి రేటింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అన్ని సర్వజన ఆసుపత్రుల్లో కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ, యూరాలజీ, గ్యాస్ట్రో, ఎండోక్రైనాలజీ, క్యాన్సర్, రేడియేషన్ అంకాలజీ, ఇతర సూపర్ స్పెషాలిటీ వైద్యులను అందుబాటులోకి తెస్తారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో కొత్తగా ఏర్పాటైన సీటీస్కాన్ మెషీన్‌ను ప్రారంభించారు.

టైర్ -2 సెంటర్‌గా ఉన్న గుంటూరు జీజీహెచ్ కేన్సర్ కేంద్రానికి త్వరలో పెట్‌స్కాన్ ఇతర ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చి కేన్సర్ వైద్యంలో టైర్-1 సెంటర్‌గా మారుస్తారు. సీఎస్ఆర్ కింద నాట్కో ఫార్మా జీజీహెచ్‌లో రూ.45కోట్లతో అత్యాధునిక కేన్సర్ సెంటర్‌ను నిర్మించడం పట్ల మంత్రి సత్యకుమార్... నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పోరేట్ వ్యవహారాలు) నన్నపనేని సదాశివరావును అభినందించారు. నాట్కో బాటలో ఇతర కార్పోరేట్ కంపెనీలు ముందుకు వచ్చి జీజీహెచ్‌కి చేయూతనివ్వాలని కోరారు.

ఇటీవల కృష్ణానదికి, బుడమేరుకు, ఏలేరు వరద బాధితులకు ఆరోగ్య సమస్యల పరిష్కారంలో అత్యంత చాకచక్యంగా, సమర్థంగా వ్యవహరించారు. వైద్య శిబిరాలు నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలించారు. విజయవాడ పరిధిలోని 32 డివిజన్లలో 131కి పైగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరాల్లో అల్లోపతి, ఆయుష్ విభాగాలకు చెందిన వైద్యులచే వైద్య పరీక్షలుచేసి బీపీ, షుగర్, జ్వరం, జలుబు, దగ్గు, మలేరియా తదితర సమస్యలకు మందులు అందచేశారు. 450 మంది ఏ.ఎన్.ఎం., ఆశా కార్యకర్తలు, వీఎంసీ సిబ్బంది ఇంటింటా వ్యాధులు సర్వేలో పాల్గొన్నారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో ముందస్తు నివారణ చర్యలు తీసుకున్నారు. వార్డు సచివాలయ పరిధిలో ముగ్గురు మల్టీపర్పస్ హెల్త్ సహాయకులు, సూపర్‌వైజర్లు, శానిటేషన్ సిబ్బందిని సర్వేకు నియమించారు. ఏలేరు వరద ప్రభావ ప్రాంతంలో కూడా వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు వైద్య సదుపాయం, మందులు అందచేశారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్




44

# విజ్ఞానశాస్త్రం శంకరుని అద్వైతానికి సన్నిహితమవుతోంది

ఆదిశంకరుల అవతారం వల్లనే వేదాలు, రుషిప్రోక్త గ్రంథాలు మళ్లీ ప్రజలలోకి ప్రవేశించాయని కంచికామకోటి పీఠాధిపతి, పరమాచార్య శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి అభిభాషించారు. శ్రీరామ నవమి, నరసింహ జయంతి, శ్రీకృష్ణ జయంతి, ఉత్తరాయణ సంక్రాంతి, శివరాత్రి మొదలగు పవిత్ర దినాలు మన జీవన స్రవంతిలోకి రావడానికి ఆది శంకరుల అవతారం ఫలమని, విజ్ఞానశాస్త్రం శంకరుని అద్వైతానికి సన్నిహితమవుతోందని ఆయన ప్రవచించారు. అసలు శంకరుడెవరు? అతడు లోక శంకరుడు. అతడు సర్వ ప్రపంచానికి సౌభాగ్య ప్రదాత. సాక్షాత్ శివుడు.శివం అంటే శుభకరమైనది.

శంకరనామంలోని 'శం' అంటే సుఖం, ఆనందం. దానికి ప్రియం అని అర్థం చెప్పుతుంది బృహదారణ్యకోపనిషత్. సామాన్య ప్రజానీకానికి 'శం', 'ప్రియం', 'ఆనందం' ఎక్కడ దొరుకుతాయో తెలియదు. అందువల్లనే వారు ప్రాపంచిక దుఃఖాలతో సతమతమవుతూంటారు. ఆ విధంగా బాధపడుతున్న ప్రపంచాన్నిచూచిన శ్రీ భగవత్పాదులవారి హృదయం కనికరంతో కరిగిపోయింది. మానవులు ఆత్మాను భూతి బ్రహ్మానందాన్ని పొందేటట్లు చెయ్యాలని భావించారు.

శ్రీశంకరులవారు బ్రహ్మానందాన్ని అవగతం చేసుకొని దుఃఖాల నుంచి దూరమయ్యారు. అయితే బ్రహ్మానందమంటే ఏమిటి? శ్రీశంకరులు అంటారు..' మానవుని ఆత్మయే సుఖం లేక బ్రహ్మానందం. ఆత్మయే సర్వస్వం, అదే బ్రహ్మం. మనం చూచేదంతా బ్రహ్మమే. ప్రతిదీ బ్రహ్మం ఫలితమే. కారణమే ఫలితం కూడాను. కాన కారణం, ఫలితం రెండూ భేదమైనవి కావు. ప్రతిదీ 'శం' లేక ఆనందమే. ఈ ఆనందాన్ని మనం ప్రతి అనుభవంలోను పొందాలి. దానిని ప్రతి వ్యక్తి తన అంతరాత్మగా అనుభూతి పొందాలి.

ప్రతి వస్తువూ ఆత్మకు సంబంధించినది. కాబట్టే ఈ ప్రపంచంలో ఆత్మకు బాహ్యమైన ప్రతి వస్తువూ ప్రియమైనదిగా ఉన్నది. చిట్టచివరకు ప్రతి ఒక్కరికీ ఆత్మయే ప్రియమైనది అవుతుంది. బ్రహ్మం నుంచి ఆత్మ వేరుగాదని తెలుసుకొనడమే పరమానందం.

పరమాత్మ ఒక్కడేనని, ప్రతి వస్తువూ పరమాత్మే నని, కనుక అంతా ఒక్కటేనని శంకరులు ఉపదేశిం చారు. సర్వమూ బ్రహ్మమేనని వేదాలు ఘోషిస్తు న్నాయి. వేదాలు చెబుతున్న వాటినే శంకరులు కూడా ఉపదేశించారు. ప్రతి వస్తువూ బ్రహ్మమేననీ, బ్రహ్మానికి వేరు ఏమీ లేదని చెప్పారు. కాని జగత్తు మాత్రమే సత్యమైనదని, బ్రహ్మం మిథ్యే అని చార్వాకుల భావం. "న్యాయ" తార్కికులు, మరి ఇతర ద్వైతుల భావంలో జగత్తూ, బ్రహ్మం రెండూ సత్యమే. ఇక బౌద్ధులు జగత్తూ బ్రహ్మం రెండూ లేవు పొమ్మన్నారు. బ్రహ్మం మాత్రమే సత్యమైనదనీ, బ్రహ్మంతో సంబంధం లేక, స్వతస్సిద్ధంగా ఈ జగత్తుకు అస్థిత్వం లేదని శంకరుల ఉపదేశం.

బౌద్ధయుగంలో కూడా అంతకు పూర్వం నుంచీ ప్రచారంలో ఉన్న దర్శనాల ప్రాబల్యం లేకపోలేదు. చార్వాక సిద్ధాంతం తనకు ముందున్న సిద్ధాంతాల స్థానాన్ని ఆక్రమించలేకపోయింది. కానీ శ్రీశంకరుల అద్వైత తత్వం ప్రచారంలోకి రాగానే తత్పూర్వం నుండి ఉన్న విధానాలన్నీ సూర్యోదయంతో కాంతివిహీనమైన తారకల్లాగా అయిపోయాయి. అనంతమైన జగజ్జ్యోతి ముందు ఈ చిరుదీపాల కాంతి వెలవెలపోతుందని వేరే చెప్పాలా! భక్తి మార్గాలు, తత్వోపాసనాది గుణాలు, యోగ సమాధి, తంత్ర ఆచారాది విభిన్న మార్గాలు అన్నీ కూడా నలుదిశల నుండి ప్రవహించే నదులన్నీ సముద్రంలో కలిసినట్లే అద్వైత ఆత్మ అనంత ఆనందంలో సమ్మిళితమవుతాయి. ఈ మార్గాలన్నిటికీ కూడా ఆ పరమానందమే ధ్యేయం.


**వర్ణాశ్రమ ధర్మాలు :** ఆత్మోద్ధరణకు, ఆత్మనైర్మల్యానికి వేదానుసరణీయంగా, శ్రీ భగవత్పాదులు ఇంకా తదితర ఆచార్యులు ప్రవచించిన ధర్మోపదేశాలు ప్రజలు వారి వారి వర్ణాశ్రమ ధర్మాలకు అనుగుణంగా వేదోక్త ధర్మాన్ని గ్రహించి ఆచరణలో పెట్టుకోవాలని నిర్దేశిస్తున్నాయి. ప్రజలలో ఒకరికొకరు సహాయం చేసుకునే దృక్పథాన్ని పెంపొందించటానికి వీలుగాను, లేక సమాజం సామాన్యమైన భౌతిక శ్రేయస్సుకు అభివృద్ధిపరచడానికి మాత్రమే శాస్త్రాలు ఈ వర్ణాశ్రమ ధర్మాలను విధించలేదు. వాటిని మన ఆత్మోద్ధరణకుగాను నిర్ణయించారు.

**– శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి, 22.5.59 జాగృతి**

ఆధ్యాత్మికం

మన రుషులు

# దేవతాసముడు శరభంగుడు



దండకారణ్యం ఆవాసంగా గల మహర్షి శరభంగుడు. దేవతాసముడు. బ్రహ్మాదిదేవతల సాక్షాత్కారం, సాక్షాత్తు శ్రీరామచంద్రునితో మన్నన అందుకున్న మహాతపస్వి. ఆయన తపస్సుకు మెచ్చి ఆయనను స్వర్గలోకానికి తీసుకువెళ్లేందుకు ఇంద్రుడు స్వయంగా భువికి దిగివచ్చాడు. శ్రీరాముడు సతీ సోదరులు సీతాలక్ష్మణ సమేతంగా వనవాసం గడిపే వేళ అసురసంహారం చేస్తూ, అక్కడి పలువురు మునులు,రుషులను దర్శిస్తున్నాడు. అందులో భాగంగా శరభంగుని ఆశ్రమానికి చేరాడు. అప్పటికే మహాతేజస్వరూపుడు భూమిపై దిగాడు. దేవతలు, గంధర్వులు, సిద్ధులు ఆయనను స్తుతిస్తున్నారు. ఆయన దేవవిభుడు ఇంద్రుడు. ఆశ్రమంలో మహర్షితో ముచ్చటిస్తున్నాడు. రాముడి రాకను శర భంగుడు దివ్యదృష్టితో గ్రహించాడు. వెలువల నిరీ క్షిస్తున్న శ్రీరాముడు, 'తమ్ముడూ ఆకాశంలో కనిపించే దివ్యరథం. మధ్యాహ్న సూర్యునిలా, ఆకుపచ్చ గుర్రాలతో ఎంత కాంతిమంతంగా ఉందో చూడు' అని అన్నాడు. ఆ రథరక్షణకు సాయుధులైన యువకులు అంతా దేవతలేనంటూ రాముడు తాను విన్నది, ఊహించుకున్నది తమ్ముడికి చెప్పాడు. అటు ఆశ్రమం లోపల మహర్షితో ముచ్చటిస్తున్న ఇంద్రుడు, 'రాముడు మీ దర్శనార్థమై వస్తున్నాడు. ఆయన మహాద్భుత కార్యం నిర్వర్తించాలి. ఇప్పటికి సెలవు తీసుకుంటున్నాను. ఆ తరువాతే ఆయనను దర్శి స్తాను. ఆయన మిమ్మల్ని ఇప్పుడు సందర్శిస్తాడు.

# సంకర్షణుని అవతారం రామానుజులు

44

ద్వాపర కలియుగాల సంధిలో ఆళ్వారులు ఉన్నారని శ్రీవైష్ణవుల విశ్వాసం. వారిలో ఎంతోమంది శూద్రులు, ఒక స్త్రీ, ఒక రాజు కూడా ఉన్నారు. వారి రచనలు 'నాలాయిర ప్రబంధం' అని ప్రసిద్ధి. అలా ఒక ఆళ్వారులు భక్తి గంగను ప్రవహింపజేయుచుండగా, మరొక వంక మహా మేధావంతులగు ఆచార్య ప్రవరులు – ద్రవిడాచార్య, గుహదేవ, టంక, శ్రీవత్సాం కాదులు బ్రహ్మసూత్రాలపై భాష్యం, టీకాలు రాసి విశిష్టాద్వైతాన్ని పుష్టి చేశారు. విశిష్టాద్వైత గురుపరంపర ఇలా ఉంది. శ్రీ మన్నారాయణుడు జగజ్జనని శ్రీ మహాలక్ష్మికి ఉపదేశించాడు. ఆమె, భగవత్పార్షదుడైన విష్వక్సేనునికి, ఆయన శఠకోపస్వామికి, ఆయన శ్రీనాథమునికి, ఆయన పుండరీకాక్షునికి, ఈయన రామమిశ్రునికి, ఆయన యామునాచార్యులకు ఉపదేశించారు.

పదవ శతాబ్దికి చెందిన శ్రీనాథ మునికి పౌత్రుడు యామునాచార్యులు. యామునుల శిష్యుడు శ్రీశైలపూర్ణుని సోదరి కాంతిమతియను కేశవ సోమయాజిని వివాహమాడారు. వారికి శ్రీరామానుజులు సాధారణ శకం 1017లో భూతపురి (శ్రీ పెరుంబుదూర్)లో జన్మించారు. రామానుజా చార్యులు సంకర్షణుని అవతారమని శ్రీ వైష్ణవులు భావిస్తారు. ఆయన కాంచీనగరంలో యాదవ ప్రకాశకుల వద్ద విద్యను అభ్యసించారు. (అంతకు ముందే ఆయన 16వ ఏట వివాహం చేసి తండ్రి పరమపదించారు). అల్పకాలంలోనే రామానుజులు వేదాంత నిష్ణాతుడయ్యారు.

ఆయన సునిశిత బుద్ధి ప్రేరితములైన ప్రశ్నలకు సమాధానమివ్వడం గురువుకు కష్టమైంది. రామానుజుల ఖ్యాతి వ్యాపింపసాగింది. యామునాచార్యులు ప్రచ్ఛన్న రూపంలో వచ్చి ఈయనను చూచివెళ్లారు. శిష్యుని అపారప్రతిభ, తర్కపటిమ చూచి యాదవ ప్రకాశులు అసూయ చెందారు. అంతేకాక ఆ సమయంలోనే ఆ దేశ రాచకన్యను బ్రహ్మ రాక్షసుడు పట్టగా రామానుజులు ఆమె శరీరాన్ని తన పాదంతో తాకి బ్రహ్మరాక్షసుని పారదోలారు. దానితో యాదవ ప్రకాశుల ఈర్ష్య హద్దుల దాటింది. ఒకనాడు గురువు "సర్వం ఖల్విదం బ్రహ్మ", నేహ నానాస్తి కించన" అనే ఉపనిషద్వాక్యాన్ని వ్యాఖ్యానిస్తుండగా, రామానుజులు దానిని ఖండించి మరొక విధంగా వ్యాఖ్యానించారు. దానిపై ఆగ్రహం పొందిన గురువు రామానుజుల ప్రాణం తీయడానికి కుట్ర పన్నారు. రామానుజులు తీర్థయాత్రకు వెళ్లేలా, ఆయనను ప్రయాగలో గంగలో పడవేసేలా యాదవ ప్రకాశులు ఏర్పాటు చేశారు. కాని తన సహాధ్యాయి, పినమ్మ కుమారుడు గోవిందభట్టు ద్వారా విషయం గ్రహించిన రామానుజులు తీర్థయాత్రను విరమించి వెనుకకు వచ్చారు. దారిలో ఎన్నో చిక్కులను ఎదుర్కొన్నారు. ఆయన వరదరాజ స్వామి శరణుజొచ్చారు. భగవంతుడు ఆయనను రక్షించేందుకు భిల్ల రూపమును దాల్చి తోడు వచ్చి కాంచీపురానికి సురక్షితంగా చేర్చారు. అక్కడ రామానుజలకు కాంచీపూర్ణుడను




శూద్రభక్తునితో చెలిమి ఏర్పండింది. రామానుజుడు తిరిగి యాదవ ప్రకాశుల వద్ద అధ్యయనం ప్రారంభించారు. కాని తిరిగి 'కస్యాసం పుండరీకం' అనే మంత్రార్థంపై ఇద్దరి మధ్య తీవ్ర వివాదం వచ్చింది. యాదవుడాయనను తనవద్ద నుంచి తరిమివేయగా నాటి నుండి రామానుజులు కాంచీ పురంలోని హస్తి శైలంపై గల నారాయణుడిని నమ్ముకొన్నారు.

అక్కడే యామునాచార్యులు రాసిన "స్తోత్రరత్నము"ను ఆయన శిష్యుడు మహాపూర్ణస్వామి చదువుచుండగా మొదటగా విని, మహాపూర్ణునితో గలసి యామునాచార్యుల సందర్శనార్థము శ్రీరంగం బయలుదేరారు. ఆయన అక్కడికి చేరకముందే యామునాచార్యులు పరమపద ప్రాప్తి పొందారు. రామానుజులు వారి పార్థివ దేహాన్ని మాత్రమే చూడగలిగారు . యామునుల మూడు వేళ్లు ముకుళితములై ఉండడాన్ని గమనించిన రామానుజులు అందుకు కారణం అడగగా, తీరని తన మూడు కోర్కెలు లెక్క పెడుతూ యామునులు ప్రాణము విడిచారని శిష్యులు తెలిపారు.

**– కె.సచ్చిదానందమూర్తి, 22.5.59 జాగృతి**

---

ఇదంతా తమకు తెలియనిది కాదు'అంటూ నిష్క్రమించాడు. ఆయన పోకను గమంచిన రామచంద్రుడు ఆశ్రమంలోకి ప్రవేశించి, అగ్నికార్యం ఆరంభిస్తున్న మహర్షికి సతీసోదర సమేతంగా పాదాభివందనం చేశాడు. మహర్షి వారికి ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. 'ఆత్మ సాక్షాత్కారం పొందిన వారికి బ్రహ్మ పథం సులభం అంటారు. అందుకే స్వర్గానికి తీసుకువెళ్లేందుకు ఇంద్రుడు వచ్చాడు. కానీ నీ రాక సమాచారం ఎరిగిన నేను నీ దర్శనానంతరమే వస్తానని బదులిచ్చాను' అని మహర్షి వివరించాడు.

రామదర్శనం కన్నా ఏదీ మిన్న కాదన్న భావన ఆ మాటలలో వ్యక్తమైంది. అంతేకాదు...తాను జయించిన స్వర్గ, బ్రహ్మలోక అక్షయ భోగ భాగ్యాలను స్వీకరించాలని కోరాడు. దానికి రాముడు 'క్షత్రియునికి ప్రదానమే తప్ప స్వీకరణశక్తి లేదు. ఆ శక్తి ఫలాలను తమ వద్దనే ఉండనివ్వండి. తగు సమయంలో నేను సముపార్జించుకుంటాను' అని వినయంగా పలికాడు.

తాము కొంతకాలం ఈ ప్రాంతంలో ఉండాలనుకుంటున్నామని, అందుకు అనువైన ప్రదేశాన్ని సూచిస్తే, కృతజ్ఞుడనై ఉంటానని కూడా కోరాడు. ఆయన మాటలకు పరమానంద భరితుడైన మహర్షి 'రామా! పశ్చిమాభిముఖంగా వెళితే, సుతీక్ష్ణ మహర్షి సహకరించగలడని సూచించారు.

'రామా..నాదో విన్నపం. నీ సముఖంలో నేనీ జీర్ణ దేహాన్ని త్యజిస్తాను. నీవు చూస్తే తరిస్తాను అంటూ అగ్ని ప్రవేశం చేశారు. మూడు పదులు వయసు గల యువకుడు అగ్ని నుంచి ఉద్భవించి బ్రహ్మ లోకానికి పయనమయ్యాడు.

**– రామచంద్ర రామానుజ**

---

## వివేకానంద సూక్తిశతి

**Ask nothing want nothing in return give what you have to give, it will come back to you multiplied thousand fold-but the attention must not be on that.**

స్వీయలాభ దృష్టి నీయందు లేకుండ
పరులకొరకు పంచి పాటుపడిన
వేయిరెట్లు ఫలము వేయి చెప్పగనేల
వినుడి స్వామి సద్వివేకవాణి!!





బండిరాజుల శంకర్



ఖర్గే

ఎన్నికల వేళ ముందూ వెనుకా చూసుకోకుండా ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించడం... అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం అధికారమే పరమావధిగా భావించే కుటుంబ పార్టీలకు అలవాటైన పని. ఆ జాబితాలో ముందు వరసలో ఉండే కాంగ్రెస్ అయితే అలవికాని హామీలిచ్చి ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం వెన్నెతో పెట్టిన విద్య. ఎన్నికల వేళ గ్యారెంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించి గత కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చలేక తలలు పట్టుకుంటున్నాయి. 'గ్యారెంటీ' ఫార్ములాతో ఇటీవలి హరియాణా ఎన్నికల్లోనూ గెలవాలని ప్రయత్నించిన కాంగ్రెస్ చావుదెబ్బ తిన్నది. కారణం– తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు హరియాణపై ప్రభావం చూపాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇచ్చిన గ్యారెంటీ హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నిస్తే హస్తం పార్టీకి సమాధానం లేకపోయింది. దీంతో హరియాణా ప్రజలు విశ్వసనీయత లేని కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మలేదు. ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. రానున్న మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అలవికాని హామీలతో ముందుకు వెళ్తే తలబొప్పి కట్టడం ఖాయమని భయపడిన కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర బడ్జెట్‌ను బట్టి వాగ్దానాలు ఇవ్వాలని ఇప్పుడు హితోపదేశం చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు ఉరి

కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలే గుదిబండగా మారాయి. ఎన్నికల హామీలు అమలు చేయలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నాయి. తెలంగాణ విషయానికి వస్తే ఎన్నికల వేళ కాంగ్రెస్ 6 గ్యారెంటీలతో ఊదరగొట్టింది. ప్రధాన స్రవంతి మీడియా, సోషల్ మీడియా సాయంతో పెద్దఎత్తున ప్రచారం చేసింది. అంతకుముందు ఉన్న కేసీఆర్ ప్రభుత్వంపై అగ్గి మీద గుగ్గిలంలా ఉన్న ప్రజలు ఈ గ్యారెంటీలపై నమ్మబలికిన కాంగ్రెస్‌కు ఓటేశారు. గద్దెనెక్కాక ఓట్లేసి గెలిపించిన ప్రజలను మరచి, ఇచ్చిన హామీలను విస్మరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ గ్యారెంటీ అమలుకు నోచుకోవడం లేదు. అది కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూనే మరోవైపు బస్సులను తగ్గించారు, ట్రిప్పులను కుదించారు. దీంతో ఆర్టీసీపైనే ఆధారపడే సామాన్యుడికి అవసరానికి బస్సులు రావడం లేదు. ఖరీదైన లగ్జరీ బస్సులు, ప్రైవేటు ట్యాక్సీలు, క్యాబ్ సర్వీసులపై ఆధారపడాల్సిన దుస్థితి తలెత్తడంతో చేతి చమురు భారీగా వదిలించుకోవాల్సి వస్తోంది. ఉన్న అరకొర బస్సులు సైతం విపరీతమైన రద్దీతో కాలు మోపలేని పరిస్థితిలో ఉన్నాయి. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాల్సిన ఆర్టీసీ బస్సు ప్రయాణం నరకంగా మారింది. పురుషులే కాదు, మహిళలు సైతం నీరుగారుస్తున్న ఉచిత బస్సు ప్రయాణం హామీపై శివాలెత్తుతున్నారు.

మహిళలకు ఇస్తానన్న రూ. 2500 ఆర్థిక సాయం హామీ ఇంతవరకు లేదు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ కొంతమందికే అందుతోంది. ఉచిత విద్యుత్‌నూ కొందరికే వర్తింప చేసి చేతులు దులిపేసుకుంది. రైతు భరోసా పేరుతో రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరానికి రూ. 15,000 చొప్పున పెట్టుబడి సాయం చేస్తామని హామీ ఇచ్చి అది ఇవ్వకపోగా, ఇప్పటివరకు ఉన్న రూ. 10,000 రైతుబంధు సాయానికీ బందు పెట్టింది. వ్యవసాయ కూలీలకు చేస్తానన్న రూ. 12,000 ఆర్థిక సాయం అటకెక్కింది. వరికి రూ. 500 బోనస్ అని ఇప్పుడు సన్నొడ్లకే అని మెలిక పెట్టింది. ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, రూ. 5 లక్షల సాయం, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్య భరోసా కార్డు, నెలకు రూ. 4000 పెన్షన్ వంటి హామీలేవీ ఒక్క అడుగు ముందుకు పడలేదు.

కర్ణాటక కాంగ్రెస్ సర్కారులోనూ ఇవే వైఫల్యాలు. అంతోఇంతో అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'శక్తి' పథకానికి కూడా బ్రేక్ వేసే యోచనలో ఆ ప్రభుత్వం ఉంది. ఈ పథకాన్ని సమీక్షిస్తామంటూ ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ అన్న వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. 10 గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలు ఇచ్చి హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సైతం సరిగ్గా ఇవ్వలేని దుస్థితికి దిగజార్చింది.

కొందరు కొంత మందిని కొంత కాలం మోసం చేయగలుగుతారు. ఎల్లకాలం మోసం చేయడం సాధ్యం కాదు. ప్రజలకు అర్థమైన రోజు కర్రు కాల్చి వాత పెడుతారు. హరియాణాలో అదే జరిగింది. రానున్న మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లోనూ ఇది పునరావృతం అవుతుందని బెంగ పట్టుకుందో ఏమో మల్లికార్జున ఖర్గే రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగానే వాగ్దానాలు ఇవ్వాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు గ్యారెంటీ హామీలు అమలు చేయడం లేదని ఖర్గే పరోక్షంగా అంగీకరించారు. ఖర్గే వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనదైన శైలిలో చురకలంటించారు. అమలు చేయలేని వాగ్దానాలు ఇవ్వడం సులభమే కానీ వాటిని సక్రమంగా అమలు చేయడం కష్టమని లేదా అసాధ్యమని కాంగ్రెస్ గ్రహిస్తోందన్నారు. ఎన్నటికీ నెరవేర్చలేరని తెలిసీ వారు ప్రచారంలో హామీలు గుప్పిస్తూనే ఉంటారని, ఇప్పుడువారు ప్రజల ముందు

# బిగిస్తున్న ఉచితాలు

దోషులుగా నిలబడ్డారని ఎండగట్టారు. "కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న ఏ రాష్ట్రానైనా– హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ– పరిశీలించండి... అభివృద్ధి గమనం, ఆర్థిక ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. వారు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. ఇది ఆయా రాష్ట్రాల ప్రజలకు భయంకరమైన మోసం. ఇలాంటి రాజకీయాల బాధితులు పేదలు, యువకులు, రైతులు, మహిళలే. వారికి ఈ వాగ్దానాల ప్రయోజనాలు అందకుండా చేయడమే కాదు, కొనసాగుతున్న పథకాలను కూడా నీరుగారుస్తున్నారు. కాంగ్రెస్ ప్రాయోజిత బూటకపు వాగ్దానాల సంస్కృతిపై దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి! హరియాణా ప్రజలు వారి అబద్ధాలను ఎలా తిప్పికొట్టారో... స్థిరమైన, అభివృద్ధి ఆధారిత, కార్యాచరణతో నడిచే ప్రభుత్వాన్ని ఎలా ఇష్టపడతారో ఇటీవల చూశాం. కాంగ్రెస్‌కు వడే ఓటు దుష్పరిపాలన, బలహీనమైన ఆర్థికం, అంతులేని దోపిడి కోసమే అని యావత్ భారతదేశం భావిస్తోంది. ఇప్పుడు భారతీయులు అభివృద్ధి, పురోగతిని కోరుకుంటున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అంతర్గత కలహాలతో తలమునకలై ఉంది. అభివృద్ధి ఆలోచన అనేదే లేకుండా దోపిడీకి పాల్పడుతోంది. అంతేకాదు, ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కూడా ఉపసంహరించుకుంటోంది. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. తెలంగాణలో రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలోనూ హామీ ఇచ్చిన అలవెన్సులను ఐదేళ్లపాటు అమలు చేయలేదు. కాంగ్రెస్ పనితీరును చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి." అని ఎక్స్‌లో ట్వీట్‌లు పెట్టి హస్తం పార్టీ వైఖరిని ఎండ గట్టారు. ఈ ట్వీట్‌తో పాటు పెట్టిన హ్యాష్ ట్యాగ్ FakePromises Of Congress ట్రెండింగులోకి వచ్చిందంటే ప్రజలు ప్రధాని వ్యాఖ్యలను ఎంతలా సమర్థిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.




ప్రధాని మోదీ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రధాని నగ్నంగా బయటపెట్టడంతో అప్రమత్తమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిస్పందనగా అబద్ధాలను వండి వారుస్తూ ట్వీట్ పెట్టారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు కానీ తగ్గించిన బస్సులను, కుదించిన ట్రిప్పుల గురించి పేర్కొనలేదు. 22.22 లక్షల రైతుల రుణాలు మాఫీ చేశామన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 38.63 లక్షలకు పైగా రైతులు రుణమాఫీకి అర్హులు. అంటే మరో 16–17 లక్షల రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదని అంగీకరించినట్టే. అంతేకాదు, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక స్వయంగా రేవంత్ రెడ్డే రూ. 40వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు రూ. 18వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని చెప్పుకొచ్చారు. రూ. 22వేల కోట్ల మేరకు రైతులు నష్టపోయారనే భావించాల్సి ఉంటుంది. 50వేల ఉద్యోగాలిచ్చాం అన్నారు, కానీ అందులో చాలా వరకు నోటిఫికేషన్లు గత ప్రభుత్వంలో జారీ చేసినవే. వాటికి నియామక పత్రాలు అందించి తామే ఉద్యోగాలిచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి, చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి హామీలేవీ ప్రస్తావించలేదు. ఇలా అవాస్తవాలు, అర్ధసత్యాలతో తెలంగాణను కమ్ముకున్న చీకట్లను దాచిపెట్టే ప్రయత్నం చేస్తూ ఉదయించే సూర్యుడిలా వెలుగుతోందని చెప్పుకొచ్చారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతూ తననెవరూ చూడలేదని అనుకుంటుంది. రేవంత్ రెడ్డి ట్వీట్ కూడా అచ్చం అలానే ఉంది.

అసెంబ్లీ ఎన్నికల వేళ గ్యారెంటీల పేరుతో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేమని అంగీకరించడమేమల్లికార్జున ఖర్గే వ్యాఖ్యల పరమార్థం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ 6 గ్యారెంటీలు.. డిక్లరేషన్ల పేరుతో రైతులు, మహిళలు, యువకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తనతో సహా సోనియా, రాహుల్, ప్రియాంకలు చేసినవన్నీ బూటకపు వాగ్దానాలేనని ఖర్గే పరోక్షంగా ఒప్పుకొన్నారు. తెలంగాణలో అధికారంలో కొనసాగే నైతికత కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదు. ఏరు దాటేదాక ఓడ మల్లన్న... ఏరు దాటాకబోడమల్లన్నఅన్నది కాంగ్రెస్ తీరు అని మరోసారి నిరూపితమైంది.

**– భువన**


జాగృతి నిర్వహించిన ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి
స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక
నవలల పోటీలో ద్వితీయ బహుమతి రచన
తూర్పు పడమర



వచ్చేవారం నుంచి..
గన్నవరపు నరసింహమూర్తి




# నూతన ప్రపంచ

**రెండు దశాబ్దాల కిందట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాలతో కూడిన కూటమికి 'బ్రిక్స్' అంటూ గోల్డ్‌మాన్ సాక్స్ చైర్మన్ జిమ్ ఓ నీల్ నామకరణం చేసినప్పుడు, అది ఒక శక్తిమంతమైన భౌగోళిక రాజకీయ, పాశ్చాత్యేతర శక్తిగా ఎదుగుతుందని ప్రపంచం ఊహించి ఉండదు. అర్థ దశాబ్దకాలంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్న తరుణంలో బ్రిక్స్ భావనకు ప్రాధాన్యత పెరిగి, బహుళధ్రువ, డాలరేతర ప్రపంచం దిశగా పరివర్తనకు అధికారికంగా రష్యాలోని**

ఏకధ్రువ ప్రపంచంలో డాలర్‌ను ఆయుధీకరించి అమెరికా చేస్తున్న అకృత్యాలతో, దాని పెత్తనంలో ఉన్న ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల నియంత్రణలతో విసిగిపోయిన గ్లోబల్ సౌత్‌గా ప్రాచుర్యం పొందిన పేద, బలహీన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలూ అమెరికాకు ప్రత్యామ్నాయం కోసం ఆరాటపడుతున్న తరుణంలో బ్రిక్స్ భావన బలపడింది. ముఖ్యంగా, ఉక్రెయిన్ యుద్ధం, రష్యాపై ఆంక్షలు, రష్యా భారత్, చైనాలు తమ తమ కరెన్సీలలో వ్యాపారం జరుగుతున్న క్రమంలో బ్రిక్స్ భావన బలం పుంజుకుని, దాని ప్రాధాన్యత పెరిగింది. భౌగోళిక వైవిధ్యం కారణంగా ఈ కూటమి పట్ల తొలుత కొన్ని అనుమానాలు వ్యక్తమయినప్పటికీ, వారి ఆర్థిక పథాలలో ఉన్న పోలికల వల్ల వాస్తవంలో ఒక బలమైన, ప్రబల సంకీర్ణంగా బ్రిక్స్ ఉద్భవించిందంటూ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండా మీడియాతో అన్న మాటలు అక్షర సత్యం. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు తమ దేశీయ కరెన్సీలలో ఇతర సభ్య దేశాలతో వ్యాపార లావాదేవీలను నిర్వహించుకునేందుకు ఈ వ్యవస్థ సౌలభ్యాన్ని కల్పిస్తోంది.

**ఏమిటీ బ్రిక్స్, బ్రిక్స్ ప్లస్?**

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికానే కాకుండా తమతో సహకరించే ఇతర దేశాలను కూడా కలుపుకొని బ్రిక్స్ వేదిక ఏర్పడింది. ప్రస్తుతం సమష్టిగా ఈ వేదిక 44.3శాతం ప్రపంచ జనాభాను, 29.5 శాతం భూభాగాన్ని, ప్రపంచ జీడీపీలో 30.8 శాతానికీ ప్రాతినిధ్యం వహిస్తోంది. కొనుగోలుశక్తి సమానత్వం (పిపిపి–పర్చేజింగ్ పవర్ ప్యారిటీ) విషయానికి వస్తే ప్రపంచ జీడీపీలో 49.7 శాతంగా ఉంది. తమ విలువలను పంచుకుని, తమతో సహకరించాలనుకునే దేశాలకు ద్వారాలు తెరిచే ఉంటాయని, బ్రిక్స్‌ను 'భాగస్వామ్య రాజ్యాలు' అనే నూతన శ్రేణి ద్వారా విస్తరించేందుకు చర్చిస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించడం గమనార్హం. అంటే, బ్రిక్స్ దాదాపు ప్రస్తుతమున్న ఏకోన్ముఖ అంతర్జాతీయ క్రమానికి పూర్తి ప్రత్యామ్నాయంగా ఆర్థిక, సాంస్కృతిక వైవిధ్యాలను గౌరవించుకునే విధంగా ముందుకు రానుంది.

ఇటీవలే రష్యాలోని కజాన్‌లో జరిగిన సదస్సులో చేసిన ప్రకటనలు నూతన ప్రపంచ క్రమ ప్రాధాన్యానికి తెరలేపుతున్నాయి. సంక్లిష్టమైన అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించడంలో విఫలం అవుతున్న పాశ్చాత్య నాయకత్వంలోని ప్రపంచ క్రమానికి కాలదోషం పట్టి, అసంగతమవుతోందన్నది నిపుణుల భావన. ఎదుగుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వృద్ధిని ఈ క్రమం విస్మరిస్తోందని వారంటున్నారు. ప్రస్తుతం బ్రిక్స్ చేపట్టిన 'ఆహార ధాన్యాల మార్పిడి' అన్న చొరవ అంతర్జాతీయ ఆహార ధాన్యాల ధరలను నిర్ధారించేందుకు నిజాయితీతో గల సూచికలుగా ఉపయోగపడనున్నాయి. 'ఈ చొరవను అమలు చేయడం ద్వారా తమ జాతీయ మార్కెట్లలో బహిర్గత శక్తుల జోక్యం, సట్టావ్యాపారం, కృత్రిమ ఆహార కొరతను సృష్టించే యత్నాల నుంచి బ్రిక్స్ దేశాలను పరిరక్షిస్తుంది.'

**ప్రపంచ సంస్థల్లో అస్తిత్వంలేక అసంతృప్తి**

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఏ అంతర్జాతీయ సంస్థల్లోనూ భారత్ సహా పలు దేశాలకు శాశ్వత ప్రాతినిధ్యం లేకపోవడం ఒక లోపం. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ స్థానాన్ని కోరుతున్న ప్పటికీ, వారు విస్మరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గ్లోబల్ నార్త్ (అభివృద్ధి చెందిన దేశాలు)కు అతిపెద్ద ఉత్పత్తిదారులు, వినియోగదారులూ కూడా అయిన గ్లోబల్ సౌత్ దేశాలు పాశ్చాత్య నాయకత్వంలోని ఆర్థిక సంస్థలలో తమకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం పట్ల అసహనంతో ఉన్నారు. ఈ క్రమంలోనే ఈ దేశాల మధ్య సంఘీభావం పెరిగి, ప్రస్తుత వ్యవస్థ పట్ల తమ అసంతృప్తిని నేరుగా వ్యక్తం చేస్తున్నారని అంతర్జాతీయ సంబంధాల విశ్లేషకులు అంటున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగానే పాశ్చాత్యేతర కూటములు అయిన బ్రిక్స్ వంటివి పరస్పర గౌరవం, భాగస్వామ్య ప్రయోజనాలతో వేదికలను అందించడంతో దాదాపు మూడు డజన్ దేశాల నుంచి ఆసక్తి రేకెత్తిందని నిపుణులు అంటున్న మాటల్లో నిజం లేకపోలేదు. వృద్ధి చెందుతున్న లేదా ఉద్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థలకు, గ్లోబల్ సౌత్ సంక్షేమానికి బ్రిక్స్ ప్లస్ ప్రాధాన్యతను ఇస్తోంది. బ్రెట్టన్ వుడ్స్ (రెండవ ప్రపంచ యుద్ధానంతరం జరిగిన ఒప్పందం), ఇతర పాశ్చాత్య వ్యవస్థలను ఏకపక్షంగా రూపొందించి, 'తమకు సరైనదే ప్రపంచానికి కూడా సరైనదనే'




# క్రమానికి నాంది

**కజాన్‌లో జరిగిన సమావేశంలో పునాదులు పడ్డాయి. వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ ఆర్థిక క్రమానికి కీలక వృద్ధి యంత్రాలుగా మారుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రిక్స్, 134 అంశాలతో కూడిన తన 'కజాన్ డిక్లరేషన్'లో ప్రజాస్వామిక ప్రపంచ క్రమాన్ని, సమానత్వాన్ని, పారదర్శకత, నిజాయితీతో కూడిన సంబంధాలతో బహుళపాక్షికతను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని, ప్రపంచ, ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారం, ప్రజా సంబంధాల ప్రతిబింబించింది.**

వైఖరితో ఈ దేశాల అవసరాలను తీర్చడంలో విఫలమయ్యాయని, అందుకే బ్రిక్స్ పుట్టిందని విశ్లేషకుల అంటున్నారు.

వనరులను దోచుకునేందుకు ఒక ప్రాంతంగా మాత్రమే ప్రపంచంలోని ఇతర దేశాలను పరిగణించే పాశ్చాత్య దృక్పథం వల్లనే ప్రపంచ అభివృద్ధిలో నేటి అసమతుల్యతలు సంభవించాయన్నది వాస్తవం. ఈ దృక్పథం అసమానతలను కొనసాగించడమే కాక, సమానత్వం, సహకారంతో కూడిన ప్రపంచ చట్రాన్ని ఏర్పరచే అవకాశాన్ని ఆటంకపరుస్తోంది. ప్రపంచ వ్యవస్థలోని సంక్లిష్టతలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఈ చట్రాన్ని ఒక ప్రాథమిక అవసరంగా గుర్తించడం కీలకం. అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రపంచాల మధ్య ఉన్న అసమానతలను పూడ్చేందుకు బ్రిక్స్‌లో ఉద్భవిస్తున్న ఆర్థికవ్యవస్థల బలాన్ని ఉపయోగించడం అవసరమనే భావన ఉంది. ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకొని, భాగస్వామ్యాలను పెంచి పోషించడం ద్వారా అన్ని ప్రాంతాలకూ లబ్ధి చేకూరేలా మరింత సమతలుమైన, సమానమైన ప్రపంచ చట్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు.

## పారదర్శకత, సమానత్వమే లక్ష్యాలు

గ్లోబల్ సౌత్ అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ఆహారం, ఇంధన భద్రత అన్నవి అత్యవసరం. అయితే, ఇందుకు బ్రిక్స్ సభ్యుల మధ్య బలమైన విశ్వాసం ఉండాలన్నది ఆర్థికవేత్తల మాట. పాశ్చాత్య నాయకత్వంలోని వ్యవస్థాగత, ఆర్థిక, అంతర్జాతీయ గవర్నెన్స్ పట్ల ప్రతి చోటా అసంతృప్తి పెరుగు తోంది. ప్రతి దేశం కూడా తమను కలుపుకు పోవాలని, పారదర్శకత, సమానత్వం ఉండాలని కోరుతున్నప్పటికీ, ఉనికిలో ఉన్న బహుపాక్షిక వేదికలు వీటిని నెరవేర్చడం లేదన్న విషయం బహిరంగ సత్యం. ఈ అంతరాన్ని పూడ్చాలన్న లక్ష్యాన్ని బ్రిక్స్ పెట్టుకున్నట్టుగా కనిపిస్తోంది. బ్రిక్స్ ప్లస్ సహకార యంత్రాంగంతో పరస్పర లాభదాయకమైన, నిలకడైన పరిష్కారాలను అందిస్తూనే, ఫలవంతంకాని మరొక పాశ్చాత్య వ్యతిరేక వ్యవస్థగా ఈ కూటమి మారకుండా భారత్ నివారించాలని వారు చేస్తున్న సూచన గంభీరంగా పరిగణించవలసిన విషయం.

## బ్రిక్స్ కరెన్సీకి ఇంకా సమయముంది

కాగా, బ్రిక్స్ సదస్సు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఒక కరెన్సీని ప్రకటిస్తుందని, అలాగే వ్యాపార ఆర్థిక లావాదేవీలకు స్విఫ్ట్‌కు ప్రత్యామ్నాయం ఉంటుందని చాలా బలమైన వాదనలు షికార్లు చేశాయి. అయితే, బ్రిక్స్ ప్రస్తుతానికి అటువంటి ప్రకటనలు ఏమీ చేయలేదు. తమ దేశీయ కరెన్సీలలో బహుపాక్షిక వాణిజ్య ఒప్పందాలను చేసుకునేందుకు బ్రిక్స్ ఒక అంగీకారానికి వచ్చింది అంతే. గతంలో బ్రెటైన్ వుడ్స్ సృష్టించినట్టుగా ఒక నూతన ప్రపంచక్రమానికి కజాన్‌లో జరిగిన బ్రిక్స్ నాంది పలికింది. దీని ప్రాముఖ్యత అంతా బహుళధ్రువ ఆర్థిక ప్రపంచానికి అధికారికంగా ప్రారంభించడంలోనే ఉంది. అయితే ఇది, ఉనికిలో ఉన్న ప్రస్తుత వ్యవస్థను రాత్రికి రాత్రే మార్చివేస్తుందనుకుంటే పొరపాటే. ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ దిశగా చోటు చేసుకోనున్న మార్పుకు ఇది తప్పనిసరిగా ఒక విశ్వసనీయ అడుగు అనడం అతిశయోక్తి కాదు.

## స్విఫ్ట్ గుత్తాధిపత్యానికి పోటీ?

ప్రస్తుతం స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్) ద్వారా మాత్రమే ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక చెల్లింపులు, లావాదేవీలనేవి స్విఫ్ట్ ద్వారానే చోటు చేసుకుంటున్నాయి. ఇది వినడానికి అత్యంత సాంకేతికంగా అనిపించినా, ప్రపంచ ఆర్థిక నాడీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ వ్యవస్థ ప్రపంచంపైనే పూర్తి గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. అది రోజుకు కొన్ని ట్రిలియన్ల డాలర్ల మారకాన్ని ఒక దేశం నుంచి మరొక దేశానికి మళ్లించేందుకు దాదాపు 40 మిలియన్ సందేశాలను ప్రాసెస్ చేస్తుందిట! ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న యూపీఐ ప్రపంచవ్యాప్తంగా లావాదేవీలు సాగిస్తే ఎలా ఉంటుందో ఊహించండి.

అటువంటి ఆర్థిక చెల్లింపు వ్యవస్థ ఖాతాలకు ప్రమాణం అవసరం, దీనితోనే వాణిజ్య ఉత్పత్తుల ధరలు నిర్ణయిస్తారు, తద్వారా లావాదేవీలు జరుగుతాయి. అమెరికా అధిపత్యానికి లంకె కలిపే కీలకం ఈ ఖాతాల వ్యవహారంలోనే ఉంది. ఈ స్విఫ్ట్ ఖాతాకు ప్రమాణం డాలర్ కావడమే అమెరికా ఆధిపత్యానికి దారి తీసింది. కృత్రిమమైనదైనా-డాలర్‌కు బలమైన

డిమాండ్‌ను సృష్టించేందుకు మార్గాన్ని సుగమం చేసింది.

ఇక్కడే సమస్యలు తలెత్తుతున్నాయి. స్విఫ్ట్ గుత్తాధిపత్యం, దాని డాలర్ ఉపయోగం కారణంగా, ప్రపంచ వాణిజ్యంలో పాల్గొనడానికి దేశాలు గణనీయమైన డాలర్ నిల్వలను నిర్వహించాలి. దీనితో డాలర్ ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా మారింది. ఈ నిల్వలు అమెరికా ట్రెజరీ బాండ్ల రూపంలో ఉండడంతో, వాషింగ్టన్‌కు అది కామధేనువుగా మారింది. ప్రపంచంలోని మిగిలిన దేశాలు వారి డాలర్ రిజర్వ్‌ను నిర్మించుకోవడానికి – వాణిజ్యం కోసం అమెరికా ట్రెజరీలను కొనుగోలు చేయడం మినహా మరొక మార్గం లేకుండా పోయింది. ఆ గుత్తాధిపత్యంతోనే, డాలర్‌ను గ్లోబల్ రిజర్వ్ కరెన్సీగా స్థాపించడమే కాకుండా ఇతర దేశాలపై ఆంక్షలు విధించే సామర్థ్యాన్ని అమెరికాకు స్విఫ్ట్ అందిస్తుంది.

**అమెరికా ఆంక్షలకు బ్రిక్స్ విరుగుడు**

అమెరికా ఆంక్షలు విధించడమంటే, లక్ష్యం చేసుకున్న దేశపు బ్యాంకులను స్విఫ్ట్ వ్యవస్థ నుంచి తొలగించి, దానిని ప్రపంచ వాణిజ్యంలోకి రాకుండా నిరోధించడమన్నమాట. ఈ పనిని అమెరికా దశాబ్దాలుగా చేస్తూ వస్తోంది. దీనికి విరుగుడుగా, సుముఖంగా ఉన్న భాగస్వాముల మధ్య ద్వైపాక్షిక దేశీయ కరెన్సీలతో లావాదేవీలను నిర్వహించుకునే అవకాశాన్ని బ్రిక్స్ ప్రతిపాదిస్తోంది.




ఇప్పటికే ఈ వ్యవస్థ అమలులోకి వచ్చింది కూడా. ఇటీవలి కాలం వరకూ, అమెరికాను సవాలు చేస్తూ, ఆంక్షలు విధించిన దేశాలతో వ్యాపారలావా దేవీలు జరిపేందుకు దేశాలు సుముఖంగా లేవు. అయితే, రష్యాపై ఆంక్షలు విధించిన తర్వాత పరిస్థితి మారిపోయింది. భారత్, చైనా సహా పలు దేశాలు రష్యాతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రారంభించి, సఫలం అవుతుండడంతో పలు దేశాలు ఈ తరహా వాణిజ్యం పట్ల మొగ్గు చూపుతున్నాయి.


**అమెరికా ఆర్థిక ఆధిపత్యానికి చిక్కులు**

మొత్తం ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 35–40 శాతం వాణిజ్యం బ్రిక్స్ సభ్యులు, వారి నూతన భాగస్వామ్య దేశాల మధ్య జరుగుతోంది. ఈ వాణిజ్యంలో సగం ద్వైపాక్షిక, బహుళ పాక్షిక వాణిజ్యం వైపు మళ్లినా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భూకంపం వస్తుంది. దీనితో వాణిజ్య సరళులను ప్రతిబింబించే కేంద్ర బ్యాంకు రిజర్వుల్లో దశాబ్దం దశాబ్దమున్నర కాలంలో డాలర్ నిల్వలు పడిపోయే అవకాశం ఉంది. ఫలితంగా, ఆర్థిక శక్తిగా అమెరికా ఆధిపత్యానికి తీవ్రమైన దెబ్బతగలడమే కాదు, అది విధించబోయే ఆంక్షలలో పస ఉండదు.

ఏది ఏమైనా ఎటువంటి అట్టహాస ప్రకటనలు లేకుండానే నిశ్శబ్దంగా ప్రత్యామ్నాయ ఆర్థిక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటూ, డాలర్ ఆధిపత్యం క్రమ క్షీణతకు నాంది పలికినదిగా కజాన్ సదస్సును రానున్న తరాలు గుర్తుపెట్టుకుంటాయి. ఈ మార్పులు తక్షణమే కనిపించకపోయినా, దిశ మాత్రం స్పష్టం.

ప్రపంచ వాణిజ్యం, విత్తమనే గొప్ప చదరంగంలో బ్రిక్స్ ఇప్పుడు అత్యంత సూక్ష్మమైనదైనా, నిర్ణయాత్మకమైన ఎత్తువేసిందని ఆర్థిక విశ్లేషకులు అంటున్న మాటలు వాస్తవం కావాలని ఆశిద్దాం.

– డి. అరుణ



# బాంగ్లాదేశ్‌లో తీవ్ర విద్యుత్ సంక్షోభం

**బాం**గ్లాదేశ్‌లో నోబెల్ బహుమతి గ్రహీతగా చెలామణి అయిన మహ్మద్ యూనస్ ప్రభుత్వం దేశాన్ని మరింత సంక్షోభంలోకి తీసుకువెడుతోందే తప్ప పరిష్కారాల దిశగా తీసుకువెళ్లడం లేదన్నది నానాటికీ స్పష్టమవుతోంది. రాజకీయ సంక్షోభంతో పాటుగా దేశాన్ని అంధకారంలోకి దేశాధినేతలే మళ్లిస్తున్న వైనం కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోంది.

దేశానికి విద్యుత్‌ను సరఫరా చేస్తున్న అదానీ గ్రూప్‌నకు బకాయిలు చెల్లించని కారణంగా కోత విధించడంతో విద్యుత్ సంక్షోభం తీవ్రం కానుంది. అదానీ పవర్ ఝార్ఖండ్ లిమిటెడ్ (ఎపిజెఎల్) తమకు చెల్లించవలసిన బకాయిల కారణంగా బాంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తున్న విద్యుత్‌లో 50శాతానికి పైగా కోత పెట్టింది.

బాంగ్లాదేశ్ పవర్ గ్రిడ్ ప్రకారం, అదానీ గ్రూపు విద్యుత్ సరఫరాను 1496 మెగావాట్ల నుంచి 700 మెగావాట్లకు తగ్గించింది. దీని కారణంగా, ఇస్లామిక్ రిపబ్లిక్‌లో నవంబర్1వ తేదీ నాటికి 1600 మెగావాట్ల విద్యుత్ కొరత అయ్యి, పరిస్థితి తీవ్రమైంది. బాంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసే ముందు, తమ బకాయిలను 30 అక్టోబర్ నాటికల్లా చెల్లించమని ఆ దేశ విద్యుత్ అభివృద్ధి బోర్డును ఏపీజేఎల్ కోరింది. ఈ మేరకు అదానీ గ్రూప్ నుంచి బాంగ్లాదేశ్ విద్యుత్ కార్యదర్శికి లేఖ కూడా వెళ్లింది. విద్యుత్ అభివృద్ధి బోర్డు 170.03 మిలియన్ డాలర్లకు బాంగ్లాదేశ్ కృషి బ్యాంకు నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (పరపతి పత్రం) లేదా బకాయిపడ్డ 846 మిలియన్ డాలర్లను చెల్లించడం కానీ జరుగలేదని ఏపీజేఎల్ వెల్లడించింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) కింద అక్టోబర్ 31 నుంచి విద్యుత్ సరఫరాకు కోతపెట్టి తాము పరిహారక చర్యలు తీసుకోక తప్పదని అదానీ గ్రూప్ ఆ లేఖలో హెచ్చరించింది. ఇంతకు ముందు అదానీ గ్రూపు ఈ గడువును 20 అక్టోబర్ నుంచి 30 అక్టోబర్ వరకూ పొడిగించింది.

ప్రస్తుతం సగం విద్యుత్తునే అందిస్తున్న అదానీ సంస్థ నవంబర్ 7వ తేదీ నాటికి తమ బకాయిలు చెల్లించకపోతే, పూర్తి సరఫరాను నిలిపివేస్తామంటూ యూనస్ సర్కార్‌ను హెచ్చరించింది. ఇదిలా ఉండగా, తాము అదానీ గ్రూపుతో చర్చలు జరుపుతున్నామని బాంగ్లాదేశ్ విద్యుత్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఒక్క నెలలో మొత్తం బకాయిలు చెల్లించడం తమ వల్ల కాదని, చెల్లింపు మొత్తాన్ని క్రమంగా పెంచుతామని ఆయన వివరించారు. ఇప్పటికే, అక్టోబర్ నెలలో తాము 97 మిలియన్ డాలర్ల మొత్తాన్ని అదానీకి చెల్లించామని, ఇది గతంలో మూడు చెల్లింపులకన్నా చాలా ఎక్కువమొత్తమని ఆయన భావన. ★



మానవుడికి ప్రేమ, ఐకమత్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మికచింతన లాంటివి దివ్యసంపద. అవి మనిషిని 'మనీషి' చేస్తాయి. ఆ లక్షణాలు లోపించినప్పుడు ఎన్ని సంపదలు ఉన్నా వృథా. నేను మనిషిని మాత్రమే చూస్తాను. అతడు ధరించిన మత పరమైన దుస్తులు, విశ్వాసాలతో నిమిత్తం లేదు.. బాహ్య ప్రపంచాన్ని జయించాలనుకునే ముందు స్వీయ లోపాలను సరిదిద్దుకోవడం అత్యంత ముఖ్యం... ఇది సిక్కు మతప్రవక్త గురునానక్ దేవ్ ప్రబోధం.

# ఆధ్యాత్మికతలోనే సమసమాజం

ప్రస్తుత పాకిస్థాన్‌లోని రావీ నదీతీరంలోని నన్ కానా సాహిబ్ (తల్వాండి)లో 1469లో సంప్రదాయ కుటుంబంలో జన్మించిన గురునానక్‌దేవ్ అవతార పురుషుడుగా ఆరాధనలు అందుకుంటున్నారు. ఐదేళ్ల వయస్సు నుంచే నిరంతరం దైవ నామస్మరణ చేస్తుండేవారట. చిన్నతనం నుంచి ప్రశ్నించి, ఆలోచించే తత్వం కలిగిన ఆయన హిందూ మతంలోని తాత్త్వికత పట్ల ఆకర్షితులై జీవిత రహస్యాల అన్వేషణకు ఇల్లు వదలివెళ్లారు. ఏకాత్మ, పరమాత్మ తత్వాలను ప్రజలకు బోధించారు. ఆయన బోధించిన సిక్కు ధర్మం గురుశిష్య సంప్రదాయానికి సంబంధించినది.

సామాజిక అంశాలను ఆధ్యాత్మికతకు జోడించి మానవ జాగృతికి తపించిన మహనీయుడు గురునానక్‌దేవ్. 'అహంకారం మనిషికి అతి పెద్ద శత్రువు. దానిని విడనాడి వినయం, సేవాభావంతో జీవితాన్ని గడపాలి. మతం, కులం, తెగలకు అతీతంగా మనుగడ సాగించాలి. మానవసేవే మాధవసేవ అనే సూక్తికి సమాంతరంగా సేవా దృక్పథాన్ని అనుసరించాలి. అహం, గర్వం, కోరికలు వదిలి అందరితో ప్రేమపూర్వకంగా మెలగాలి. సమభావం కలిగి ఉండాలి' అని ఉద్బోధించారు. మూఢాచారాలకు, బూర్జువా విధానాలకు, అంధ విశ్వాసాలకు ఆయన ఉపాసన పద్ధతి పూర్తిగా వ్యతిరేకం.

సృష్టిలో ఎవరి కన్నా ఎవరూ తక్కువా, ఎక్కువా కాదంటూ, స్త్రీపురుషుల మధ్య వివక్షను నిరసించారు. భగవంతుని కృపకు ఇరువురు సమపాత్రులేనని అభిప్రాయపడ్డారు. పురుషులకు జన్మనిస్తున్న మహిళలు వారి కంటే ఎలా అల్పులు? అని ప్రశ్నించారు. మహిళలను పరిపూర్ణంగా గౌరవించడంతో పాటు వారికి సమాన ప్రతిపత్తి కల్పించాలని, స్త్రీపురుషుల మధ్య అంతరాలను తొలగించాలని ఐదు శతాబ్దాల క్రితమే ప్రబోధించారు. 'స్త్రీలు చెడ్డవారైతే గొప్పగొప్ప మహారాజులకు ఎలా జన్మనిచ్చేవారు? వారిని ఎలా పెంచేవారు?' అన్నది ఆయన సూటి ప్రశ్న.

ఆయన సర్వేశ్వరవాది. బాహ్యాచారాలు, ఆడంబరాల కంటే, మానసిక సాధన ద్వారానే దేవుడు ప్రీతి చెందుతాడని, అన్ని ప్రాణులలో భగవంతుని చూడగలిగిన వారే ఆయనకు అత్యంత ప్రీతిపాత్రులని బోధించారు. 'నిరాకారుడైన భగవంతుడిని విగ్రహారాధన, తీర్థయాత్రలు, ఇతర కర్మకాండల ద్వారా కనుగొనలేం. జీవకోటికి తండ్రిలాంటి పరమాత్మను అన్నిట చూడగలినవారే భగవత్ కృపకు పాత్రులవుతారు. స్వార్థరహితంగా సత్కార్యాలు ఆచరించడమే ముక్తికి మార్గం. నిజాయతీతో కూడిన సత్ప్రవర్తనతో జీవించడం, స్వచ్ఛమైన వ్యక్తిత్వం, మంచి నడవడి కలిగి ఉండడమే భగవంతుని చేరేందుకు ఏకైక అర్హత' అన్నది ఆయన సందేశం. సంప్రదాయక ధార్మిక క్రియలను సామాజిక కోణంలో భాష్యం చెప్పారు. ఉదాహరణకు, యజ్ఞోపవీత ధారణ అంటే... 'దయ అనే పత్తి, సంతోషం/సంతృప్తి అనే దారం, సంయమనం అనే ముడి' కూడినదే నిజమైన యజ్ఞోపవీతం అని వ్యాఖ్యానించారు

మానవ మనుగడకు డబ్బు అవసరమే కానీ డబ్బే ప్రధానం కాదంటారు నానక్. 'సమాజ హితాన్ని కాదని దోచుకొని దాచుకోవడం ధర్మసమ్మతం కాదు. కష్టించి నిజాయతీతో ఆర్జించిన దానిలో జీవితావసరాలకు పోను అవసరార్థులకు కొంత కేటాయించాలి. ముఖ్యంగా ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నవారు తన సంపదలో కొంత భాగాన్ని పేదలకు కేటాయించాలి' అని ప్రవచించారు. ఆర్జించిన దానిలో పదోవంతును అలా వినియోగించాలంటూ 'దశ్వాంద్' అనే భావనను ప్రవేశపెట్టారు. ఆగర్భ శ్రీమంతుడు కూడా, ఏదో ఒకలా శ్రమించి జన్మను సార్థకం చేసుకోవాలన్నది ఆయన సిద్ధాంతం. 'పనిచేసే

వాడికే తినే హక్కు ఉంటుంది' అని చెప్పడమే కాదు... ఆచరించారు. పొలాలలో పనిచేస్తూ జీవనం సాగించి ఆదర్శంగా నిలిచారు. గురుద్వారలలో నేలను తుడవడం, పాత్రలను శుభ్రపరచడం, నీటిని వంట గదికి చేర్చడం వంటి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రాపంచిక సుఖాలను పట్ల విముఖులను, భోగపరాయణులను ఇద్దరినీ నిరాకరించారు. గృహస్థాశ్రమం ఉత్తమమార్గమని బోధించారు. జీవితాన్ని నిండుగా ఆస్వాదించిన వారే సమాజ హితైషులని, వారు సమాజానికి మేలు చేయగలుగుతారని పేర్కొన్నారు.

కులభేదాలకు అతీతంగా ప్రసాదం (లంగర్) స్వీకరించడం, సంగీతంతో కూడిన సామూహిక ప్రార్థనలను ఆయన సిక్కు దేవాలయాలు (గురుద్వారాలు)లో ప్రవేశపెట్టారు. శ్రీలంక, నేపాల్, టిబెట్, చైనా, ఇరాక్, సిరియా, టర్కీ, ఇరాన్, సౌదీ, అరబ్, పాలస్తీనా, ఇరాక్, ఆఫ్రికా దేశాలతో పాటు మనదేశంలో ఐదుసార్లు పర్యటించి తన వాణిని వినిపించారు. వీటినే 'ఉదాసీ' యాత్రలు అంటారు. ఆయన స్మృతి చిహ్నంగా చైనాలో ఒక నగరానికి 'నాన్ కింగ్' అని పేరు పెట్టారు. 1949–50 మధ్య కాలంలో తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చైనా సందర్శించినప్పుడు ఆయనకు సమర్పించిన సన్మాన పత్రంతో ఈ అంశాన్ని పేర్కొన్నారు. ఏ రంగంలో నైనా సమర్థతే గణనీయం తప్ప వారసత్వం కాదన్నది గురునానక్ నిశ్చితాభిప్రాయంగా చెబుతారు.

సమర్థపాలకులతోనే సుపరిపాలన అందుతుం దన్నట్లే సమర్థ గురువులతోనే జ్ఞానం అందుతుందని విశ్వసించారు. పాలకుల, జ్ఞాన ప్రదాతల ఎంపికలో వారసత్వం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోరాదన్నది ఆయన భావనగా కనిపిస్తుంది. ఆత్మజ్ఞానం, అనుభవం కలవారి వల్ల మరింత ప్రయోజనం కలుగుతుందని భావించి ఉంటారు. ఆయనకు ఇద్దరు కుమారులు (శ్రీచంద్, లక్ష్మీదాస్) ఉన్నప్పటికీ గురుపీఠం వారసులుగా వారిని కాదని, తన శిష్యుడు లహనాను ఎంపిక చేశారు. ఆయనే (లహనా) గురు అంగద్‌గా ప్రసిద్ధులు. ఉత్తరాధికారి నియామకం జరిగిన కొద్ది కాలానికే (సెప్టెంబర్ 22, 1539) గురునానక్ తనువు చాలించారు. స్మారకాలకు ఆయన వ్యతిరేకం. 'నేను చెప్పింది మననం చేయండి. స్మారకాలు వద్దు' అనేవారు.

అయినా ఆయన శిష్యులలోని కొందరు ముస్లింలు, హిందువులు వేర్వేరుగా సమాధులు నిర్మించగా, కొన్నాళ్లకు పొంగివచ్చిన రావీనది వాటిని తనలో లీనం చేసుకుంది. ఆయన మాట అలా నిజమైందన్నది ఆయన అనుయాయులు భావన. ★

దీపం జ్ఞానానికి సంకేతం. అజ్ఞానం, నిర్లక్ష్యం అనే చీకటిని పోగొడుతుంది. పరిసరాలను శక్తిమంతం చేస్తుంది. దీపారాధనలో ప్రాపంచిక పరిజ్ఞానం దాగి ఉందని చెబుతారు. భగవంతుడు జ్యోతి స్వరూపుడు. ఆయనకు చేసే ఉపచారాలలో దీపారాధన ఒకటి. ఆ వెలుగులో భగవంతుని పాదాలను చూడాలంటారు. దీపం నిత్య ఆరాధన విశేషం కాగా కార్తిక దీపం, అందునా కార్తిక పౌర్ణమి దీపారాధనను సర్వపాపహరణ, సకలార్థ సాధకంగా చెబుతారు. ఆత్మ, చెడు కర్మల నుంచి శుద్ధి పొందుతుందని, పరమాత్మతో అనుబంధాన్ని పెంచుకుంటుందని పెద్దలు అంటారు. హరిహరులను అర్చించడం ఈ మాసం ప్రత్యేకత. వారికి ప్రీతిపాత్రమైన ఈ మాసంలో దైవసన్నిధిలో ఒక్కసారి దీపం వెలిగించినా పాపనివారణ అవుతుందని శాస్త్ర పురాణాలు చెబుతున్నాయి. కార్తిక పౌర్ణమి నాడు వెయ్యి లేదా అంతకంటే ఎక్కువ వత్తులను (గుత్తి వత్తులను) ఆలయాలలో, తులసికోటల వద్ద వెలిగించడం ఆచారంగా వస్తోంది. కార్తిక మాసాన్ని పురుషోత్తమ మాసం అనీ అంటారు.


# కమనీయం కార్తిక

కార్తిక మాసం శివకేశవులకు ప్రీతిపాత్రమైనది. చాంద్రమానం ప్రకారం, కృత్తిక నక్షత్రంతో కూడిన పౌర్ణమి కార్తిక పౌర్ణమి. దీనికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. దీనిని 'దేవ దీపావళి'గా వ్యవహరిస్తారు. ఆ రోజునే పరమశివుడు త్రిపురాసురులను సంహ రించారు. తారకాసురుడి పుత్రులు (తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి) తండ్రి మరణానంతరం దేవతలపై ప్రతీకారం తీర్చుకునేందుకు బ్రహ్మ గురించి తపస్సు చేసి మెప్పిస్తారు. ప్రత్యర్థి 'రథం కాని రథం ఎక్కి విల్లుకాని విల్లుతో, నారి కాని నారితో, బాణం కాని బాణం ఎక్కుపెట్టి తమ ముగ్గురు సోదరులను ఏకకాలంలో పడగొట్టే వరకు మృత్యువు లేకుండా వరం పొందారు. సహజంగానే వరం గర్వంతో విర్రవీగసాగారు. వారి ఆటకట్టించడానికి నిర్ణయించిన మహేశ్వరుడికి సహకరించేందుకు దేవతలు ముందుకు వచ్చారు. భూమి రథంగా, సూర్యచంద్రులు రథచక్రాలుగా, చతుర్వేదాలు గుర్రాలుగా, బ్రహ్మదేవుడు సారథిగా, మేరు పర్వతం విల్లుగా, ఆదిశేషువు దానికి నారిగా, శ్రీ మహావిష్ణువు బాణంగా మారారు. అలా శివుడు ఒక్క పెట్టున దానవ సోదరత్రయాన్ని సంహరించాడు. అందుకే కార్తిక పూర్ణిమను 'త్రిపుర పూర్ణిమ/త్రిపురారి పూర్ణిమ' అని వ్యవహరిస్తారు. శంకర విజయానికి చిహ్నంగా ఆ రాత్రి దీపోత్సవం నిర్వహిస్తారు. పూర్ణ చంద్రుడు ప్రకాశించే వేళ.. కార్తిక పున్నమి రేయిలో చంద్రశేఖర దర్శనం, అభిషేకం, మారేడు దళాలు, జిల్లేడు పూలతో అర్చించడం వల్ల విశేష ఫలితాలు సిద్ధిస్తాయంటారు. ఆ రోజున శివుడి ప్రీత్యర్థం భక్తేశ్వర వ్రతం చేసుకుంటారు. పగలంతా నిరాహారంగా గడపి సాయంత్రం శివుడిని అభిషేకించి, మారేడు దళాలతో అర్చిస్తారు.


క్షీరసాగర మథనంలో పుట్టిన హాలాహలాన్ని లోకహితం కోసం శివుడు సేవించి కంఠంలో నిలిపినది ఈ రోజే. ఆనాడే విష్ణువు వేదోద్ధరణకు మత్స్యావతారం దాల్చారు. బృందాదేవి తులసీ మొక్కగా అవతరించారు. కృష్ణభక్తులు 'రాసపూర్ణిమ' ఉత్సవం జరుపుకుంటారు. ఆషాఢ పూర్ణిమ నాడు ప్రారంభించిన చాతుర్మాస్య దీక్షను కార్తిక పౌర్ణమి నాడు విరమిస్తారు. ఆ నాటి రాత్రి అరటి దొప్పలలో దీపాలను ఉంచి నీటిలో వదులుతారు.

పవిత్ర దీపదర్శనంతో ప్రశాంతత కలుగు తుంది. దీపాన్ని లక్ష్మీదేవి చిరునవ్వులతో పోలుస్తారు. దీపాలతో కళకళలాడే లోగిళ్లు సకల సౌభాగ్యాలకు నెలవులని, దీపాన్ని వెలిగించి పూజిస్తే త్రిశక్తులతో పాటు త్రిమూర్తులను అర్చించినట్లేనని, దీపం వెలిగించిన వారు విద్యావంతులు, జ్ఞానవంతులు, ఆయుష్మంతులు అవుతారని, మోక్షాన్ని పొందుతారని పెద్దలు చెబుతారు. క్షేత్రదర్శనం తరువాత నదీ దేవతలకు దీపం వెలిగించి హారతి ఇస్తారు.

అగ్ని సంబంధమైన కృత్తిక నక్షత్ర ఈ మాసంలో దీపాలు వెలిగించడం సదాచారం. భారతీయ సంస్కృతిలో తొలి నుంచి అగ్ని ఆరాధన ఉండగా, ఈ మాసంలో అది అత్యంత ప్రధానమైంది.



డా॥ ఆరవల్లి
జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్



# కౌముది



లోకంలోని సమస్త ప్రాణుల హితం కోసం, వాటికి కృతజ్ఞతలు చెప్పేందుకు కనీసం కార్తిక పౌర్ణమి నాడు దీపం పెట్టాలని పెద్దలు చెబుతారు. ఆనాడు ఊళ్లలో చేసే దీపారాధన కాశీలో దీపం వెలిగించినంత పుణ్యమని విశ్వాసం. కారణాంతరాల వల్ల నెలంతా దీపాలు పెట్టలేకపోయినా, శుక్ల ద్వాదశి, చతుర్దశి, పూర్ణిమ రోజుల్లోనైనా దీపం వెలిగిస్తే పుణ్యలోక (వైకుంఠ) ప్రాప్తి కలుగుతుందని అంటారు.

కార్తిక పున్నమి అనగానే సాహితీవేత్తలకు గుర్తుకొచ్చే మహాకవి భవభూతి (శ్రీకంఠశర్మ). ఒక కార్తిక పున్నమినాడు వెన్నెల శోభను ఆస్వాదిస్తున్న ఆయనకు, నింగి నుంచి నేలకు జాలువారుతున్న కౌముదీ ప్రవాహం, కైలాసంలో తాండవం ఆడుతున్న పరమశివుడి దేహం నుంచి జాలువారే విభూతిలా అనిపించిందంట. పరవశంతో అలా కవిత్వం చెప్పడంతో ఆయన భావుకతకు మెచ్చిన సాహితీలోకం 'భవభూతి' అని సంభావించిందట.

**జ్వాలాతోరణం**

కార్తిక పౌర్ణమి నాడు ఇళ్లలో, ఆలయాలలో ఆవునేతితో దీపాలను వెలిగిస్తారు. ఈ దీపోత్సవాలతో పాటు శివాలయాలలో జ్వాలాతోరణం ప్రత్యేక ఉత్సవంగా నిర్వహిస్తారు. దీని దర్శనం సర్వపాప హరణం, అనంత పుణ్యఫలం అని విశ్వసిస్తారు. జ్వాలాతోరణ సంప్రదాయం వెనుక అనేక పురాణ గాథలు ఉన్నాయి.

క్షీరసాగర మథనవేళ వెలువడిన గరళాన్ని గళంలో నిలిపిన పతికి ఎలాంటి హాని కలుగకూడదని, అలా క్షేమంగా బయటపడితే చిచ్చులతోరణం కింద నుంచి నడిచివస్తామని పార్వతీదేవి మొక్కుకుందట. అలా శివపార్వతులు మూడుసార్లు దాని కింద నుంచి దాటి వెళ్లారట. నేటికీ శ్రీశైలంలో ఆదిదంపతుల మూర్తుల పల్లకిని మూడుమార్లు అటుఇటు దాటిస్తారు. మరో కథనం ప్రకారం, దానవ సంహారానికి వెళ్లిన శివుడు ఎన్నేళ్లకూ తిరిగి రాకపోవడంతో విరక్తి చెందిన పార్వతీ పతీవియోగం భరించలేక, అగ్ని ప్రవేశానికి సిద్ధమైంది.శివుడు ప్రత్యక్షమై ఆమె ప్రయత్నాన్ని నివారించాడు. ఆ చితిని జ్వాలాతోరణంగా మార్చి, వారిద్దరు విలాసంగా దానికి మూడుసార్లు ప్రదక్షిణ చేశారు.

త్రిపురాసుర సంహరం తరువాత అమ్మవారు పరమేశ్వరుడికి జ్వాలాతోరణ కింద దిష్టి తీశారని మరో కథనం. నాటినుంచి శైవ క్షేత్రాలలో జ్వాలాతోరణం సంప్రదాయం వచ్చిందని చెబుతారు. శ్రీశైల క్షేత్రంలో కార్తిక జ్వాలాతోరణ మహోత్సవం నయనానందదాయకం. జ్వాలాతోరణాన్ని గడ్డితో తయారు చేయడం సాధారణం కాగా అక్కడ మాత్రం పత్తిదారాలతో రూపొందిస్తారు. దేవాంగులు ఏడాది పాటు పత్తిని వడికి తయారు చేసిన దారపు ఉండలను పున్నమి నాటి ఉదయం భ్రమరాంబ మల్లికార్జునుల సన్నిధికి చేరుస్తారు. ఆ దారాలను ఆవునెయ్యి, నువ్వుల నూనెలో నానబెట్టి, సాయం సమయంలో ఆలయ వద్ద స్తంభాలకు కట్టి వెలిగిస్తారు. జ్వాలాతోరణ భస్మాన్ని భక్తులు ప్రీతిపాత్రంగా నొసటను ధరిస్తారు. జ్వాలాతోరణంలో కాలగా మిగిలిన గడ్డిని పశుగ్రాసంలో కలుపుకుంటే మంచిదని భావిస్తారు.

తమిళనాడులోని అరుణాచలంపై అగ్నిలింగంగా వెలుగొందుతున్న ఆదిదేవుడి ఉత్సవాలలో కార్తిక పౌర్ణమి నాటి దీపారాధన అత్యంత ప్రధానమైంది. ఈ కృత్తికా దీపోత్సవం జగత్ప్రసిద్ధం. దీనిని 'కుమార దర్శనం' పేరుతోనూ పిలుస్తారు. శివుడిలో ఐక్యమయ్యేందుకు పార్వతీదేవి అరుణగిరిపై తపస్సు చేసిందని, కార్తిక పూర్ణిమ నాడు ఉజ్వల దీపస్తంభంలా ప్రత్యక్షమైన శివుడు ఆమెను లీనం చేసుకున్నాడని పురాణగాథ. శక్తి, శివుడు ఐక్యం కావడమే అర్ధనారీశ్వర వృత్తాంతంగా చెబుతారు.

నాటి నుంచి అరుణగిరిపై దీపం వెలిగించి, దానిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోందని చెబుతారు. కార్తిక మాసంలో కృత్తికా నక్షత్ర వేళ అరుణగిరిపై దర్శనమిస్తానని పరమేశ్వరుడు భక్తులకు అభయమిచ్చారట. అందుకు భక్తిపూర్వక కృతజ్ఞతతో ఈ మహాదీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ రోజు వేకువజామున ఆలయంలో భరణీదీపం, సాయంత్రం ఆరు గంటలకు కొండ శిఖరంపై మహాదీపం వెలిగిస్తారు. అక్కడి పెద్ద రాతిపై గల భారీ ప్రమిదలో నూనె పోసి భారీ వత్తిని వెలిగిస్తారు. తిరుమలేశుడు దేవేరులతో కలసి అరుణాచలేశ్వరుడి మహాజ్యోతిని దర్శిస్తాడట. హిమాలయాల గుహల్లోని తాపసులు దానిని సందర్శించి పరవశులవుతారట. ఏడాదిలో అన్ని రోజులు గిరి ప్రదక్షిణలు ఉన్నా, పౌర్ణమినాడు విశేష సంఖ్యలో భక్తులు వస్తారు. ఇక కార్తిక పున్నమి నాడు అరుణాచల భక్త జన సంద్రమే.

**దీపదానం**

ఈ పౌర్ణమి నాడు దీపదానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. కార్తికంలో శివకేశవుల సన్నిధిలో దీపదానం చేసిన వారి అజ్ఞానం పటాపంచలవుతుందని చెబుతారు. దీపదానంతో జ్ఞానం, ఆయుర్వృద్ధి, విద్య, సకల భోగాలు కలుగుతాయని వెయ్యి సోమయాగాలు, అగ్నిష్టోమ యాగాలు చేసినంత పుణ్యం లభిస్తుందని శాస్త్ర వాక్కు. బియ్యం పిండితో చలిమిడి చేసి, దానిలో వత్తివేసి వెలుగుతున్న దీపాన్ని దానం చేస్తారు. కార్తిక పున్నమి నాడు కార్తిక దీపాలనోము నోస్తారు. ఇది మూడు సంవత్సరాల పాటు కొనసాగించాల్సిన నోము. ఆ రోజున దీపదానం చేస్తారు. ఈ మాసంలో అన్న, విద్య, వస్త్ర దానాలు కూడా చేస్తారు. ★



అది కార్తిక పూర్ణిమ. నవంబర్ 11,1962. అంటే 62 ఏళ్ల క్రితం. ఆమెను దర్శించుకున్న ఆయన, ఆ మాటలకు ప్రభావితులయ్యారు. నిత్యసంసేవ్య, నిరంతర ఆరాధ్య అని తనలో తానే ప్రకటించుకున్నారు. కాలక్రమాన 'శ్రీచరణ వైభవం' పేర కృతి రచన చేశారు. ఆయనని నాలుగు ప్రశ్నలు, ఆ అన్నింటికీ ఆ పుస్తకమే ఐక్య సమాధానం! అనుభవంతోనే మనకు నమ్మకం కలుగు తుందా? నమ్మిక ఉండటమే అనుభవానికి దారితీస్తుందా? మనిషి చేసిన సాధనతో దైవకరుణ ప్రసరిస్తుందా? ఆ దైవ కరుణాకటాక్ష ఫలితమే మానవుడి సాధనకు మూలమా? ఎన్నో ఆలోచనలు, ఇంకెన్నో అంతర్మథనాలు, వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ ఆ 'అమ్మ' ఏం అందో తెలుసా? 'జీవితం అబద్ధం; చరిత్ర బద్ధం' అని. అందుకే ఆ చరితను రచనగా తెచ్చిన అవకాశం ఆయనకు కలిగింది. 'కనిపించే సృష్టిని సేవిస్తే... కనిపించని దైవాన్ని పూజించినట్లే' అనిపించేలా చేసింది. సరిగ్గా ఆ కారణంగానే – మలయ మారుత వీచిక వీచిందనీ శరచ్చంద్రిక పూచిందనీ అభివర్ణించారు కరుణ కవిశ్రీ. అంతటి హృదయ సంబంధ వచన కావ్యకర్త 'జిల్లెళ్లమూడి' కొండముది రామకృష్ణ. సూక్ష్మంగా 'రహి'! విజ్ఞానం, వికాసం, ప్రకాశం, ప్రియత్వం అని అర్థాలు. 'అమ్మ తలపే ప్రాణం, అమ్మ మరపే మరణం' అన్నారంటే – పరిపూర్ణ మాతృశ్రీ తత్వం!

# 'అమ్మ' మాట... బం

'జయహో మాతా శ్రీ అనసూయా' అంటా రందరూ. అదే ఆమె అసలు పేరు. ఆమె తనయ హైమ స్మృతి సూచకంగా హైమాలయం ఏర్పాటైంది. హైమవతీ దేవి 82వ జయంతి కార్యక్రమం ఇదే నెల పదిహేనున మొదలవు తోంది. వ్రతంగా వారం రోజులు కొనసాగుతుంది.

మాతృమూర్తికి తనయులు, తనయలు సమానం. ఒకనాడు ఓ భక్తురాలు మంత్ర ఉపదేశం కోరితే 'అది కాదు కానీ, సందేశం ఇస్తా' అంది అమ్మ. అది ఏమిటంటే 'కూతురినీ కోడలనీ ఒకేలా చూసుకో, అలాగే కుమారుడినీ అల్లుడినీ ఒకేలా చూసుకుంటే అదే జీవన మంత్రం' అని!

పుట్టిన మూడేళ్లకే తల్లిని కోల్పోయింది అమ్మ.

'మీ అమ్మ పోయిందమ్మా' అన్నారు తాతగారు.

'ఎక్కడికి? అసలు ఎక్కడి నుంచి వచ్చింది? చనిపోవడమంటే ఏమిటి? పోయిందంటారేమిటీ... ఇక్కడే ఉంది కదా?' ఇవన్నీ ప్రశ్నలు.

నిద్రపోతోందమ్మా?

నిద్రపోతుంటే వీళ్లంతా ఏడుస్తున్నారెందుకు? రోజూ నిద్రపోతుందిగా? మరి రోజూ ఎవరూ ఏడవటం లేదుగా!

ఇటువంటి ప్రశ్నలే ఆమె తార్కికతను పెంచాయి. తత్వచింతనను పరిపోషించాయి. అనుభవాల పరంపరలు ఆధ్యాత్మికతను విస్తారం చేశాయి. దుఃఖమే చైతన్యం అనేలా భావనలు విస్తృత మయ్యాయి.

కష్టసుఖాలను ఒకే విధంగా భావించిందామె. వివాహం తదుపరి జిల్లెళ్ల మూడిలో శాశ్వత నివాసం. అమ్మది వాత్సల్యం. కుమార్తె హైమది కరుణ స్వభావం. పాతికేళ్లయినా రాకుండానే, హైమ అస్తమయం. స్మారకంగా హైమాలయం నిర్మిత మైంది. అటు తర్వాత హైమవతీ జనయిత్రీ వ్రతం ఆరంభమైంది.

మాతృశ్రీ ప్రతిరూప దివ్య విభవాం మాధుర్య వాగ్వైభవాం

దైవీం హైమవతీశ్వరీం హృది భజే కారుణ్య వారాన్నిధిం

హైమవతీశ్వరీ ప్రాభవాన్ని విశదీకరిస్తూ హైమాలయం పేరిట పుస్తకాన్ని కొండముదివారే రచించారు. అందరి యోగక్షేమాలూ కోరుతూ వ్రతం ఆచరిస్తున్నారు. అందరిల్లు, అన్నపూర్ణాలయం, అనసూయేశ్వరీ మందిరం, హైమాలయ ప్రాంగణం, ధ్యాన నిలయం, వాత్సల్య ఆచరణం; వీటితోపాటు గణపతి దేవాలయం, యాగశాల, మరెన్నో సందర్శనీయ స్థలాలు జిల్లెళ్లమూడికి సహజ ఆభరణాలు. నవ నాగేశ్వర ఆలయమూ ఇక్కడుంది? విద్య, వైద్య సదుపాయాలు అనేకం.

పవిత్ర క్షేత్రం జిల్లెళ్లమూడిలోనిదే శ్రీ విశ్వజననీ పరిషత్. వేదపాఠశాలను నిర్వహిస్తోంది. విద్య, భోజన, నివాస వసతులన్నింటినీ ఉచితంగా అందిస్తూ అమ్మ ప్రేమను పంచి పెడుతోంది. ఉపకార వేతనాలు అందచేస్తూ మాతృ వాత్సల్యాన్ని విస్తృతపరుస్తోంది.

అమ్మ నిత్య అన్నప్రసాద వితరణం మానవ / మాధవసేవా నిరతిని ప్రస్ఫుటం చేస్తోంది. సార్థక నామధేయ 'అన్నపూర్ణాలయం.' ఎవరు ఎప్పుడు వచ్చినా ఎటువంటి అంతరాలూ లేకుండా వితరణ ప్రక్రియ జరుగుతూనే ఉంది. అనేక దశాబ్దాల సేవ.

ఇదే ఊళ్లో ఓరియంటల్ కళాశాల స్థాపించి అర్ధ శతాబ్ది దాటింది. సంస్కృత, తెలుగుభాషల్లో సమీకృత

డిగ్రీ కోర్సును అందిస్తోంది. గురుకుల వ్యవస్థ రూపేణా మాతృభాష ప్రశస్తికి ఎంతగానో దోహదమవుతోంది.

ఆధ్యాత్మిక విద్య, పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణం ప్రధాన ఆశయాలు. ఏటేటా విద్యను విస్తరించడంలో 'విశ్వజనని' ముందుంటోంది.

ప్రేమవాహినీ! సేవాసింధూ!
నవనీత హృదయినీ, కరుణారస స్వరూపిణీ!
మదిలోని కదలికే చేతన
నమ్మికే దైవిక భావన

అనడంలో మాతృహృదయం తత్వమే గోచరిస్తుంది.

వైద్యసేవలు అందించడంలో సంస్థ కృషి నిరుపమానం. శరీరమే శ్రీచక్రం అని అమ్మ మాట. శారీరక ఆరోగ్యం ఉండి తీరాలన్నది అంతరార్థం. అందుకనే మెడికల్ సెంటర్ ఏర్పాటు సంభవించింది.

వైద్యపరీక్షలు, మందుల పంపిణీలు అన్నీ ఉచితమే. ఉచితంగాని వైద్యశిబిరాలు నిర్వహిస్తు న్నారు. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని, వైద్యసేవల విస్తృతికి పరిశ్రమిస్తున్నారు.

ప్రత్యేకించి – 'అన్నదానం' అనే పదాన్ని గ్రామంలో ఉపయోగించరు. అన్నం పెట్టడంలో మాతృప్రేమ ఉంటుంది. ఆకలి తీర్చడంతోపాటు

# గరు బాట

వాత్సల్యాన్ని పంచిపెట్టడం అది. శక్తి, ఆశీస్సు అదే.

ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదు, కడుపు నిండా తినాలి – అన్నది మాతృశ్రీ అభిమతం. అమ్మ అంటే అన్నం, అన్నం అనేది బ్రహ్మ. బ్రహ్మే అమ్మ. అన్నం అమ్మ ప్రసాదం; పరబ్రహ్మ స్వరూపం.

గోశాల మూగప్రాణుల ఆకలి దప్పులు తీరుస్తోంది.

అన్ని భావాలూ, క్రియలూ, రూపాలూ, నామాలూ, శబ్దాలూ, అర్థాలూ అన్నింటినీ అమ్మలోనే చూస్తారు పిల్లలు.

ఆమె పాదాల్లో ఒకటి మానవతకు పతాక, మరొకటి మాధవత్వానికి ప్రతీక అంటారందుకే 'శ్రీచరణ వైభవం' కర్త.

**అమ్మ అనే కొండల్లో పుట్టి**
**అమ్మ అనే కడలిలో లయమందడానికి**
**పరుగులు తీసే నది అయింది నా జీవితం**

**అన్నారు.**

**ఆ పాదాలు...**
**కారుణ్య పరమేశ్వరికి అలరు వాహకాలు**
**వాత్సల్య భువనేశ్వరికి అగరు ధూపాలు**



**ప్రేమానురాగాలకు పర్యాయపదాలు**
**సర్వలోకాలకూ ప్రేమాస్పదాలు**
**విరబూసిన తత్వ సుమవాటికలు**
**అక్షీణ దయాగుణ నిక్షిప్త సువర్ణ పేటికలు**
**ఉపదేశాలూ ఉపన్యాసాలూ ఇవ్వని జగద్గురువులు**
**అడిగినదానిని కాక, కావలసినదానిని ప్రసాదించే కల్పతరువులు**
**రాసిపోసిన పుష్య రాగాలు**
**పారమార్థిక పుష్పసరాగాలు**
**మానవ మాధవ మధుర మేళనను**
**సంఘటించే పరస్పరానురాగాలు....**

అంటున్నప్పుడు బిడ్డ హృదయం ఎంతగా స్పందిస్తుందో! అమ్మ మానసం మరెంతగా వాత్సల్యభరిత కృతారమవుతుందో!!

అమ్మలో అనిర్వచనీయ అనురాగం. అసామాన్య దయాభావనం, అలౌకిక త్యాగచింతనం. జీవితం అబద్ధం అంటే 'బద్ధం కానిది' అని. చరిత్ర బద్ధం అన్నదంటే అర్థం... అక్షరీకరించాలని. అందుకోసమే ఆమె జీవిత మహోదధిలో తరంగాలను దర్శించారు 'రహి'. అమ్మ పాదాలను స్పర్శించి జీవితాలను ధన్యం చేసుకున్న పుణ్యమూర్తులు ఎందరెందరో అంటూ విపులీకరించారు కవి.

మాతృశ్రీ చేసింది ధర్మప్రబోధం కాదు, ధర్మ ఆచరణం.

నిస్వార్థ సేవానిరతికి ప్రతిరూపం. క్రియాశీలి.

**నీ సేవలోనే నా జీవితం సాగనీ**
**నీ ధ్యాసలోనే నా శ్వాస ఆగనీ** – అన్నవారు న్నారు. వారిని, ఆత్మీయ బిడ్డలందరినీ చూసినపుడు; 'అక్కయ్యా, అన్నయ్యా' పిలుపులు విన్నపుడు హృదయం పులకరిస్తుంది. 'మానవ జాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ, త్యాగంలో అనురాగంలో తరగని పెన్నిధి అతివ' అనీ గుర్తుకొచ్చి తీరుతుంది.

కన్నతల్లిగా, కల్పవల్లిగా, ఆమె మాట, బాట చరిత్రను సృష్టిస్తుంది. 'మన్నవ' వారన్నట్లు 'అందరి హృదయాల వెలుగు హైమా! ఎందు దాగినావో తెలుపుమమ్మా!' అనేది మదిని విచలితం చేస్తుంది.

ఈ నెల 21న హైమావతీ జయంతి సందర్భాన లలితాకోటి నామ పారాయణం. శక్తి సమ ఆరాధనం. దశాబ్దాల కిందట హైమ రాసిన లేఖలోని ఈ వాక్యాలు స్త్రీ హృదయ పరమోన్నతిని చాటి చెప్తాయి.

ఇక్కడ అమ్మ, నాన్నగారు, అన్నయ్యలు, అందరూ కులాసాగా ఉన్నారు.


పాప పేరు 'భగవతి' చాలా బాగుంది!

ఈ అన్ని అంశాలనీ మనసులోకి తెచ్చుకున్నపుడు – వనిత అంతరంగం, ఆదరణీయత, సర్వశ్రేయ అభిలాష స్ఫుటమవుతూ ఉంటుంది.

ఒకానొక సందర్భంలో అమ్మే అన్నట్లు – 'చెప్పేది అనుభవం, లోపల కలిగేది అనుభవం.' భావాను భవాల మిశ్రిత తత్వం మన జీవన రంగాన్ని నిర్దేశిస్తుంది.

ఆత్మీయత, అనురాగం, ప్రేమాస్పద రీతి, హృదయానుగత వర్తనం లోకానికి శ్రేయోదాయ కాలు. వాటిని ప్రసాదించే మాతృతత్వమే తరతరాలకీ మూలం, మూలకం, వరం, దివ్యం. మనసు, మాట చేత ఒకటే అయినపుడు అంతటా నడిపించేదీ ఆ ప్రాభవమే!

మాతృమూర్తి పాదపీఠాన చేరిన కర్పూరదీపం జ్వాలాతోరణం. ఆ అశలు వెలుగులోనే మానవ జీవితాలు ఫలిస్తాయి, ప్రతిఫలిస్తాయి.



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

**2024 చివరి దశకి వచ్చేస్తున్నాం. ఈ సంవత్సరం ప్రారంభంలో మొత్తం దేశం దృష్టిని ఆకర్షించినవి రెండు ఐ.పి.ఎల్‌లు – ఒకటి ఇండియన్ ప్రీమియర్ లీగ్, మరొకటి ఇండియన్ పొలిటికల్ లీగ్ ! ఈ ఆర్టికల్‌లో నా అభిప్రాయాలను అందించడానికి సంబంధిత కీలకమైన అంశాలను కనుగొన్నాను. “బాల వినోదం – వికసిత భారత్ “ అనే అంశానికి సంబంధించి నా అభిప్రాయాలను ఈ రెండు సంఘటనలు ప్రస్తావిస్తూ వివరించే ప్రయత్నం చేస్తాను.**



# బాల వినో

ముందుగా ఇండియన్ పొలిటికల్ లీగ్‌తో ప్రారంభిద్దాం. అన్ని ప్రచారాలు, ఉపన్యాసాల్లో “2047 నాటికి వికసిత భారత్” అనే పదం అందరి దృష్టిని ఆకర్షించింది! అంతే కాదు ఒక ఆశ, ఆకాంక్షతో ప్రత్యేక ప్రచారాస్త్రమైంది. కోట్లమంది భారతీయులు ఎన్నో ఏళ్లనుండి కంటున్న కలకి ఒక చిరునామా అయ్యింది. ఇంతకీ “వికసిత భారత్” ఎలా ఉంటుంది? నిర్వచనం ఏంటి?.. నాకు అర్థమైనంత వరకు చెప్పాలంటే – మెరుగైన జీవన ప్రమాణాలు, ఆర్థిక పురోగతి, సరళీకృత వ్యాపార విధానాలు, అందుబాటులో మౌలిక సదుపాయాలు– మానవ వనరులు, ఉద్యోగాలు, భద్రత! ఆహా! వినడానికి ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా ఉంది కదా!

సరే, ఇంక విషయంలోకి వద్దాం. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని మహానుభావుడు గురజాడ వారు చెప్పినట్టు, మనది 140 కోట్ల జనాభా కలిగి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం! ఇది అందరికీ తెలిసిందే! అయితే ఇందులో దాదాపు 40 కోట్ల మంది 15 ఏళ్లలోపు పిల్లలే ! నమ్మశక్యంగా ఉన్నా లేకపోయినా ఇది నిజం. దాదాపు మూడొంతుల జనాభా ముక్కుపచ్చలారని పిల్లలే !! ఇంతకు ముందు మనం మాట్లాడుకున్న “వికసిత భారత్ 2047” కి నిజమైన వారసులు, భాగస్వాములు ఈ పిల్లలే ! వీరంతా 2047 నాటికి నడి వయస్కులై వికసిత భారతావని గమ్య సారథులే ! మరి ఆ ఆకాంక్షలు నెరవేరాలంటే ఇప్పటి ఈ బాలబాలికలని ఎట్లా తీర్చిదిద్దాలి? వారికి కావలసిందేంటి ?? – సూక్ష్మంగా ఒక్కమాటలో చెప్పాలంటే “అందమైన బాల్యం”. ఆనందం, ఆహ్లాదం కలగలసిన సానుకూల బాల్యం ! వారికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, సానుకూల దృక్పథాన్ని, సృజనాత్మకతని, మేధోభివృద్ధిని అందించేది ఏంటి? వినోదం !!! అవును, వినోదం పిల్లల జన్మహక్కు. ఈ డిజిటల్ యుగంలో ఆట పాటలతో వినోదాన్నందించడమే కాకుండా పిల్లల్లో స్ఫూర్తిని నింపుతూ, విజ్ఞానాన్ని పంచుతూ ఆనందింపచేసే ప్రక్రియల్లో మొట్టమొదటిది అనిమేషన్! అద్భుతమైన కథలతో, బొమ్మలతో కళ్ల ముందు రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరించి పిల్లల్ని ఉర్రుతలూగించే అనిమేషన్, కార్టూన్‌లే వికసిత భారత్ లక్ష్య సాధనకి తొలి సోపానాలు.

దాదాపు 40 కోట్ల మంది పిల్లలున్న మన దేశం ఈ అనిమేషన్ రంగానికి ఒక సామాజిక బాధ్యత గానే కాకుండా ఆర్థికంగా పెద్ద అవకాశాన్ని ఇస్తుంది. ప్రపంచదేశాల్లో అనిమేషన్ వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని ఆవిష్కరించింది. డిస్నీ గురించి అందరికీ తెలిసిందే. అయితే ఇంతటి అవకాశాలున్నా మనం అందిపుచ్చుకోవడంలో విఫలమవుతూనే ఉన్నాం. దానికి ప్రధాన కారణం, గత 5 దశాబ్దాలుగా మనదేశంలో వస్తున్న కార్టూన్ షోలన్నీ విదేశాల నుండి దిగుమతి అవుతున్నవే. అవి మంచివే అయినా సంస్కృతి, నేటివిటీ పరంగా మనకి దగ్గరగా ఉండవు, మన దేశంలో దాదాపు 100 బిలియన్ డాలర్ల అనిమేషన్ వ్యాపారం జరుగుతున్నా, ఎక్కువ స్టూడియోలు విదేశాలకి సంబంధించిన సర్వీస్ చేసేవే. ఒకటి రెండు తప్ప మన దేశంలో సృష్టించిన కార్టూన్లు పెద్దగా లేవు. ఇది నిజానికి వికసిత భారత్‌కి ఒక పెద్ద విఘాతం! మనది వేదభూమి. మన దేశంలో కథలకు కొదవలేదు. పురాణేతిహాసాలు మొదలు కొని, జానపదాలు, సామాజిక కథలు ఎన్నో, ఎన్నెన్నో … ఆ కథల్ని ఇప్పటి తరానికి తగ్గట్టుగా కథనాన్ని జోడించి, మన సంస్కృతి సంప్రదాయాల నుండి దూరమైపోకుండా, శతాబ్దాల భావ దాస్యాన్ని వీడి అద్భుతమైన పాత్రల్ని సృష్టించి కేవలం వినోదాన్నే కాకుండా కాస్త విజ్ఞానాన్ని ఇస్తూ, స్ఫూర్తిని నింపే చిత్రాలని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఇదే వికసిత భారత్‌కి పునాది. ఈ విషయంలో మనం జపాన్ అనిమేషన్ నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఎన్నో ఏళ్లుగా వాళ్లకంటూ ఒక శైలిని,

## అమ్మ ఒడి.... దేవుని గుడిలాంటిది



**భాగ్యనగర్ :** అమ్మ ఒడి దేవుని గుడిలాంటిదని భారతీయ సంస్కృతితోనే దేశం భద్రంగా ఉంటుందని సామాజికవేత్త భాస్కరయోగి పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో ఎస్సీలు ముందువరుసలో ఉన్నారన్నారు. చింతల్‌బస్తీ వీర్‌నగర్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ పార్కులో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి, నారీశక్తి మహిళామండలి సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 3న ‘భగినీ హస్తభోజనం’ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్యమతస్థుల మాయాజాలంలో పడి హిందువులు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాముడికి డా.బీఆర్ అంబేద్కర్‌కు విడదీయరాని సంబంధం ఉందన్నారు. సామాజిక సమరసత వేదిక జాతీయ సలహాదారు డా. వంశీతిలక్, మహిళామండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు తమ స్వహస్తాలతో భోజనం వడ్డించారు. ★



# దం వికసిత భారత్


వినూత్న కథల్ని విభిన్నంగా ప్రదర్శిస్తూ జపాన్ అనిమేషన్ ఇండస్ట్రీ ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందింది.

నిజానికి ఒక రకంగా చెప్పాలంటే బాల వినోదాన్ని మనం పూర్తిగా విస్మరించాం. 40 కోట్ల మంది పిల్లలున్న దేశం. ఏడాదికి దాదాపు 1000 సినిమాలు అన్ని భాషల్లో విడుదల అవుతున్నాయి. అయితే పట్టుమని పది సినిమాలు కూడా బాలల చిత్రాలు ఉండట్లేదు. నిజానికి ఇది అత్యంత దయనీయమైన పరిస్థితి. భావి వికసిత భారత భాగ్యవిధాతల్ని పూర్తిగా విస్మరించడం సిగ్గుచేటు. ప్రభుత్వాలు, పెద్దలు అందరు దీనికి బాధ్యులే – పాఠశాలలు సరే సరి! పిల్లల్లో సృజనాత్మకత పెరగాలన్నా, కొత్త ఆవిష్కరణలు చేయాలన్నా, మంచి పౌరులుగా తయారవ్వాలన్నా వారి మానసికాభివృద్ధి జరగాలి. ఒకప్పటి శివాజీకి జిజియాబాయి నుండి మొన్నటి తరం తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు ఇటువంటి వినోదాత్మక కథల ద్వారానే స్ఫూర్తి నింపి చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దారు. ఇప్పుడు నవీన డిజిటల్ యుగంలో కుటుంబాలు చిన్నవి అవుతున్న నేపథ్యంలో కొత్త శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలతో వినోదం తీరుతెన్నులు పూర్తిగా మారిపోయాయి. లెక్కకు మించిన చానెళ్లు, OTTలు, ఇక యుట్యూబ్ సరే సరి. పిల్లలు అన్నం తినాలన్నా, ఏం చేయాలన్నా టీవీలో, ఫోన్లో ఉండాల్సిన పరిస్థితి. కాలానుగుణంగా వచ్చే మార్పుల్ని అందిపుచ్చుకుని మన భవిష్యత్తుకి తగ్గట్టు తీర్చిదిద్దుకోడమే ఉన్న మార్గం. ఈ నవీన ఆవిష్కరణలు రెండువైపులా పదునుండే కత్తులు. జాగ్రత్తగా వాడుకుంటే అద్భుతమైన ఫలితాలు పొందొచ్చు. ఆన్లైన్లో గేమ్స్ ఆడుతూ పిల్లలు ఎంటువండి ఉద్రేకాలకి లోనవుతున్నారో నిత్యం వార్తల్లో చూస్తున్నాం. వారి మానసిక శారీరక స్థితులపై దుష్ప్రభావం కచ్చితంగా చూపుతుంది ఈ విచ్చలవిడి సాంకేతికత. అయితే దీన్ని మనం సానుకూలంగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. అనిమేషన్ రూపంలో అద్భుతమైన కథలు, పాత్రలు సృష్టించి వాటిని కేవలం మనదేశంలోనే కాకుండా మన సనాతన విజ్ఞానాన్ని వినోదంతో జోడించి విశ్వవిపణిలో ఆవిష్కరించాల్సిన తరుణమాసన్నమైంది. దీని వల్ల రెండు ఉపయోగాలు – ఒకటి 40 కోట్ల భావి భారత పౌరుల్ని ఆదర్శవంతులుగా తీర్చిదిద్దడమే కాకుండా భారతీయ సినిమా అనిమేషన్ రంగాలని ప్రపంచవేదిక మీద పరిచయం చేసి కొత్త వ్యాపార అవకాశాలని అందిపుచ్చుకోవచ్చు కూడా.

ఇక ఇప్పుడు రెండవ ఐపీఎల్ – ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ కి వద్దాం. వినోదం లాగానే, మన దేశం క్రికెట్ ఆటని శ్వాసిస్తూ ఉంటుంది. బ్రిటీష్ వాడు వదిలేసి వెళ్లిన ఆట అని కొంతమంది అన్నప్పటికీ, క్రికెట్ మన దేశ దినచర్యలో ఒక భాగమైపోయింది. కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తి మస్తిష్కంలో అప్పటి వరకు ఉన్న ఆటని కాస్త మార్చి మరోవిధంగా ఆడితే ఎలా ఉంటుంది? ఆ ఊహ దశాబ్దాల క్రికెట్ స్వరూపాన్నే మార్చేసింది. అంతవరకు ఎక్కడో ఇంగ్లాడులో పుట్టిన ఆట కాస్త మారి భారత్ కేంద్రంగా ఒక కొత్త ఒరవడిని సంతరించుకొని కొత్త అవకాశాల్ని ఆనందాన్ని పంచుతూ ఉంది.

భారతీయ బాల వినోదం కూడా ఇలాంటిదే. దాదాపు 40 కోట్లమంది పిల్లలున్న దేశంలో రోజుకో కొత్త కథలు, పాత్రలు తయారుచేసి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మరో విధంగా చెప్పాలంటే "మార్కెట్" ఉంది. కేవలం ఆ దిశగా ఆలోచించి ముందడుగు పడాలి. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా ప్రణాళికలు రచిస్తే అతి తొందర్లో ప్రపంచం మొత్తం మన కథల్నే చూస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధమేఘాలు అలుముకొని ఒక సందిగ్ధత ఉన్న తరుణంలో భారతీయ తత్త్వం మాత్రమే ప్రపంచానికి శాంతిని అందించగలదు. అది చిన్నప్పుడే పిల్లల్లో ప్రవేశపెట్టగలిగితే రాబోయే రోజుల్లో ప్రపంచం శాంతి సౌభ్రాతృత్వాలతో మెలుగుతోంది.

చివరగా, బాలవినోదం వికసిత భారత్ లక్ష్యానికి అత్యంత ప్రధాన సాధనం. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు. రేపటి తరాన్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత మనందరి పైనా ఉంది. దీనికి అనిమేషన్ ఒక అద్భుతమైన ఉత్ప్రేరకం. అప్పుడే పుట్టిన పిల్లవాడి నుండి 15 ఏళ్ళు వచ్చేంతవరకు అనిమేషన్ ద్వారా వాచీ వినోదాన్ని ఆస్వాదిస్తూనే ఉంటారు. ఇదే వయస్సులో మంచి చెడులపై అవగాహనా, భవిష్యత్తు పైన ఆశలు, ఆకాంక్షలు కలుగుతాయి. సృజనాత్మకత లేనిదే ఏమి సాధించలేం. ప్రతీ వారిలో ఆ సృజనాత్మకత ఉంటుంది. వినోదంతో విజ్ఞానం, స్ఫూర్తి కలిగించడం ద్వారా ఆ సృజనాత్మకతకు సానబెట్టి భవిష్యత్తులో ఆదర్శవంతమైన పౌర సమాజాన్ని నిర్మించవచ్చు. అందుకే ఈ బాల వినోదం వికసిత భారత్ లక్ష్యానికి అత్యంత ఆవశ్యకమైనది.



**కొడవంటి భారవి**
సీఈఓ, మరా క్రియేషన్స్

# వక్ఫ్ మీద ఉన్న శ్రద్ధ గుడుల మీద ఏది?



తిరుపతి, అక్టోబర్ 30: కంచిస్వామి శ్రీ విజయేంద్ర సరస్వతికి తిరుపతిలో ప్రత్యేక సంచికను అందజేసిన కుటుంబ ప్రబోధన్ సంయోజక్ (తిరుపతి విభాగ్) కీర్తి వెంకయ్య, బీజేపీ అలిపిరి మండల అధ్యక్షులు జనార్దనరెడ్డి

**జాగృతి దీపావళి సంచిక ఆవిష్కరణోత్సవంలో చిలుకూరు రంగరాజన్**


వక్ఫ్ బోర్డు అధికారాల మీద, వ్యవహారాల మీద సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) చర్చించేందుకు అనుమతించని వ్యక్తులు, దేవదాయ ధర్మాదాయ చట్టాలపై, హిందూ దేవాలయాల పాలనపై ప్రభుత్వాల జోక్యం గురించి ఎందుకు మౌనం వహిస్తున్నారని చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు డాక్టర్ రంగరాజన్ ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు హక్కులను కాపాడేందుకు ఎక్కడలేని ఆసక్తి ప్రదర్శిస్తున్న చాలా ప్రభుత్వాలు దేవదాయ చట్టం అమలు, హిందూ ఆలయాల పరిరక్షణ గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. దేవాదాయ చట్టాన్ని ఒక న్యాయమూర్తి ఎలా రూపొందించారని ఆయన ప్రశ్నించారు. 'జాగృతి' వారపత్రిక వెలువరించిన దీపావళి ప్రత్యేక సంచిక (దేశమే దేవాలయం)ను హైదరాబాద్‌లో అక్టోబర్ 30న డాక్టర్ రంగరాజన్ ఆవిష్కరించారు. 1980వ దశకంలో ఎన్టీ రామారావు ప్రభుత్వ హయాంలో జరిగిన దేవదాయ చట్టం మార్పు స్వతంత్ర భారతదేశంలోనే పెద్ద తప్పిదమని రంగరాజన్ వ్యాఖ్యానించారు. అనంతర కాలంలో ఎన్‌టీఆర్ కూడా ఆ పొరపాటును అంగీకరించారని, అందుకు అర్చకుల వంశపారంపర్య హక్కుల గురించి దేశ అత్యున్నత న్యాయస్థానం దాకా పోరాడిన తమ తండ్రి సౌందరరాజన్ సాక్ష్యమని గుర్తు చేసుకున్నారు. ఆలయ పరిరక్షణ ఉద్యమంలో తమ తండ్రి అనేక విమర్శలు ఎదుర్కొన్నారని, తమ ఆందోళనను సమర్థించే రాజకీయ పక్షానికే మద్దతు ఇస్తామని బాహాటంగానే ప్రకటించారని చెప్పారు. ఆ ప్రకటన వెనుక దేవాలయాలను పరిరక్షించుకోవాలనే తపన తప్ప ఎలాంటి రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోణం లేదని స్పష్టం చేశారు. తమ ఉద్యమం సంపాదన కోసం కాదని, ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం ఉండకూడదని, భగవంతుడు అందరి వాడు కావాలన్నదే తమ అభిమతమని పేర్కొన్నారు. ప్రభుత్వ అధీనంలోని ఆలయాలు ఆదాయ వనరులుగా, వాణిజ్య కేంద్రాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం రాముడిదని, ఇది రామరాజ్యమని పూర్వీకులు భావించారనీ, వందల కొద్దీ సంస్థానాలను స్వతంత్ర భారత్‌లో విలీనం చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారని అన్నారు. కానీ ఆ మాట ఇప్పుడు చట్టంలో ఎక్కడా కానరావడం లేదని ఆయన విమర్శించారు.




వేదికపై ఆచార్య కసిరెడ్డి, డా. రంగరాజన్, డా. గోపరాజు, జి. వల్లీశ్వర్

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి 'హిందూధర్మంలో ఆలయాల పాత్ర'పై ప్రసంగిస్తూ, నంద్యాల పాలకుడు కృష్ణమరాజు వేయించిన మల్లాపురం శాసనంలోని విశేషాలను వివరించారు. దేవాలయం అనేది, అన్నసత్రం, ధర్మసత్రం, అనాథాశ్రయం, న్యాయవేదిక, చర్చావేదిక, వైద్యశాలు, యోగ నిలయం, ఆధ్యాత్మిక కేంద్రం/ భాండాగారం, సర్వకళా (సంగీత, సాహిత్య, నృత్య, శిల్ప, చిత్రలేఖన, వాస్తు శిల్ప...) నిలయంగా, శ్రద్ధా కేంద్రంగా ఉండాలని ఆ శాసనం నాటి దేవాలయ సంస్కృతిని నిర్వచించిం దని వివరించారు. ఆధునిక కాలంలో ఆలయ

లక్షణాలను.... సమష్టి యజ్ఞ కేంద్రం, పారాయణ స్థలం, ధ్యాన కేంద్రం, కల్యాణ నిలయం, తాత్త్విక కేంద్రం, సేవా కేంద్రం, గ్రంథ, కరపత్ర ప్రచురణా లయం, ప్రచార వ్యవస్థ కేంద్రం, భజనసంఘం, వ్యాయామశాల, దీక్షా కేంద్రం, మాతృమండలి, శుద్ధి సభగా పేర్కొన్నారని ఆయన తెలిపారు. 'దేహో దేవాలయ ప్రోక్తోస్సనాతనః...' అని ఉపనిషద్వాక్యం. ఆలయం (ప్రార్థనామందిరం) గురించి ఇంత గొప్పగా ప్రపంచంలోనే ఎవరు చెప్పలేదన్నారు. 'మన పూర్వికులు విపత్కర పరిస్థితులలో ప్రపంచానికి భారతీయ వేదాంత దర్శనం చేశారు. కనుకనే సాధారణ శకం నుంచి వర్తమాన కాలం వరకు వేలాది హిందూ దేవాలయాలపై దాడులు జరిగినా సనాతనం సజీవమే' అని ఆచార్య కసిరెడ్డి చెప్పారు. ఆలయాలపై దాడులు అంటే దేశం మీద, జాతి మీద జరిగిన దాడులేనని అన్నారు. హిందూ ధర్మ నిర్మాతలు, జీవాత్మ, పరమాత్మ ఒక్కటే అనే పరమసత్యాన్ని ప్రతిపాదంచారని, దీనిని అంతా



అర్థం చేసుకుని ఉంటే ఆలయాల మీద దాడులు జరిగి ఉండేవి కావని అన్నారు.

హిందూ ఆలయం అంటే కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాదని, అదొక సామాజిక సమరసతా కేంద్రమని సంచికను పరిచయం చేసిన 'జాగృతి' సంపాదకుడు డా. గోపరాజు నారాయణరావు అన్నారు. భారతదేశంలో ఎన్నో దేవాలయాలు ఉన్నాయని, వేటి శైలి వాటిదేనని, కాస్త కూడా తేడా లేకుండా లక్షల శిల్పాలు చెక్కిన వారిని ఎప్పటికీ విస్మరించలేమని అన్నారు. అంబర చుంబితం అనిపించే ఆ దేవాలయాలు ఎన్ని తరాలు ఎంత శ్రమను ధారపోస్తే సాధ్యమయ్యాయో అంతా గుర్తు చేసుకోవాలని అన్నారు. అవి నిర్లక్ష్యానికి గురి అవుతుంటే మౌన ప్రేక్షక పాత్ర వహించడం సరికాదని అన్నారు. అంత గొప్ప శిల్ప సంపదను అందించిన ఆ శిల్పాచార్యులు అందరిని మనం స్మరించుకోవాలని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్ అతిథులకు స్వాగతం పలికారు. ★



# ట్రంప్ వ్యాఖ్యలను ఆహ్వానించిన వీహెచ్‌పీ




దీపావళి పండుగ సందర్భంగా అమెరికా అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ హిందువులకు శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై పోస్ట్ చేసిన వ్యాఖ్యలు హిందువులకు స్వాంతన కలిగించాయనడం అతిశయోక్తి కాదేమో. ప్రపంచంలో అనేక చోట్ల ఆయా సమాజాలలో అణచివేతను, అత్యాచారాలను హిందువులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఏ ఒక్క అగ్రదేశ నాయకుడూ ఇంత స్పష్టంగా వాటిని గుర్తించలేదు, మాట్లాడ లేదు. ఇప్పుడు ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు హిందువుల అణచివేత, వారిపై అత్యాచారాలు నిజమేనని రుజువు చేస్తున్నాయి.

ప్రస్తుతం బాంగ్లాదేశ్‌లో హిందువులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గురించే కాదు, అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా హిందువులు ఎదుర్కొంటున్న అవమా నాలను, వివక్షను డెమొక్రాటిక్ నాయకులైన దేశాధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ నిర్లక్ష్యం చేశారని, తను అధికారంలో ఉండి ఉంటే అలా జరిగుండేది కాదని ఆయన వ్యాఖ్యానించారు. అతివాద వామపక్షవాదుల మత విరుద్ధ అజెం డాకు వ్యతిరేకంగా తాము హిందూ అమెరికన్లను రక్షిస్తామని, వారి స్వేచ్ఛ కోసం పోరాడతామని ఆయన అన్నారు. నా పాలనలో భారత్‌తో, నాకు మంచి మిత్రుడైన ప్రధానమంత్రి మోదీతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.


**వీహెచ్‌పీ స్పందన**

అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను, హామీలను విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సాల్ అభినందించారు. ట్రంప్ ప్రకటనపై సోషల్ మీడియా' వేదిక 'ఎక్స్'పై ఆయన స్పందించారు. బాంగ్లాదేశ్‌లో మహమ్మద్ యునస్ నాయకత్వంలోని ప్రభుత్వం అక్కడి హిందువులపై చేస్తున్న అత్యాచారాల గురించి ప్రస్తావించి ఖండించినందుకు అభినందనలు తెలిపారు."ఇస్లామిక్ జిహాదీ శక్తుల చేతుల్లో అణచివేతను, అత్యాచారాలను ఎదుర్కొంటున్న హిందువులు, ఇతర మైనార్టీల కోసం గొంతెత్తినందుకు కృతజ్ఞతలు. నిరసన పేరుతో అరాచకవాదులు తొలుత, వృద్ధురాలైన తమ ప్రధాని, ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి, మైనార్టీలపై తమ ప్రతాపాన్ని చూపి, ఇప్పుడు అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రపంచంలోని ఇతర నాయకులు, మానవ హక్కుల కార్యకర్తలుగా చెప్పుకునేవారంతా, ఇస్లామిక్ దేశంలో మైనార్టీల హననంపై మౌనం ఎందుకు వహించారు, వహిస్తున్నారు? ఐరాసమానవహక్కుల సంస్థ ఎక్కుడుందిప్పుడు?" అని వ్యాఖ్యానించారు. బాంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలలో జిహాదీ శక్తుల అణచివేత, అత్యాచారాలను ఎదుర్కోవడమే కాదు, అటువంటివేవీ జరుగలేదన్న వాదనను ఎదుర్కొనేది ప్రపంచంలో కేవలం హిందువులు మాత్రమేనని ఆయన అన్నారు. బాంగ్లాదేశ్‌లో హిందువులపై అత్యాచారాలను, అకృత్యాలను గుర్తించిన బహుశ ఏకైక పాశ్చాత్య నాయకుడివి నువ్వేనంటూ ఆయన పేర్కొన్నారు.



వినోద్ బన్సాల్

ఇదిలా ఉండగా, తాజా ఇంటెలిజెన్స్ బ్యూరో నివేదికల ప్రకారం, ప్రపంచంలో తన ప్రఖ్యాతిని, ఉనికిని దాదాపుగా కోల్పోయిన అల్-ఖైదా బాంగ్లాదేశ్‌లో అడుగుపెట్టేందుకు మార్గాలను అన్వేషిస్తోందిట. అల్‌ఖైదా హ్యాండ్లర్లు అనేక ప్రాంతాలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తు న్నారని, నిఘా నివేదిక చెప్తోంది. ★



# వక్ఫ్ బోర్డు తాఖీదు ప్రతిఘటన మొదల

వక్ఫ్ బోర్డ్ దూకుడుకు ప్రతిఘటన మొదలైనట్టే ఉంది. ఊళ్లకు ఊళ్లు తమవేనని వక్ఫ్ బోర్డు తరపున ప్రభుత్వాలు ప్రకటించడం, దాని మీద రైతులు, ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు ఆగమేఘాల మీద రాజకీయ నాయకుల దగ్గరకి, కోర్టులకి పరుగెత్తడం ఇటీవలి పరిణామం. వక్ఫ్ బోర్డు వచ్చి తమను ఇళ్లు ఖాళీ చేయిస్తుందన్న భయంతో కర్ణాటకలోని ఒక గ్రామంలో అక్టోబర్ 29 రాత్రి 'ఒక వర్గం' మీద ఇంకొందరు దాడి చేశారు. ఆ వర్గం ఇళ్లను, దుకాణాలను లక్ష్యంగా చేసుకుంది. హవేరి జిల్లా కడాకోల్ గ్రామంలో ఇదంతా జరిగింది. దరిమిలా 200 మంది పోలీసులు, నాలుగు కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీసు ప్లాటూన్లు అక్కడ పహరా కాస్తున్నాయి. వక్ఫ్ ఆస్తుల కోసం బీజేపీ కుట్ర పన్నుతున్నదని, అందుకే రైతులను, గ్రామస్థులను రెచ్చగొడగుతున్నదని కర్ణాటక వక్ఫ్ వ్యవహారాల మంత్రి బీజడ్ జమీర్ అహ్మద్ ఖాన్ ఆరోపించారు. మత ఉద్రిక్తతలు ఎరుగని కడాకోల్‌లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడడం విచారకరమని మంత్రి చెప్పారు. ఆ గ్రామంలోని ఒక ఆలయానికి చెందిన ఆస్తులను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించడంతో ఈ గొడవ మొదలయింది. వాటిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటారన్న వదంతులు వ్యాపించాయి.

తాము వక్ఫ్ తమవిగా చెబుతున్న భూముల గురించి వివరాలు సేకరించమని చెప్పామని, దీని అర్థం అవన్నీ వక్ఫ్ ఆస్తులు అని కాదని డిప్యూటీ కమిషనర్ విజయ్ మహంతేశ్ చెప్పారు. రైతులకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని హవేరీ లోక్‌సభ సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి బసవరాజన్ బొమ్మయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే వక్ఫ్ బోర్డ్ గొంతెమ్మ కోర్కెలన్నీ తీర్చే ప్రయత్నంలో ఉందని మరొక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఆరోపించారు.

# ఇంకో లవ్ జిహాద్



లవ్ జిహాద్ సంఘ పరివార్ అభూత కల్పన అంటూ ముస్లిం మత పెద్దలు ఎన్ని అబద్ధాలు చెప్పినా కొన్ని రుజువులు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లో అలాంటి ఘటనే జరిగి, శాంతిభద్రతల సమస్య ఏర్పడింది. సల్మాన్ అనే వాడికి కేవలం 20 సంవత్సరాలు. ఇతడు తన పేరు మార్చుకుని 16 ఏళ్ల ఒక హిందూ బాలికకు వల వేశాడు. తరువాత మత మార్చాడు. దీనితో ఆగ్రహించిన స్థానికులు మైనారిటీ వర్గానికి చెందిన పలు దుకాణాలను ధ్వంసం చేశారు. అక్టోబర్ 29న ఆ బాలిక అదృశ్యం కావడంతో హిందూ సంఘాల వారు ఉద్యమానికి దిగారు. అయితే మరునాడే పోలీసులు ఆ బాలికను, సల్మాన్‌నీ, మరొక వ్యక్తిని కూడా ఉత్తరప్రదేశ్‌లోని నజీబాబాద్‌లో అరెస్టు చేశారు. ఆ బాలికను వేధించినందుకు, మతం మార్చినందుకు కేసు నమోదు చేశారు. ఈ విషయం బయటపడిన సంగతి చూసినా ముక్కు





# ఒక స్మరణీయ బీజేపీ కార్యకర్త

పేరు భూలయ భాయ్. భారతీయ జనతా పార్టీలో అందరి కంటే అత్యంత అనుభవజ్ఞుడైన కార్యకర్త. ఇంతకీ ఆయన పేరు కొవిడ్ సమయంలో హఠాత్తుగా వెలుగులోకి వచ్చింది. భూలయ ఆరోగ్యం ఎలా ఉన్నది అని ప్రధాని నరేంద్ర మోదీ వాకబు చేశారు. ఆయన ఎవరన్న వెతుకులాట మొదలయింది. అప్పటికి బహుశా ఆయన వయసు 107 సంవత్సరాలు. ఇంతకీ ఆయన 111 ఏట అక్టోబర్ 28న కన్నుమూశారు.

అసలు పేరు నారాయణ్. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు. కుశినగర్ జిల్లాలో తన స్వగ్రామం పగార్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రేరణతో నారాయణ్ భారతీయ జనసంఘ్‌లో చేరారు. కుశినగర్ జిల్లాలోనే నౌరాన్‌గంజ్ నియోజకవర్గం

## ...లకు హింసాత్మక ...యిందా?

ఎంత రగడ, ఎంత సంక్షోభం తలెత్తవచ్చు గాక. అయినా తనను రాష్ట్ర మంత్రిమండలి నుంచి తొలగించలేరని కర్ణాటక వక్ఫ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ధీమాగా ఉన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ గందరగోళం నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి చేసిన విమర్శకు సమాధానంగా ఆయన ఈ మాట చెప్పారు. దేశానికి రైతులే వెన్నెముక అని, దేశంలో ప్రతివారి ఆస్తి రక్షణకు చట్టం ఉందని అన్నారు. పరాధీనమైన ఆస్తుల కోసం తాము వక్ఫ్ న్యాయ స్థానం నిర్వహిస్తు న్నామని, ప్రభుత్వం నుంచి వక్ఫ్ భూమి తీసుకోలేదని అన్నారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన మొత్తం 84,000 ఎకరాలలో 23,000 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని ఆయన చెప్పారు. అదనంగా 38,000 ఎకరాలు ముజరాయ్ శాఖకు చెందినవని, మరొక 700 ఎకరాలు కూడా ఆక్రమ ణలో ఉన్నాయని మంత్రి లెక్క చెప్పారు. ★



...మీద వేలేసుకోక తప్పదు. బాలిక పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు ఆమె కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో డొంకంతా కదిలింది. ఇంకా చిత్రం– సల్మాన్‌తో పారిపోవడానికి ముందు తన మిత్రులతో ఇస్లాంలోకి మారే విషయం ఆలోచించమని హితవు కూడా చెప్పింది. ఇప్పటికైనా ఉదారవాదులు, సెక్యులరిస్టులు కళ్లు తెరుస్తారా?

...నుంచి 70 దశకంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. స్వచ్ఛతకీ, నిజాయతికీ మారుపేరుగా ఆయన రాజకీయ రంగంలో పేరు తెచ్చుకున్నారు. 1980లో బీజేపీ ఆవిర్భవించిన తరువాత పార్టీలో కొనసాగారు. కొద్దికాలం క్రితం లక్నోలో జరిగిన పార్టీ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా వేదిక దిగి వచ్చి నారాయణ్‌ను సత్కరించారు. 2022లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రమాణ స్వీకారోత్సవానికి నారాయణ్‌ను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. ★




## లండన్ ట్రెఫాల్గర్ కూడలిలో దీపావళి సంబరాలు

**భా**రతదేశం అక్టోబర్ 31న దీపావళి జరుపుకుంటే, ఇంగ్లండ్‌లో మూడు రోజుల ముందే దీపాల పండుగ వచ్చింది. లండన్ మహానగరంలోని చరిత్రాత్మక ట్రెఫాల్గర్ కూడలి వద్ద వేలాది మంది ప్రజల సమక్షంలో అక్టోబర్ 27న దీపావళి వేడుకలు జరిగాయి. ఈ ఉత్సవానికి అన్ని వర్గాల వారు హాజరయ్యారు. లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ ఉత్సవం జరుపుకుంటారని అన్నారు. లండన్‌లో కనిపించే అన్ని రకాల కళా ప్రక్రియల వారు ఇందులో పాల్గొని, ప్రదర్శనలు ఇచ్చారు. అన్ని రకాల సంస్కృతుల ప్రతినిధులు హాజరయ్యారు. వారందరికీ తగినట్టు వైవిధ్యంతో కూడిన విందు ఏర్పాటు చేశారు. లండన్‌లో 23వ సారి దీపావళి వేడుకలు జరిగాయి. ★



## గిరిజన చిత్రకారుడికి అరుదైన గౌరవం

**ఆ**దిలాబాద్ జిల్లా (తెలంగాణ)కు చెందిన గిరిజన చిత్రకారుడికి అరుదైన గౌరవం దక్కింది. మాడావి ఆనందరావు చిత్ర ప్రదర్శన అక్టోబర్21 నుంచి 29 వరకు రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. జైనూర్ మండలం రాసిమీట గ్రామ వాసి ఆనందరావు. రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన చిత్రకారుల కార్యశాలలో ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు ఇందులో పాల్గొన్నారు. ఆనందరావు చిత్రాలలో ప్రముఖ గిరిజనోత్సవం గుస్సాడి కూడా ఉంది. మారుమూల ఉండే గిరిజన గ్రామానికి చెందిన తనకు ఇలాంటి గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందరావు అన్నారు. ఆయన చిత్రాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము వీక్షించడమే కాకుండా, ఒకదానిని పురస్కారం కోసం ఎంపిక చేశారు. తనకు చిన్నతనం నుంచి చిత్రకళ పట్ల ఎంతో అభిరుచి ఉండేదని, అటవీ శాఖ నిర్వహించిన ఎన్నో పోటీలలో కూడా పాల్గొన్నానని ఆయన చెప్పారు. దీనితోనే తనకు ఈ కార్యశాలలో పాల్గొనే అవకాశం దక్కిందని చెప్పారు. ఈ అవకాశం రావడానికి కారణమైన సమీకృత గిరిజనాభివృద్ధి శాఖ అధికారి ఖుష్బూ గుప్తా, కొమురం భీం అసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రేలకు ఆనందరావు కృతజ్ఞతలు తెలియచేశారు.

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)

మనిషికి రెండు ప్రపంచాలు. ఒకటి నీకు మాత్రమే చెందిన ప్రపంచం. సృష్టి ఎంతో గొప్పది.. అర్థం కానిది.. వింతైనదీ.. అత్యంత సరళమైనదీ ఐనా అతి సంక్లిష్టమై నిత్యనూతనమైనది కూడా. ఎప్పుడైనా అలా అలవోకగా కళ్లు మూసుకుంటే నీ చుట్టూ ఉన్న ప్రపంచంనుండి చటుక్కున మాయమై నీ స్వంత ప్రపంచంలోకి ప్రవేశిస్తావు. అంటే కన్నుమూస్తే నీలోనే ఒక ప్రపంచం. కళ్లు తెరిస్తే ఈ విశాల ప్రపంచంలో ఒక నువ్వు.

ఏడాది క్రితం ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఇంటర్వ్యూకు హాజరై, హైదరాబాద్ జేఎన్‌టీయూలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఎంపికైన తర్వాత వరంగల్లు నుండి నేనూ నా భార్య వచ్చి దగ్గర్లోనే ఒక త్రీ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌ను కిరాయికి తీసుకుని ఉంటున్న క్రమంలో.. మా ఎదురుగా రెండే గదులున్న ఒక చిన్న ఇండివిజ్యువల్ ఇంటిని చౌకగానే

# రహస్య ప్రపంచాలు

## రామా చంద్రమౌళి



కొనుక్కుని దంపతులు దాంట్లో కాపురానికి దిగారుచకచకా కొన్ని అత్యవసర మరమ్మతులు చేయించుకుని. అది అతి చిన్న వీధి.. ఒకవేపు డెడ్‌ఎండ్. మొత్తం రెండు వైపులా కూడి పదిండ్లుంటాయేమో. ప్రతిరోజూ ఉదయం లేవగానే వాకింగ్‌కు తయ్యారౌతూ బయటి బాల్కనీలో కూర్చుని కాఫీ తాగుతూ అలా దూరపు కొండల్లోకి చూస్తూండడం అలవాటైంది. సరిగ్గా అదే సమయానికి ఇంటెదురుగా ఉన్న అతను.. అతని పేరు నరసింహం తన చిన్న పిట్టవంటి స్కూటీని తీసుకుని బయటికొస్తాడు. కిక్‌కొట్టి స్టార్ట్ చేసి కూర్చుంటాడు. అప్పుడామె అందంగా, నీట్‌గా తయారై భుజాన ఒక లేడీస్ బ్యాగ్‌ను తగిలించుకుని వచ్చి వెనుక కూర్చుంటుంది.

ఇక్కడ నరసింహం గురించి కొంచెం చెప్పాలి. అతనికి బహుశా అరవై ఆరు ఏళ్లుంటాయేమో. ఎప్పుడూ చాలా చిన్నగా కత్తిరించిన తెల్లని జుట్టు, బుగ్గ చెంపలు. నిరంతరం పాన్ నములుతూండడం వల్ల గారపట్టిన పళ్లు, వాటిలో కొన్నిఊడిపోవడంతో బొక్కి నోరు, నొసట పసుపురంగు భస్మం లాంటి ఏదో పూత, శాశ్వతంగా ధుమధుమలాడే ముఖం.. బీద బీదగా వాలకం.. కావలసిన సైజ్‌కన్నా పెద్దగా జబ్బలపైనుండి జారుతున్న టి షర్ట్, మోకాళ్ల దాకా లొడలొడ ఒక పెద్ద నిక్కర్.. చూడగానే ఎవరిదైనా దృష్టిని ఆకర్షించే వింతరూపం. అతను ఏదో సెంట్రల్ గవర్నమెంట్ సర్వీస్ చేసి రిటైరై ఇంట్లోనే ఉంటాడు. ఆ మధ్యనే తెలిసిందేమిటంటే అతను జాతకాలూ, జ్యోతిశ్శాస్త్ర విషయాలూ చెబుతూ, దోషోపశమన క్రతువులూ చేస్తూంటాడనివిన్నాను నేను. ఆమె పేరు వసుధ. మా ఇద్దరి ఇళ్లలో పనిచేసే పనిమనిషి ఒక్కతే కావడంవల్ల ఆ పొరుగు కుటుంబం గురించి మా ఆవిడ చెవినబడ్డ సంగతులను నాతో పంచుకుంటుంది. అదీగాక ఇప్పటి జీవన విధానాన్ని బట్టి అందరూ పిల్లలను ఎక్కడో కోల్పోయి.. ప్రతి ఇంటిలోనూ వయసుమళ్లిన భార్యాభర్తలే మిగిలి.. అనారోగ్యాల సహవాసంతో.


అతని భార్య సౌందర్యస్పృహ ఉన్న మనిషే. యాభై ఎనిమిది ఏళ్లుండొచ్చు. పెద్ద అందగత్తె కాదుగాని ఫరవాలేదు టైప్. నీట్‌గా పద్ధతి ప్రకారం వస్త్రధారణతో తయారై ఆ స్కూటీ మీద కూర్చోగానే సరిగ్గా ఆరూ ఇరవైకి బండి బయల్దేరుతుంది. తెలిసిందేమిటంటే ఆమె గీతం యూనివర్సిటీ, హైదరాబాద్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్‌గా పని చేస్తోంది. ప్రతిరోజూ వాళ్ల కాలేజ్ బస్సు ఒక పదినిముషాల దూరంలో ఉన్న పాయింట్ మీదికి వస్తే.. దానికి ఈ నరసింహం వేళకు అందిస్తే ఆమె ఆరున్నరకుబస్సెక్కి, గంట ప్రయాణం చేసి.. మళ్లీ సాయంత్రం అదే బస్సులో తిరిగొచ్చి..ప్రతిదినం.. ఒక బస్తాలో పిండినినింపి ఉంచితే కుదించినట్టై.. శరీరం ఏడాది పొడుగునా ర్యామ్మింగ్.

పనిమనిషి సమ్మక్క చెప్పినదాన్ని బట్టి.. నరసింహం దంపతులకు ఒకే ఒక్క కొడుకు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. హైటెక్ సిటీలో ఉద్యోగం అసెంచ్యూర్కం పనీలో. కొత్తగా పెళ్ళై.. అమెకూడా సాఫ్ట్‌వేరే చేస్తూ..

గచ్చిబౌలీలో కిరాయి కొంప.. అపార్ట్‌మెంట్.

పొద్దున లేస్తే ఉదయం నుండి రాత్రి పడుకునే దాకా పరుగే పరుగు.. పెద్ద రేకుల షెడ్డులో తలుపులు మూసి పావురాల మందను గెదిమి గెదిమి తరుము తున్నట్టు..ఒకటే అలసట.

ఐతే.. ఈ నరసింహం.. వసుధ ఇద్దరివి రెండు వేర్వేరు ప్రపంచాలు. ఎవరి ప్రపంచంలో వారు బతుకుతూ.. ఒకరికి ఒకరు ఏ మాత్రం చెందని వ్యక్తులై.. ఎవరి జీవితాన్ని వాళ్లే జీవిస్తూ.. లోలోపల అది తృప్తా, అసంతృప్తా, సంతుష్టులుగానే ఉంటు న్నట్టా, లేనట్టా, ఒకరి అవసరాలను మరొకరు గుర్తించి మసలుకుంటున్నట్టేనా లేదా. అతని పెన్షన్ ప్లస్ జాతకాల ఆదాయం.. ఇద్దరు కలిసి దాదాపు



నెలకు రెండు లక్షలు సంపాదిస్తూ ఏ రకంగా జీవిస్తున్నారు.. అన్న దిశలో వాళ్లిద్దరు ఇప్పుడు మనతో మాట్లాడ్తారు. విందామా.

నరసింహం, రిటైర్డ్ సెంట్రల్ గవర్న్‌మెంట్ ఉద్యోగి..66 ఏళ్ళు.

ధనం మూలం ఇదం జగత్. ఈ సమాజంలో అన్నింటికీ ధనమే మూలం అని ఉవాచ. ఇది నేను బుద్దెరుగుతున్న వయసు నుంచి అనేక అనుభవాలను క్రోడీకరించుకుని ఏర్పర్చుకున్న స్థిర అభిప్రాయం. ఈ నా అభిప్రాయం ఎన్నడూ మారదు. నాది అతి బీద బ్రాహ్మణ కుటుంబం. చాలా మంది సంతా నంతో కూడిన కుచేల కుటుంబం మాది. నేను అందరిలోకి పెద్దోణ్ణి. పైస పైసకు కటకట. అదృష్టవ శాత్తు ఒక కేంద్ర ప్రభుత్వంలో చిన్న ఉద్యోగం దొరికింది నాకు ఇరవై ఏళ్లకే గ్రామీణ ప్రాంతాలలో ఊరూరు తిరిగి పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను రికార్డ్ చేసి తెచ్చి ప్రభుత్వానికి దాఖలు చేయడం నా పని. ఎప్పుడూ క్యాంప్‌లు. ప్రయాణాలు. టిఏలు, డీఏల బిల్లులు చేసుకుని క్లెయిం చేసు కొని వచ్చినప్పుడు తీసుకోవాలె. దీంట్లో అవి ఎప్పుడు వస్తాయో చస్తాయో అని బిల్స్‌ను పై అధికారులకు అమ్యామ్యా ఇచ్చి ఎక్కువ రాసుకొనుడు. ఈ రకంగా దొరికినంతలో నీతో..అవినీతో నాల్గు పైసలు పోగు చేసుకు నుడు అలవాటైంది. అప్పుడు పెళ్లి. మా వాడలోనే ఒక బ్రాహ్మణ పిల్ల. మా అక్క రాయబారం చేసి వాళ్లింట్ల మాట్లాడింది. ఆమె అందంగా తెల్లగా ముట్టుకుంటే మాసిపోయేట్టుండేది. అందాన్నేంచేసుకుంటం. కొరుక్కు తింటమా.. కదుక్కుతాగుతమా. పెళ్లినాడు ఆ పిల్ల ఒకటే కండిషన్ పెట్టింది. 'మధ్యల నా చదువునాపి పెళ్లి చేస్తాండ్లు. కాని నాకు చదువుకోవాలనుంది. నన్ను చదువుకోనివ్వాలె. మధ్యల ఆపొద్దు' అంది. ఒప్పుకున్నం. నిజానికి ఆమె నాకు కాకిముక్కుకు దొండపండే. ఆ సంగతి నాకు తెలుసు. ఐనా ఆడదంటే మగానికి అణిగిమనిగి ఉంటూ మగన్ని దేవుని లెక్కచూచుకోవాల అని బలమైన భావన. ఐనా కాలం గడవనీ దీన్ని నా దారికి తెచ్చుకుని నా తడాఖా చూపిస్త అనుకున్న. పెళ్లయి ఒక రాత్రి కూడా కానేలేదు. వారం పొదుగు క్యాంప్ వచ్చింది. వెళ్తే నాల్గుడబ్బులొస్తై.ఇంట్లుండి ఏం చేస్త.. అందమైన పెండ్లాన్ని చూచుకుంటా కూర్చుంటె పైసలొస్తయా? అనుకున్న.. వెళ్లిపోయిన. అప్పుడు బంగారం తులం నూట ఎనభై ఉండె. జీతం మొత్తం వచ్చేది నూటా యాభై. అంతే. జీతం పడ్డనాడే ఒక దోస్త్ దగ్గర ఒక నలభై రూపాయలు అప్పుజేసి ముందు బజారుకెళ్లి ఒక తులం బంగారం కొని మా అమ్మకిచ్చేది. అమ్మ మెచ్చుకుంటే పెళ్లాం గుణుగుడు. మరి నెల గడిచేదెట్లా.. ఆడ ఈడ మేనేజ్ ద షో. వసుధ 'నేను బి.ఎ ఫీజ్ కట్టాలె' అని గొడవ చేసేది. ఉహూ.. నా దగ్గర పైసల్లేవు పో మీ ఇంటికి అని కొట్టి పంపుడు. అక్కడ ఏం చేసేదో...! వాళ్ల నాన్నను బతిమాలి బి.ఎ.లో చేరింది. అప్పుడే కడుపు.. చదువు కోసం తన దోస్తులను వెంటపెట్టు కుని పోయి అబార్షన్. నేను అరచిన గట్టిగ. చదువు ముఖ్యమా సంతానం ముఖ్యమా అని. ఉహూ. వినది. మొండి. నాకేమో నెలలకు నెలలు క్యాంప్‌లు. ఎప్పుడో వచ్చుడు ఎప్పుడో పోవుడు.. వసుధ వేడి చూపులు చూసేది. నాకు మాత్రం.. డబ్బు డబ్బు.. డబ్బు సంపాదించాలె అన్న స్పృహ. మరుసటేడు మళ్లీ గర్భం. తల్లిగారింటికి పంపి 'తొలి చూలు.. తల్లిగారిదే' అన్న. ఖర్చు తప్పింది. మళ్లీ క్యాంప్. ఎన్ని క్యాంప్‌లుంటే అన్ని అదనపు డబ్బులు. పిల్లవాడు రెండేండ్లకొస్తూంటే.. 'నేను ఎంఎ కట్టాలె'అంది వసుధ. దేనికదే చదువులో వసుధ జెం. బి.ఎ. ఫస్ట్‌క్లాస్. ఎం.ఎ. చేస్తూ గుంటూర్‌లోని ఒక ప్రైవేట్ కాలేజ్‌లో ఫాకల్టీగా చేరింది. "జీతమెంత?" అనినేనడిగితే మరుసటేడు ఎం.ఫిల్ చేసే ప్రోగ్రాం చెప్పింది. 'పెళ్లప్పుడు' నా చదువును ఆపరని మాటిచ్చిండ్రు.. ఇప్పుడు నఖ్రా చేస్తే పోత మా ఇంటికి' అని పెట్టే బేడా సర్దుకుని వెళ్లిపోయేది. భయపెట్టాలని, లొంగదీసుకోవాలని ఎన్నిసార్లు కొట్టానో చెప్పలేను వసుధను. ఐతే ఆమె ఎంత సాహసి అంటే నేను ఒకటి కొడ్తే నన్ను ఎగబడి నాల్గుకొట్టేది. మొత్తం మీద వాళ్ల పుట్టింట్లో ఏం ఏడ్చిందో ఎవరెవర్ని ప్రాధేయపడ్డదో మొత్తానికి పెళ్లయి ఒక పిల్లాన్నికని స్థిరపడ్తున్న సమయానికి.. అప్పటికి గుంటూర్ పి జి కాలేజ్‌లో లెక్చరర్‌గా స్థిరపడి విద్యార్థి లోకంలోకి అద్భుతంగా పిల్లలకు పాఠం చెప్పే 'చదువుల తల్లిగా' పేరు తెచ్చుకుంది. నిజయతీగా చెప్పాలంటే నాకు ఇప్పటికీ డబ్బంటేనే పిచ్చి. ఒక్కో రూపాయి పోగు చేసి 2002 నాటికి నానా సెమినార్లకూ, ఎక్స్‌టర్నల్ యూనివర్సిటీ పరీక్షలకు హాజరౌతూ, ఎవరెవరో గైడ్‌లను బతిమాలుకుంటూ డాక్టరేట్ పట్టాను సంపాదించింది వసుధ. ఒక గమ్మత్తు జరిగింది. ఆ రోజు రాత్రి నాగార్జున యూనివర్సిటీ కాన్వొకేషన్‌లో వసుధ వేలమంది సమక్షంలో డాక్టరేట్ డిగ్రీతోపాటు బంగారు మెడల్‌ను పట్టుకొచ్చి నాకు చూపిస్తే నేను అదే రాత్రి అప్పటిదాకా అన్ని కోరికలనూ చంపుకుని, భార్యాపిల్లాడిని కూడ కాదని, బట్టా పొట్టా పట్టించుకోక జమచేసుకున్న డబ్బుతో గుంటూరు గుజ్జనగూళ్ల దగ్గర కొన్న రెండు వందల యాభై చదరపు గజాల జాగా బాపతు రిజిస్టర్డ్ కాగితాల కట్టను చూపించాను వసుధకు.

"నీకు కాగితాల విలువ తెలియదు నరసింహం. కరెన్సీ నోట్ల వంటి కొన్ని కాగితాలను మనం వాడుకొని వదిలేస్తాం. కాని ఈ నా డిగ్రీ సర్టిఫికేట్స్ వంటి కాగితాలను జీవితాంతం వాడుకుంటూ

పదిలంగా దాచుకుంటాం. ఈ తేడా నీకీ జీవితంలో అర్థం కాదు.” అంది. వసుధ ఆ మాటన్నప్పుడు నిజంగా నాకు గొండెల్లో తుపాకీ గుండు తాకినట్ట నిపించింది.” కాని నా మగ అహంకారం “పోవె.. దేనికీకొరగావు ఆ నీ దిక్కుమాలిన కాగితాలు” అని ఆమె చెంపలపై కొట్టించింది. guilty I was.

తెలుసు నాకు నేను పరమ లోభినని.

నాకు తెలిసిన నా సహ లోభులు కొందరున్నారు. ఇది ఒక రకమైన వ్యాధి. రుగ్మత. డబ్బు అనేది ఒక వ్యామోహం. నేను అన్నీ తెలిసి నా భార్య వసుధ నెలసరి లక్ష రూపాయల జీతాన్ని ప్రతినెలా ఖాతాలో జమ కాగానే అది నా కొడుకు కంట్రోల్‌లో ఉండేట్టు ఏర్పాటు చేసి వాటిని నా కొడుకు తెలివితో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడ్తూ, RRR చుట్టూ అనేకానేక చోట్ల అనేక స్థలాలు కొంటూ వాటి విలువలను ఇంకా ఇంకా పెంచుకుంటూ, రెండ్రూపా యల వడ్డీకి లక్షల రూపాయలను తిప్పుకుంటూ ప్రతి నెలా వాటిని వసూలు చేసుకోలేక హార్ట్ అటాక్ తెచ్చుకుంటూ, షుగర్ లెవెల్స్‌ను కోట్ల డబ్బులా పెంచుకుంటూ.. చివరికి వీటన్నింటినీ మొన్న ఆరు నెలల్క్రితం పుట్టిన నా మనుమరాలి పేర ట్రాన్స్‌ఫర్ చేసి.. గత కొన్నేళ్లుగా ఒక ప్రొఫెసర్ హోదాలో పనిచేస్తున్న నా భార్యకు ఒక మంచి దివ్య భవనాన్నీ, ప్రతిదినం స్వంత కార్‌లో ఒక డ్రైవర్‌ను పెట్టుకుని కాలేజ్‌కు వెళ్లి వచ్చే ఘనమైన జీవితాన్ని ఇవ్వగలిగి ఇవ్వకుండా అన్యాయం చేసి.. సరియైన నా నాత్మ గౌరవాన్ని నేనే కాపాడుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ఈ నా బట్టలు, నా రూపురేఖలు, నా సామాజిక విలువలు.. నా సుఖాలు..అన్నింటినీ పోగొట్టుకుని.. సత్యం చెబుతున్నాను.. ఈ రోజు బెంగళూరు వంటి నగరంలోని నా తమ్ముల ఇంటికి పోవాలంటే నా భార్య ఒక ప్రొఫెసర్‌గా రాజధాని ఎక్స్‌ప్రెస్ సెకండ్ ఏ.సి.లో పోతే నేను నా లోభిత్వంతో కాచిగుడా ఎక్స్‌ప్రెస్ థర్డ్ క్లాస్ నాన్ ఏ.సి.లో వెళ్తున్నా.

ఈ లోభి మనస్తత్వంతో నా భార్య వసుధకు ఏదైనా జబ్బు చేసినా నేను డబ్బు ఖర్చవుతుందని ఆమెకు మందులు కూడా తీసుకు రాను. దవాఖానకు తీసుకుపోను. ఒకవేళ తీసుకుపోయినా నా ప్రొఫెసర్ భార్యను తీసుకుని ఆర్ టి సి బస్సులో ఆమెను ఫ్రీగా నాకు బస్ టికెట్‌లో వెళ్తా.

అసలు నా దగ్గర రహస్యంగా కూడబెట్టిన ఈ కోట్లకొద్దీ డబ్బు ఎవరికి? నాకూ నా భార్యకూచెంద నపుడు. ఈ ఆస్తులు, ఈ జాగలు, మ్యూచువల్ ఫండ్‌లోని కోట్ల పెట్టుబడులు ఎవరికోసం. యుక్త వయసులో పెళ్లి చేసుకున్న అందగత్తె ఐన నా భార్యను సుఖపెట్టక, నేను సుఖపడక, పోగొట్టుకున్న ఏండ్ల పర్యంత జీవితపు విలువ ఎంత? నేను అతి పశ్చాత్తాపంతో ఈ రోజు ప్రకటిస్తున్నాను. money

**అసలు నా దగ్గర రహస్యంగా కూడబెట్టిన ఈ కోట్లకొద్దీ డబ్బు ఎవరికి? నాకూ నా భార్యకూ చెందనపుడు. ఈ ఆస్తులు, ఈ జాగలు, మ్యూచువల్ ఫండ్‌లోని కోట్ల పెట్టుబడులు ఎవరికోసం. యుక్త వయసులో పెళ్లి చేసుకున్న అందగత్తె ఐన నా భార్యను సుఖపెట్టక, నేను సుఖపడక, పోగొట్టుకున్న ఏండ్ల పర్యంత జీవితపు విలువ ఎంత?**

unspent is money unearned... ఎప్పుడు ఎలా జీవించలో అలా జీవించక భార్య మహోజ్జ్వల యవ్వనాన్ని హరిస్తూ నాకు నేను జీవితాన్ని నిరర్థకం చేసుకున్న స్వయంకృత పాపానికి సిగ్గుతో కుంచించుకుపోతున్నాను.

ఇప్పుడు 66 సంవత్సరాల వయసున్న నేను ఎప్పుడూ జీవించనేలేదు. all these years I was leaving dead.

వసుధ, ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్.. 58 ఏళ్లు.

మనిషి జీవితం పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుం దని నేననుకోను. దేవుణ్ణి నమ్మేదాన్ని కాబట్టి కొంత విధికూడా మన జీవితం వెనుక ఉండి కార్యకారణ తంతును ఏదో శక్తి కూడా నడిపిస్తుంటూందని నేను బలంగా నమ్ముతాను. ముఖ్యంగా భారతదేశంలో స్త్రీ ఎప్పుడూ సర్వస్వతంత్రగా లేదు . ఎప్పుడో గణరాజ్య కాలంలో మాతృస్వామ్య వ్యవస్థలో తప్ప. అందువల్ల ఈ 58 సంవత్సరాల జ్ఞాత అజ్ఞాత జీవితాన్ని జీవిస్తూ వస్తున్న నాకు ఎవరో ఒక కవి స్త్రీ గురించి రాసిన కవిత్వ పాదాలు ఎప్పుడూ గుర్తొస్తూంటాయి. అవి.,

అమ్మ చెప్పింది స్త్రీకి రెండు జీవితాలని
ఒకటి ఇక్కడ.. మరొకటి అక్కడ అని
కాని అమ్మ చెప్పలేదు స్త్రీకి మరణాలెన్నో

పుట్టినప్పటి నుంచి పురుషుని చేత కీలుబొమ్మలా ఆడించబడే స్త్రీ జీవితాన్ని ప్రధానంగా రెండు దశలుగా విభజించవచ్చు ఒకటి.. స్త్రీ వివాహపూర్వ జీవితం, రెండు.. వివాహానంతర జీవితం అని. (వి.పూ–వి.అ). నాకు కూడా అందరి స్త్రీలలాగే ఈ రెండు దశల జీవితం ఉంది. నా జీవితం ఏమంత విశాలమైందీ, విలక్షణమైందీ ఏమీ కాదు. కాని తప్పక నా జీవితం ప్రత్యేకమైందే. ఎందుకంటే అసలు ఏ స్త్రీ కూడా నా అంత రసహీనమైన ప్రేమ రాహిత్యంలో బ్రతకదు. అతి నిస్సారమైన బ్రతుకు నాది.

నాకు జన్మతః చదువుకోవడమంటే చాలా ఇష్టం. మా నాన్న నన్ను ‘చదువుల తల్లీ’ అని ఆప్యాయంగా పిలిచేవాడు. ఆ పిలుపు నన్ను ఇంకా బలంగా సంధించిన బాణంలా గురిపెట్టి వదిలేది. నేను మెరుపు తీగలా ఉండే తెల్లని, బంగారు వన్నెతో మెరిసిపోయే, సన్నని వీణతీగ వంటి బ్రాహ్మణ అమ్మాయిని. చాలా చురుకైన, తెలివైనదాన్ని. మామూలుగానే రోజూ బడికి వెళ్తూ, ఇంటికి వస్తూ.. చక్కగా పాఠశాల మొత్తం మీద ఫస్ట్ వస్తూ అందరిచేతా గుర్తింపు పొందిన నేను ఎస్సెస్సీలో జిల్లా స్థాయి మొదటి ర్యాంక్‌ను పొందాను. ఇంటర్‌లో మళ్లీ ప్రథమంగా వచ్చాను. బి.ఎ. ఇంగ్లిష్‌లో చేరవలసిన నాపై ఎండాకాలపు సంధి సమయంలో అనూహ్యమైన ‘పెళ్లి’ అనే పిడుగు పడింది. ఒక రోజు కాలేజ్ నుంచి ఇంటికి రాగానే మా వీధిలోనే ఉండే ఒక నడివయసు స్త్రీ, ఆమె తమ్ముడు నరసింహం అనే వ్యక్తితో దర్శనమిచ్చి ఒక బాంబును సంధిం చింది. ఒక్కదాన్నే అమ్మాయిని నేను ఇంట్లో. అందువల్ల వాళ్లు వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో అందరూ నా చుట్టూ చేరి నా ప్రాణం తిని.. ఒప్పించుట. అందువల్ల మర్నాడు.. ఆ పెళ్లి వాళ్ల సమక్షంలో ఒక కండిషన్‌తో పెళ్లికి ఒప్పుకున్న. ఆ కండిషన్ ఏమిటంటే.. ‘బలవంతంగా ఒప్పించి ఇప్పుడు మీరీ పెళ్లి చేస్తున్నారు. కాని నాకు చదువుకోవాలని ఉంది. కాబట్టి పెళ్లయినా నన్ను నేను కోరే స్థాయి వరకు చదువుకోనివ్వాలి.. ఎవ్వరూ నా చదువును ఆపకూడదు.’అని. వెంటనే ఏ మాత్రం తడుముకోకుండా నరసింహంతో సహా సరే అని అందరూ తలూపి ఒప్పుకున్నారు. తర్వాత కొద్ది రోజులకు పెళ్లి జరిగిపోయింది. ఇక షురూ.. భర్త హింస. మొదట రాక్షసమైన సహజమైన సెక్స్ హింస. తర్వాత ఉద్యోగ రీత్యా ఏ లోతట్టు గ్రామీణ ప్రాంతాలకో వెళ్లే నరసింహం.. మూడు రోజులిక్కడ.. వారం రోజులు క్యాంప్. భార్యాభర్తల మధ్య ఉండవల సిన ప్రేమ, సున్నితమైన స్పర్శ.. వాత్సల్యంతో కూడిన అనునయింపు.. ఇవేవీ మచ్చుకైనా లేని మృగం వంటి మనిషి నరసింహం అని అతి చాలా తక్కువ సమయంలోనే నాకు బోధపడింది. ఇక మిగిలింది చదువుకోసం యుద్ధం. బి.ఎ. ఇంగ్లిష్‌లో చేరిన ఆరు నెలలకే.. కడుపు. ‘నా చదువు.. నా చదువు’ అని దుఃఖం. ఒకరోజు ధైర్యం చేసి ఒక క్లాస్‌మేట్‌ను తీసుకుని సిటీలో కాస్త అభ్యుదయ భావాలున్న ఒక గైనకాలజిస్ట్ దగ్గరికి వెళ్లి అబార్షన్ చేయించుకున్న. చాలా పెద్ద సాహసం అప్పుడది. దాని ఫలితం విపరీతమైన హింస నరసింహంతో. ‘చదువు ముఖ్యమా.. సంతానం ముఖ్యమా’ అని ప్రశ్న. కొట్టుడు. వాళ్ల కుటుంబం తిట్టుడు.

అప్పుడే ఒక రాత్రంతా నిర్విరామంగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చాను.

ఒకటి– ఎవరి జీవితాన్ని వారే స్వయంగా నిర్మించుకోవాలె. రెండు– ఎవరికైనా మనిషికి మనోధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ ఇచ్చేది కేవలం

చదువే. మరుక్షణమే రాతినేలలో నుంచి మొలకలా ఎదగడం, చదువు పట్ల ఏకాగ్రతతో అడుగులు వేయడం ప్రారంభించిన. బి.ఎ. ఐపోయి ఎం.ఎ. ఇంగ్లిష్‌లో సీట్ తెచ్చుకుని ఫీజ్ కట్టడం దగ్గర పెద్ద ప్రతిబంధకం ఎదురైంది నరసింహం దగ్గరినుండి. 'ఇంకా చదువెందుకట' అని ఒక వెక్కిరింత. అప్పుడు చదువును కొనసాగిస్తూనే ఒక ప్రైవేట్ పి.జి. కాలేజ్‌లో ట్యూటర్‌గా చేరిన. అది ఒక మహత్తరమైన మలుపు నా జీవితంలో. అ రోజే నా కాళ్ల మీద నేను నిటారుగా నిలబడ్డ అన్న ఆత్మ విశ్వాసం ఏర్పడింది. ఇక స్వంత నడకనూ, ప్రయాణాన్నీ కొనసాగించాలె. విద్యార్థులు, పాఠాలు, కాలేజ్ యాజమాన్యం, చేదోడు వాదోడు.. నాన్ కర్రిక్యులర్యాక్టివిటీస్, ఎగ్జాన్స్ బ్రాంచ్ నిర్వహణ ఇత్యాది. అనతికాలంలోనే ఇటు మేనేజ్‌మెంట్‌తోనూ, విద్యార్థుల్లోనూ మంచి పేరు,ప్రశంసలు.

ఈలోగా సంసారంలో కొత్త కొత్త విషయాలు తెలుస్తూండడం. నరసింహం డబ్బు విషయంగా ఎవరినీ ఎప్పుడూ నమ్మడు. ప్రతి పైసా విషయంగా లెక్క..ఆరా.. ' నీ జీతం తే.. నా జీతం విషయం నువ్వు అడుగొద్దు'. నీ జీతంతో నువ్వు ఇల్లు నడిపియ్యి. నేను ఆదా చేసే పిసినారి డబ్బుతో చూస్తూండు ఏ మిరకిల్స్ చేస్తానో' అని హెచ్చులు. అంతా ఆర్థిక ఎమర్జన్సీ ఎప్పుడూ! నా ఆలోచన 'పట్టించుకోవద్దుదేన్నీ.. శతకకారుడు చెప్పినట్టు.. చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు' అని.

ఇక పి.హెచ్ డి. చేయాలి. ఎంట్రన్స్ రాయాలి. ఏదైనా యూనివర్సిటీలో గైడ్‌ను వెదుక్కుని ఒప్పించుకోవాలె. మనసు లైట్ హౌజ్బీకన్‌లా వెదుకుతోంది. నాగార్జున యూనివర్సిటీ, గుంటూర్.. దొరికింది.

'పి.హెచ్ డి ఎందుకట ఎక్కడో అక్కడ ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచరమ్మగా చేరక' అని దీర్ఘాలు.. రాగాలు. ఇంట్లో శల్య సారథ్యం. పిల్లాడు పెరుగు తున్నాడు. లోకం తెలుస్తోంది వాడికి. ఇంట్లో సంస్కారవంతమైన వాతావరణం ఉండాలి. కాని ఎప్పుడూ కలహాలు.. డబ్బు పిసినారి ప్రతిఘటనలు. ప్రతి పైసకూ కటకట. అకడమిక్‌గా సెమినార్లకు పో. పేపర్లు ప్రజెంట్ చేయి..' లాంటి పురమా యింపులు. ఒత్తిళ్లు. నేషనల్ సెమినార్లకు పోతనంటే.. ఎవరొస్తారు వెంట.. రక్షణ ఏది.. ఇప్పుడు పోవడం అవసరమా.. స్వేచ్ఛ లేదు. ప్రతిదానికీ ప్రశ్న. డబ్బు సర్దుడు చేయడు. నీ డబ్బుతోనే నువ్వు ఏద్వు..అని ఉత్తర్వు. అప్పుడప్పుడు కొట్టుడు. ఏడ్పించుడు. హింస. అసలు పర్సనల్ జీవితం మొత్తానికే బంద్. ఎప్పుడో ఒకప్పుడు గోడమీద బల్లి పాకినట్టు. నిజానికి సెక్స్ ఒక గొప్ప కళ. దాని లోతుపాతులసలే తెలియని మెకానికల్ పర్ఫార్మెన్స్. జస్ట్ దు అండ్ గో. అసలు జ్ఞాపకాలే లేని శుద్ధ శూన్యత.

పన్నెండేళ్లు..ఇక విజ్ఞాన్ యూనివర్సిటీ.. అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్.

హమ్మయ్య బండి పట్టాలెక్కింది.

ఇంట్లో గొడవలు.. నీ జీతం ఏది.. నా జీతం సంగతి చెప్పను. నీకు డబ్బు మల్టిప్లికేషన్ తెలియదు. నేను చూడు ఏమేమి చేస్తనో.. జస్ట్ సీ. అని బుకాయింపు.

'అరే.. జీవితమంటే కేవలం డబ్బేనా' అని ప్రశ్నిస్తే,

'నన్నే ప్రశ్నిస్తావా' అని హింస. స్త్రీని కొట్టే ప్రతి మగాడూ ఒట్టి వెధవ అని నా నికర భావన. ఇక కాస్త తెగింపు అవసరమై.. అకారణంగా హింసిస్తూ నువ్వు ఒకటి కొడ్తే నేను మూడు కొడ్తా..అని జవాబు.

ప్రొఫెసర్ ఐన తర్వాత జీతం నెలకు లక్ష. అప్పటిదాకా తన సంపాదనలో ఒక్క పైసా ఇవ్వని నరసింహం .. తన డబ్బుతో గుంటూరు గుజ్జనగూళ్ళ దగ్గర ఒక ప్లాట్ కొన్నడు తన పేరనే. ఎవడికో పది లక్షలు రెండు రూపాయల వడ్డీకిచ్చి.. వాడి చుట్టూ తిరుగుడు. కొడుకు బి.టెక్‌కు వచ్చి ఎదుగు తున్నప్పుడు 'ప్రతిదానికి అమ్మనడుగు' అని పురమా యింపు. తల్లి పాత్ర, యూనివర్సిటీ ఉద్యోగ బాధ్యత.

వేరే వాళ్లందరు.. ఒక కారు కొనుక్కుని రాకపోకలు. అరే.. ఒక డిగ్నిటీ.. ఒక డెకోరమా.. ఉహూ.. ఏదీ వద్దు.

జీవితమంతా బీద బీదగా.. బిక్కుబిక్కుగా.

ఇప్పటిదాకా మిగిల్చి పెట్టుబడులు పెట్టి.. భూముల మీద, మ్యూచువల్ ఫండ్స్ మీద, వడ్డీల మీద నువ్వూ, నీ కొడుకూ కలిసి చేస్తున్న మల్టి ప్లికేషన్స్.. ఏవి. ఒకవేళ ఎక్కడో ఉంటే అవి ఎందుకు.. అవి ఎవరికోసం.

అర్థవంతంగా, ఆత్మతృప్తితో జీవించని జీవితం అది నిరర్థకం.

వట్టి లోభి.

బతకడం చేతగాని ఒక పరమ పిసినారి కోట్లు సంపాదిస్తూ కూడా తన జీవితాన్ని నాశనం చేసుకుంటూ.. భార్య ఐనందుకు ఉచ్చితార్థంగా నా జీవితాన్ని కూడా ధ్వంసం చేశాడుగదా. ఎవడు ఈ అమానుషమైన విధ్వంసానికి కారకుడు.

అన్నింటికి జవాబులుండవు. ముఖ్యంగా స్త్రీకి ఈ వివాహానంతర జీవిత భాగస్వామి ద్వారా సంభవించే అకారణ హింస ఒక శాపం.

**బతకడం చేతగాని ఒక పరమ పిసినారి కోట్లు సంపాదిస్తూ కూడా తన జీవితాన్ని నాశనం చేసుకుంటూ.. భార్య ఐనందుకు ఉచ్చితార్థంగా నా జీవితాన్ని కూడా ధ్వంసం చేశాడుగదా. ఎవడు ఈ అమానుషమైన విధ్వంసానికి కారకుడు. అన్నింటికి జవాబులుండవు. ముఖ్యంగా స్త్రీకి ఈ వివాహానంతర జీవిత భాగస్వామి ద్వారా సంభవించే అకారణ హింస ఒక శాపం.**



అన్‌సపోర్టెడ్ జీవితం. అసలు వ్యక్తిగత జీవితం శూన్యమై.. ఏమిటో.. నిస్పృహ.

ఎడారిలో ప్రయాణం.. నిరంతర రసహీన యాత్ర. జీవితమంతా.. అంతా ఉన్నట్టు అందరికీ భ్రమ కలుగుతున్న గమనిం పులో అసలు ఏమీ లేని వెలితి ఎవరికీ కనబడకుండా.. ఇక నాతోనే నేను ఒక దోబూచులాట.

పిల్లవాడి బి.టెక్ పూర్తై.. అద్భుతమైన కంప్యూటర్ ప్రతిభతో ఒక పెద్ద కంపనీలో హైదరా బాద్‌లో ఉద్యోగం దొరకగానే.. నరసింహం రిటైరై.. నీ ఉద్యోగం విడిచిపెట్టు.. పద హైదరాబాద్.. అని ఒకటే గోల. తన డబ్బును హైదరాబాద్‌లో RRR దగ్గర భూములు కొని వండర్స్ చేశాడట. ఆస్తులు సంపాదించి తెలివి తేటలు చూపిస్తాడట. ఒక మంచి షర్ట్ కొనుక్కోడు. చెప్పులు వేసుకోడు. కలిసి ఎక్కడికీ రాడు.. ఆటోలు, క్యాబ్‌లు ఎక్కడు. బస్సులు.. పిట్ట స్కూటీ నడక.

జంట కుదరదు.. హైదరాబాద్ గీతం యూని వర్సిటీలో నా ఉద్యోగం. రోజూ గంట ప్రయాణం. కాలేజ్ బస్సులో వెళ్లి బస్సులో రావాలని తాఖీద్. రెండు గంటలు పోనూరానూ.

వ్., 

మళ్లీ సూర్యోదయం... ఎదురుగా ఎర్రగా.

నా భార్య అప్పుడే పొగలు కక్కే కాఫీ తెచ్చిచ్చి ఎదురుగా కూర్చుంది. నేను నరసింహం ఇంటి వైపు చూస్తూండగానే అప్పుడే ఆయన అదే పెద్ద టి-షర్ట్‌తో..నిక్కర్‌తో.. డుప్లికేట్ క్రూక్స్ రబ్బర్ చెప్పులతో పిట్ట స్కూటీని బలవంతంగా లోపలినుండి బయటకు తెచ్చి స్టాండ్ వేస్తూండగా.. అప్పటికే ఆలస్య మైందేమో పాపం ఆ ముసలి దేవతలా కనిపిస్తున్న ప్రొఫెసర్ వసుధ గబగబా వచ్చి వెనుక సీట్లో చాలా జాగ్రత్తగా, ఒద్దికగా కూర్చుంది.

ఎందుకో నరసింహం ఎంత కిక్ కొట్టినా ఆయన స్కూటీ అస్సలే స్టార్ట్ కావడం లేదు.. ఆరోజు.

**వచ్చేవారం కథ..**
**జీవితం ముఖ్యం - దాట్ల దేవదానం రాజు**

**సవరణ:** దీపావళి సంచికలో **'సనాతన'** కథా రచయిత డా. కల్లూరి శ్రీనివాసులురెడ్డి అని తప్పుగా ముద్రితమైంది. దానిని **'డా. కసుపూరు శ్రీనివాసులు రెడ్డి'** అని చదువుకోవాలని విజ్ఞప్తి. పొరపాటుకు చింతిస్తున్నాం. – ఎడిటర్








జాతీయ సమైక్యతా దినోత్సవం (అక్టోబర్ 31) సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యతా మూర్తికి పుష్పాంజలి ఘటించారు. గుజరాత్‌లోని కెవాడియాలోని పటేల్ ప్రతిమను ఆయన

చరిత్ర రచన ఒక నిరంతర ప్రక్రియగా సాగాలి. చరిత్రను ప్రతితరం పునర్ మూల్యాంకన చేసుకుంటూనే ఉండాలి. ఎంగిలి సిద్ధాంతాలు పట్టుకుని వేలాడుతూ అన్ని రకాలైన జాతీయ విలువలను విచక్షణా రహితంగా విమర్శించినప్పటికీ మహాపురుషులుగానే ఇప్పటికీ గౌరవం పొందుతున్న కీర్తిశేషుల పట్ల, సిద్ధాంతాల పట్ల ఇప్పటికీ మూఢభక్తిని ప్రదర్శించే వారికి కూడా ఇది వర్తిస్తుంది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు జాతీయ భావాలను, జాతీయవాదాన్నీ, జాతి హితం కోరి చేసే పనులను ఏనాడూ గౌరవించలేదు. కానీ అనంతర కాలాలలో కొందరు నాయకులు మాత్రం ఆ పైత్యం నుంచి బయటపడి వాస్తవాలు చెప్పడానికి, నిజాన్ని అంగీకరించడానికి వెనుకాడలేదు. కమ్యూనిస్టులు సుభాశ్ చంద్ర బోస్ శతజయంతికి, అవును మేం ఆయనను తప్పుగా అర్థం చేసుకున్నా' మంటూ ఓ దొంగ ఏడుపు ఏడిచారు. బోస్ శతజయంతి ఉత్సవాలను ప్రారంభిస్తూ నాటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఇలాంటి ప్రకటన ఒకటి చేశారు. ఇలాంటివి ఉదంతాలు కొన్ని ఉన్నాయి. వెలువడిన సత్యాల సాక్షిగా అభిప్రాయాలను మార్చుకున్న వారు ఉన్నారు. పటేల్, సావర్కర్, బోస్ ఇంకా ఎందరో ఇలాంటి తప్పుడు తీర్పులకు బలైపోయారు.

సర్దార్ వల్లభ్ బాయి పటేల్‌ను ఆనాడు తాము ఎలా విమర్శించినదీ, తరువాతి కాలాలలో ఆ విమర్శలోని డొల్లతనాన్ని ఎలా గుర్తించినదీ, ఎలా పశ్చాత్తాప పడినదీ లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కూడా వెల్లడించారు. పటేల్ కన్నుమూసిన రెండు దశాబ్దాల తరువాత రాసిన పెద్ద వ్యాసంలో చాలా అంశాలను జేపీ ప్రస్తావించారు.

స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర మంత్రివర్గంలో సర్దార్ పటేల్ కనుక హోం మంత్రి కాకుండా ఉంటే, దేశ సమగ్రత వేరే విధంగా ఉండేది. ఇంకా చెప్పాలంటే,






**దర్శించుకున్నారు. భారత సార్వభౌమత్వం, ఐక్యత రక్షణకే ఆయన జీవితమంతా కృషి చేశారని ఎక్స్ వేదికగా ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఏక్తా దివస్ పేరుతో పటేల్ ప్రతిమ దగ్గర ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తదితరులు కూడా ఉక్కుమనిషికి నివాళి ఘటించారు.**

# సువర్ణాక్షరాల ఉక్కుమనిషి

చాలా కశ్మీర్‌లు పుట్టుకొచ్చేవి. చాలా వివాదాలు ఐక్యరాజ్య సమితిలో దశాబ్దాల పాటు నానుతూ ఉండేవి. పటేల్ చాలా విషయాలలో కరాకండీగా ఉండేవారన్నది నిజం. ఆయన మాట కూడా పెళుసుగానే ఉండేదని ప్రతీతి. దీనితో ఆయనకు చాలామంది విరోధులు తయారయ్యారు. ప్రధానంగా భారత కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టడానికి పునాది వేసిన కమ్యూనిస్టులు, సోషలిస్టులు ఆయనంటే భగ్గుమని మండేవారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పేరుతో ఈ రెండు సిద్ధాంతాల వాళ్లు కాంగ్రెస్‌లో చొరబడ్డారు. అప్పటి దాకా బుజ్జగింపు జాడ్యంతోనే బాధపడుతున్న కాంగ్రెస్‌కు తరువాత వీళ్లు కొత్త రుగ్మతలను అంటించారు.


జయప్రకాశ్ నారాయణ్ ఎంతో త్యాగం చేసిన వారే. మొదట కమ్యూనిస్టుగా, తరువాత సోషలిస్టుగా ఆయన అవతారాలు ఎత్తారు. చివరికి ఇందిర వ్యతిరేక సంపూర్ణ విప్లవంతో ఆయన జీవితం ముగిసింది. ఫలితమే జనతా పార్టీ. సర్దార్ పటేల్‌తో జేపీకి తీవ్రమైన విభేదాలు ఉండేవి. అవి సిద్ధాంత పరమైనవి కూడా. సర్దార్ పటేల్ పెట్టుబడిదారీ ప్రతినిధి అని జేపీ, ఆయన బృందం ప్రగాఢంగా నమ్మేదట. నిజానికి అదేమీ నమ్మకం కాదు. తాము అన్న మాటను ఎవరు వ్యతిరేకించినా విమర్శించడానికి కమ్యూనిస్టులు, సోషలిస్టులకు నాలుక చివరి ఉండేమాట– పెట్టుబడిదారుల అనుకూలుడు. గాంధీ హత్యోదంతంలో పటేల్ దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని జేపీ అభిప్రాయం. కేంద్ర హోం శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పటేల్ హత్యోదంతం బాధ్యత నుంచి తప్పించుకోలేరని జేపీ విమర్శించారు. ఈ పరిణామాలను 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' (మౌలానా ఆజాద్) వివరించింది. నిజానికి మౌలానా ఆజాద్ కూడా కాంగ్రెస్‌లో పటేల్‌కు ఉన్న అంతర్గత శత్రువులలో ఒకరు. అందుకే పటేల్ రాజీనామా చేయాలంటూ ప్రకటించి జేపీ గొప్ప సాహసం ప్రదర్శించారని ఆజాద్ వ్యాఖ్యానించారు. ఒక విషయం మాత్రం దీనితో వెల్లడవుతున్నది. పటేల్‌ను విమర్శించడం అంటే ఆ రోజులలో సాహసమేనన్న మాట. గాంధీ రక్షణకు ప్రత్యేక చర్యలు ఎందుకు తీసుకోలదని ప్రశ్నిస్తూ పటేల్ పదవికి రాజీనామా చేయాలని కోరిన విషయాన్ని పటేల్ జీవిత చరిత్ర రాసిన రాజ్‌మోహన్ గాంధీ కూడా ప్రస్తావించారు.

గాంధీ కూడా పటేల్‌ను మనసారా అభిమానించినవారు కాదనే చెప్పాలి. పటేల్ కూడా తన వైరుధ్యాలను దాచుకోలేదు. అయినా గాంధీకి తన హృదయంలో సమున్నత స్థానమే కల్పించారు పటేల్. కారణం ఏదైనా గాంధీజీ హత్య తరువాత నెలరోజులకు పటేల్‌కు తీవ్ర గుండెపోటు వచ్చింది. ఎంతవరకు నిజమో మరి! జేపీ, ఇతర కాంగ్రెస్, కాంగ్రెస్సేతర నాయకుల సూటిపోటి మాటలు ఆయనను తీవ్రంగానే బాధించాయన్న అభిప్రాయం ఉంది.

గాంధీ మరణించిన కొద్దికాలానికే సర్దార్ పటేల్ కూడా కన్నుమూశారు. కానీ మారుతున్న కాలాన్ని చూడడానికి జేపీ మిగిలారు. కాస్త


జయప్రకాశ్ నారాయణ్


సి. రాజాజీ




# ఉక్కుమనిషి సైకత శిల్పం

దీపావళి, జాతీయ సమైక్యతా దినోత్సవం (అక్టోబర్ 31) ఒకేరోజున రావడంతో ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగరతీరంలో ఉక్కుమనిషి సైకత శిల్పాన్ని మలిచారు. దీపావళి కూడా అదే రోజు కాబట్టి వేయి దీపాలు కూడా అందులో రూపొందించారు. ఇసుకతో మలిచిన ఈ శిల్ప చిన్నదేమీ కాదు. ఆరు అడుగుల ఎత్తు శిల్పమిది. ఇందుకు ఐదు టన్నుల ఇసుక పట్టింది. కింద దీపావళి శుభాకాంక్షలు అని, సర్దార్ పటేల్‌కు నివాళి అని రాశారు. పూరీ సాగరతీరంలోనే పట్నాయక్ నిర్వహిస్తున్న సైకత శిల్ప కళారామం విద్యార్థులు కూడా ఇందులో భాగం పంచుకున్నారు. పద్మశ్రీ పురస్కారం కూడా దక్కించుకున్న పట్నాయక్ ప్రపంచంలో జరగిన 65 సైకత శిల్ప పోటీలలో పాల్గొన్నారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ఆలస్యం కావచ్చు. అయినా వాస్తవాలను తనలో కలకాలం బంధించి ఉంచదు కాలం.

“ఇవాళ నన్నొక భావన తీవ్రంగా కుదిపి వేస్తున్నది. ఆత్మ శోధన చేసుకునేటట్టు చేస్తున్నది. ‘గ్రేట్ సర్దార్’ జీవించి ఉన్న కాలంలో నేను ఆయన విమర్శకుడిని మాత్రమే కాదు. ప్రత్యర్థిగా చూసిన వాడిని కూడా” అని రాశారు జేపీ. ఇక్కడ గ్రేట్ సర్దార్ అని సంబోధించడంలోనే జేపీ ఆత్మ శోధన బలం ఎంతటిదో తెలుస్తుంది. కాంగ్రెస్ సోషలిస్టులు పటేల్‌ను పెద్ద తిరోగమన వాదిగా చూసిన సంగతిని కూడా ఆయన అంగీకరించారు. సరే, పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతినిధి అన్న ముద్ర మరొకటి. కానీ జేపీ, ఇతర సీఎస్‌పీ నాయకులను పటేల్ ద్వేషించిన కారణం వేరు. సీఎస్‌పీ సభ్యులు నిరంతరం గాంధీజీని విమర్శించడం ఆయనకు నచ్చలేదు. మార్క్సిస్టుగా జేపీ గాంధీజీని విమర్శించడం అసలే నచ్చలేదు పటేల్‌కు. అయినా కొన్ని నిశిత అంశాలలో పటేల్‌ను తాను అంతో ఇంతో అభిమానించిన సంగతి కూడా వాస్తవమేనని జేపీ చెప్పుకున్నారు.

భారతభూమికి పటేల్ చేసిన మహోన్నత సేవ సంస్థానాల విలీనం. 562 సంస్థానాలను ఆయన దేశంలో విలీనం చేశారు. ఈ కఠిన చర్యలోని చారిత్రక అవసరాన్ని మాత్రం జేపీ తోసిపుచ్చలేక పోయారనే అనిపిస్తుంది. కానీ సంస్థానాలను విలీనం చేసిన పటేల్‌ను సీపీఐ ప్రజాద్రోహిగానే పరిగణిస్తున్నది. సంస్థానాల విలీనంలో పటేల్ దృష్టిని శ్లాఘించడమే కాదు, కశ్మీర్ వ్యవహారంలో నెహ్రూ తీరును కూడా జేపీ తరువాత తప్పు పట్టారు. అలాగే చైనా నుంచి పొంచి ఉన్న బెడదను అంచనా వేయడంలో కూడా నెహ్రూ వైఫల్యం ఉందనే జేపీ వెల్లడించారు. టిబెట్‌ను బఫర్ స్టేట్‌గా (రెండు పెద్ద రాజ్యాల మధ్య చిన్న రాజ్యం) నిలబెట్టి ఉంచవలసిన అవసరం గురించి నెహ్రూను పటేల్ నిరంతరం హెచ్చరించిన సంగతిని కూడా జేపీ విస్మరించలేదు. వెల్లడించకుండా ఉండలేదు.

నాయకత్వ పగ్గాలు చిరకాలం పటేల్ ఉక్కు పిడికిళ్లలో ఉండిపోయినందుననే దేశ ఆర్థిక, సామాజిక స్వరూపాన్ని మార్చడానికి నెహ్రూకు సాధ్యం కాలేదు. ఇదే కాంగ్రెస్ పార్టీలో వివిధ అవతారాలలో ఉన్న సోషలిస్టులు, కమ్యూనిస్టులు చేసిన ఫిర్యాదు. ఇది ఎంత అబద్ధం! ఎంత చారిత్రక ద్రోహం! డిసెంబర్ 15, 1950న పటేల్ కన్ను మూశారు. అంటే స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు మూడేళ్లకే. నెహ్రూ 1964లో మరణించారు. తరువాత దశాబ్దన్నర కాలం దేశాన్ని శరవేగంతో ముందుకు నెట్టెయ్యడానికి నెహ్రూను అడ్డుకున్న శక్తి ఏమిటి మరి! జేపీయే కావచ్చు, ఇలాంటి విమర్శలు చేసినందుకు చరిత్ర ఆయనను క్షమించదు. ఒక దేశం పురోగమించకుండా ఉండిపోవడానికి కారణంగా పటేల్‌ను చూపడం అపరాధమే. పటేల్ కన్నుమూసిన తరువాత దేశాన్ని సోషలిస్టు పథంలో ముందుకు నడపడంలో నెహ్రూ సాధించిన విజయం అతి స్వల్పమని కూడా జేపీ చెప్పారు. చాలామంది లాగే నెహ్రూ భ్రమలు వీడిన వ్యక్తి జేపీ. చాలామంది వలె కమ్యూనిజం పట్ల పిచ్చిని వదులుకున్న వ్యక్తి జేపీ.

గుజరాత్‌కు చెందిన సోషలిస్ట్, స్వాతంత్ర్య సమరయోధుడు కమల్‌శంకర్ పాండ్యా చెప్పినది ఇంకా చిత్రంగా ఉంది. గ్రాంట్ రోడ్‌స్టేషన్ దగ్గరి శ్మశాన వాటికలో పటేల్ అంత్యక్రియలు పూర్తయి తిరిగి వచ్చిన తరువాతనే, పటేల్ పట్ల సోషలిస్టులలో ఉన్న అభిప్రాయాలు ఎంత భిన్నంగా ఉన్నాయో బయటపడింది. ‘వెరన్ జీవన్’ అన్న తన ఆత్మకథలో పాండ్యా ఈ విషయాలు రాశారు. పటేల్ అంత్యక్రియల నుంచి వచ్చిన తనతో మిత్రుడు ఒకడు చేసిన వాదనలో నెహ్రూ పట్ల అంధభక్తి మాత్రమే కనిపించిందని పాండ్యా రాశారు. నేను నా జీవితంలో 15 నుంచి 20 ఏళ్లు నెహ్రూ జిందాబాద్ అంటూనే గడిపాను. గాంధీ–సర్దార్ జంట కంటే నెహ్రూ పట్లనే ఎక్కువ భక్తి ప్రదర్శించాను. కానీ భ్రమలు వదలి పోయాయి. కానీ ఇప్పుడు నేను బాధపడుతూ ఒక విషయం చెబుతున్నాను. పటేల్ ఎప్పుడూ స్వలాభం కోసం ఏ పనీ చేయలేదు. కానీ నెహ్రూ ఏం చేసినా స్వలాభాపేక్షతోనే చేశారు. కాబట్టి, సర్దార్ పటేల్ సోషలిస్టు కాకపోతే వచ్చిన నష్టం ఏమిటి? ఆయన దృష్టిలో మానవీయకోణం ఉంది. అదే నెహ్రూ సోషలిజం, ఆయనది అని చెప్పుకునే దృష్టి అంతా అధికార లాలసకు సంబంధించినదే– ఇది పాండ్యాలో అంతిమంగా వచ్చిన జ్ఞానోదయం.

సి. రాజగోపాలాచారి అభిప్రాయాలు చూద్దాం. ఎందుకంటే ఆయన గాంధీ–పటేల్–నెహ్రూ ముగ్గురితో కలసి కాంగ్రెస్‌లో పనిచేశారు. తరువాత కాంగ్రెస్‌తో విభేదించి 1959లో స్వతంత్ర పార్టీ ఏర్పాటుచేశారు. 1971లో తన పార్టీ పత్రిక స్వతంత్రకు రాసిన వ్యాసంలో కొన్ని వాస్తవాలను రాజాజీ ఆవిష్కరించారు. నెహ్రూయే ఉత్తమ ప్రధాని కాగలరని తాను విశ్వసించడం తప్పిదమేనని రాజాజీ రాశారు. ఎందుకంటే పటేల్ కంటే నెహ్రూ పెద్ద మేధావి అని నాటి చాలామంది సమకాలికుల మాదిరి గానే రాజాజీ కూడా నమ్మారు. మహమ్మదీయుల పట్ల పటేల్ దయాదాక్షిణ్యాలు లేకుండా ఉంటారని ఒక మాట విపరీతంగా నాడు వినిపించేది. కానీ దీనికి రుజువులు లేనేలేవు అని రాజాజీ తెలియ చేశారు. కానీ పటేల్ డొంకతిరుగుడు లేకుండా, న్యాయబద్ధంగా నడుచుకునేవారు అని కూడా రాజాజీ పేర్కొన్నారు.

సంస్థానాల విలీనంలో పటేల్ చర్య భారత దేశానికి వరమేనని ఇప్పుడు అంగీకరించడం విజ్ఞత. అంగీకరించగలగడం వాస్తవికత.

చైనాను నమ్మవద్దని పదేపదే పటేల్ ప్రథమ ప్రధానికి ఇచ్చిన సలహా వాస్తవికమైనదని, దూరదృష్టి కలిగినదని కాలం రుజువు చేసింది. నెహ్రూ కంటే పటేల్ దూరదృష్టి నిర్మాణాత్మకమైనదని, భ్రమాజనితం కాదని రుజువైంది.

– జాగృతి డెస్క్




# భారత టెస్ట్ క్రికెట్‌కు బీటలు!

స్వదేశీ టెస్టు సిరీస్‌ల్లో భారత్ ఇక.. పులి ఏమాత్రం కాదని తేలిపోయింది. సాంప్రదాయ టెస్టు క్రికెట్ గత 24 సంవత్సరాల చరిత్రలో సొంతగడ్డపై తిరుగులేని జట్టుగా రికార్డుల మోత మోగించిన భారత్ ఘోర పరాజయం చవిచూసింది. ప్రపంచ టెస్టు క్రికెట్ లీగ్ ఫైనల్స్‌కు భారత్ వరుసగా మూడోసారి చేరడం అనుమానంగా మారింది.

ఐసీసీ ప్రపంచ టెస్టు లీగ్ ఫైనల్స్‌కు వరుసగా మూడోసారి చేరాలన్న భారత లక్ష్యానికి న్యూజిలాండ్ గండి కొట్టింది. మనగడ్డపై భారత్‌తో జరిగిన మూడుమ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 'వైట్ వాష్' విజయం సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, జస్ ప్రీత్ బుమ్రా లాంటి హేమాహేమీలున్న భారతజట్టును కేవలం మూడురోజుల ఆటలోనే మట్టికరిపించడంతో పాటు గత పుష్కరకాలంలో మూడుకు మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన తొలి, ఏకైక విదేశీజట్టుగా రికార్డుల్లో చేరింది.

1999– 2000 సీజన్లో జరిగిన రెండుమ్యాచ్‌ల టెస్టు సిరీస్ లో భారత్ 0–2తో పరాజయం పొందిన తరువాత భారతగడ్డపై 0–3తో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పొందటం అతిపెద్ద సంచలనంగా నమోదయ్యింది.

### పేస్‌లోనే కాదు..స్పిన్ లోనూ వెలవెల

స్పిన్ బౌలింగ్ లో అలవోకగా భారత బ్యాటర్లు పరుగులు సాధించగలరన్నది భ్రమ మాత్రమేనని న్యూజిలాండ్ స్పిన్నర్లు అజాజ్ పటేల్, సాంట్నర్, గ్లెన్ ఫిలిప్స్, ఇష్ సోధీ నిరూపించారు. ముంబై వాంఖడే స్టేడియం వేదికగా ముగిసిన ఆఖరి టెస్టులో విజయలక్ష్యం 147 పరుగులు సాధించలేక చతికిల పడిన తీరు భారత బ్యాటర్ల డొల్లతనాన్ని బయట పెట్టింది.

బెంగళూరు వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలిటెస్టులో కేవలం 46 పరుగులకే కుప్పకూలిన భారత్ నాణ్యమైన స్వింగ్ బౌలింగ్ ఆడలేదని ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ చాటి చెబితే.. పేస్ మాత్రమే కాదు..స్పిన్ బౌలింగ్‌లోనూ పరుగులు సాధించలేక వెలవెల పోయింది.

### ఆ నలుగురికి ఏమైంది?

సాంప్రదాయ టెస్టు క్రికెట్లో..అదీ స్వదేశీ పిచ్‌లపైన టన్నుల కొద్దీ పరుగులు సాధించడంలో తమకుతామే సాటిగా నిలిచిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, అశ్విన్, రవీంద్రజడేజా తమ కెరియర్ ముగిసే దశలో దారుణంగా విఫలమయ్యారు. ఇక బౌలింగ్‌లో భారత తురుపుముక్కలుగా పేరుపొందిన స్పిన్ జోడీ రవిచంద్రన్ అశ్విన్, రవీంద్రజడేజా స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోడం దారుణంగా దెబ్బతీసింది.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

న్యూజిలాండ్ స్పిన్నర్ల ఎదుర్కొనడంలో భారత టాపార్డర్ ఘోరంగా విఫలమైతే..భారత స్పిన్నర్లను అవలీలగా ఎదుర్కొంటూ న్యూజిలాండ్ టాపార్డర్ పరుగులు సాధించిన తీరే దానికి నిదర్శనం.

భారత సారథి రోహిత్ శర్మ బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లతో ఆడిన సిరీస్ లోని గత 10 ఇన్నింగ్స్ లో 133 పరుగులు మాత్రమే సాధించగలిగాడు. ఇక రికార్డుల మొనగాడు విరాట్ కోహ్లీ గత 10 ఇన్నింగ్స్ లో 192 పరుగులు చేయటం భారత అవకాశాలను దారుణంగా దెబ్బతీసింది. ప్రస్తుత సీజన్లో ఆడిన ఐదు స్వదేశీ టెస్టు మ్యాచ్‌ల్లో విరాట్ రెండంటే రెండు అర్ధ శతకాలు మాత్రమే సాధించడం, స్పిన్ బౌలర్లకే తరచూ దొరికిపోడం చర్చనీయాంశంగా మారింది.

2012లో చివరిసారిగా రంజీమ్యాచ్ ఆడిన విరాట్ నాటి నుంచి దేశవాళీ క్రికెట్ కు దూరంగా ఉండడం బౌలర్లను ఎదుర్కొనడంలో తడబాటుకు కారణమని తేలింది.

కెప్టెన్‌గా, ఓపెనర్‌గా కీలక భూమిక నిర్వర్తించాల్సిన రోహిత్ దూకుడు తత్వమే భారత అరుదైన ఈ వైఫల్యానికి కారణమని అనిల్ కుంబ్లే లాంటి విశ్లేషకులు తేల్చి చెప్పారు.రోహిత్ కెప్టెన్‌గా స్వదేశంలో భారత్ ఆడిన 23 టెస్టుల్లో 17 విజయాలు, 2 డ్రా, నాలుగు పరాజయాల రికార్డు నమోదయ్యింది.

### ఫలించని స్పిన్ 'మంత్రం'....!

స్వదేశీ పిచ్‌లపైన గత దశాబ్దకాలంగా స్పిన్ వ్యూహంతో విదేశీ జట్లను భారత్ కకావికలు చేయడంలో ప్రధానపాత్ర వహించిన 38 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్, 36 సంవత్సరాల రవీంద్ర జడేజా స్థాయికి తగ్గట్టుగా రాణించడంలో తొలిసారిగా విఫలమయ్యారు. బంగ్లాదేశ్‌తో రెండుమ్యాచ్‌ల సిరీస్‌లో 11 వికెట్లు, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో 26 వికెట్లు పడగొట్టిన అశ్విన్..న్యూజిలాండ్ సిరీస్‌లో మాత్రం 9 వికెట్లతో వెలవెల పోయాడు. అశ్విన్ బౌలింగ్‌లోనే కివీ బ్యాటర్లు అత్యధికంగా పరుగులు రాబట్టగలిగారు. బ్యాటింగ్ లోనూ అశ్విన్ విఫలం కావడం భారత్ పరాజయాలకు ఓ కారణంగా నిలిచింది.

ఇక..ఎడమచేతి వాటం స్పిన్నర్ జడేజా 2013 నుంచి స్వదేశంలో ఆడిన 48 టెస్టుల్లో అత్యంత నిలకడగా రాణిస్తూ వచ్చాడు. అయితే న్యూజిలాండ్ పైన తొలిటెస్టులో స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయిన జడేజా ఆఖరి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ ఐదేసి వికెట్లు సాధించినా.. బ్యాటింగ్‌లో నామమాత్రంగానే పరుగులు సాధించడం భారత్ విజయావకాశాలను దెబ్బతీసింది.

భారత్ వేదికగా రోహిత్, విరాట్, అశ్విన్, జడేజా న్యూజిలాండ్ సిరీస్ లోనే తమ ఆఖరి టెస్టు ఆడేసినట్లుగానే క్రికెట్ పండితులు పరిగణిస్తున్నారు. ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ సిరీసే ఈ నలుగురు మొనగాళ్ల కెరియర్‌లో రిటైర్మెంట్ సిరీస్‌గా మిగిలినా ఆశ్చర్యపోనక్కరలేదు.

స్వదేశీ గడ్డపై గత 14 సంవత్సరాలుగా అజేయజట్టుగా నిలిచిన భారత్ ను న్యూజిలాండ్ 3–0తో చిత్తు చేయడంతో భారత టెస్టు కంచుకోట బీటలు వారిందని చెప్పక తప్పదు.


సాంప్రదాయ టెస్టు క్రికెట్ లీగ్ ప్రపంచ ఫైనల్స్ కు భారత్ వరుసగా రెండుసార్లు చేరడం, పలు అపురూప విజయాలు సాధించడంలో కీలకపాత్ర పోషించిన రోహిత్, విరాట్, అశ్విన్, జడేజాల రిటైర్మెంట్ ప్రకటనతో భారత క్రికెట్లో అంతులేని శూన్యం ఏర్పడటం ఖాయమనడంలో ఏ మాత్రం సందేహం లేదు.! ★

# మన అస్తిత్వం స్పష్టం కావాలి కదా!

హిందుత్వాన్ని ఎవరికి తోచినట్టు వారు నిర్వచిస్తే మౌనం దాల్చడం ఇంక సరికాదు. హిందూయిజం అని ఎక్కువ మంది ప్రస్తావిస్తున్న పేరు గౌరవ ప్రదమైనదీ, సానుకూల దృక్పథాన్ని ఆవిష్కరించేదీ కాదు. హిందుత్వం ఒక ఇజమ్ కాదు. హిందూత్వకు సరైన ఆంగ్లానువాదం కావాలంటే అది హిందూనెస్ అవుతుంది. హిందూయిజం అంటే మార్పునకు అవకాశంలేని భావజాలం. హిందూ జీవన విధానంలో, చింతనలో చోటు లేనిదే అలాంటి భావజాలానికి. ఏమైనా హిందూ జీవనాన్ని ప్రతిబింబిస్తాయనుకునే ఏ పదాన్ని ప్రయోగించాలన్నా చాలా జాగరూకత అవసరం. హిందూయిజం వంటి పదాలతో పిలవడం అంటే ఒక నాగరికత మొత్తాన్ని అవమానించడమే అవుతుంది. హిందూయిజం అన్నది మొత్తం ఒక సనాతన నాగరికతకు అపార్థాలు అపాదించడానికి జరిగిన ప్రయత్నం. ప్రపంచాన్ని విధ్వంసం వైపు నెట్టుకు వెళ్లిన ఇజాల సరసన హిందూయిజంను చేర్చే ప్రయత్నం సహించరానిది. ఇప్పటికైనా ఈ అంశం మీద స్పష్టత తీసుకురావాలి. ఆ ప్రయత్నం చాలా కాలం క్రితమే మొదలయింది. 'భారతదేశం హిందూ రాష్ట్రం, లేక హిందుత్వమే రాష్ట్రీయత (జాతీయత)' అన్నారు డాక్టర్‌జీ. హిందూ జీవన విధానాన్ని ఏ పేరుతో బడితే ఆ పేరుతో పిలవడం సరికాదన్న విషయాన్ని స్పష్టం చేయడానికి, ఏ పేరుతో పిలిస్తే చరిత్రకు న్యాయం జరుగుతుందని అనుకోవచ్చునో ఒక రూపు ఇవ్వడానికి జరిగిన ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. హిందూ అన్న పదం మన ఆర్ష వాఙ్మయంలో కనిపించదని అంటారు. కానీ వేర్వేరు పేర్లతో పిలిచినా, నిర్వచించినా ఒకే జీవన విధానాన్నీ, తాత్త్వికతనూ గుర్తించడానికి చేసిన ప్రయత్నమే అందులో ఉంది.

ఈ పుస్తకంలో సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ మరాఠీ దినపత్రిక 'లోకమత్' ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'హిందుత్వమే రాష్ట్రీయ ఏకాత్మత' అనే అంశంపై ప్రసంగించారు. ఆ ప్రసంగమే ఈ పుస్తకం ఇతివృత్తం, అలాగే సురేష్ సోనీ (అఖిల భారత కార్యకారిణి సభ్యులు), అరుణ్ కుమార్ (అఖిలభారత సహ సర్ కార్యవాహ) ఈ ఇద్దరు వివిధ సందర్భాలలో 'హిందుత్వం' పై చేసిన ఉపన్యాసాల ఆధారంగా ఈ సంవత్సరం జూన్ మాసంలో సురుచి ప్రకాశన్ వారు 'వర్తమాన్ సందర్భమే హిందుత్వకి ప్రస్తుతి' పేరుతో హిందీలో పుస్తకం ముద్రించారు. దానిని 'నవయుగ భారతి' ప్రచురణల విభాగం తెలుగులో 'హిందుత్వం-సనాతనం- నిత్య నూతనము' పేరుతో వి.వి. సుబ్రహ్మణ్యం అనువదించిన పుస్తకాన్ని ముద్రించినది.

ఈ పుస్తకంలో ప్రముఖమైన కొన్ని విషయాలను పాఠకుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఒక చిన్న ప్రయత్నం. వర్తమాన పరిస్థితులలో హిందూ సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలకు, సవాళ్లకు సమాధానం చెప్పటం మాత్రమే కాక ప్రపంచంలో నిర్మాణమవుతున్న సమస్యల పరిష్కారానికి హిందుత్వం ఎటువంటి ఆలోచనలు అందించగలుగుతుంది అనే విషయాలు కూడా ఈ పుస్తకంలో కొన్ని ప్రస్తావించారు.




**హిందుత్వం**

**సనాతనం - నిత్యనూతనం**

**ఉపన్యాస సంకలనం:** (డా. మోహన్ భాగవత్, సురేశ్ సోని, అరుణ్‌కుమార్)

**అను:** వి.వి. సుబ్రహ్మణ్యం

**ప్రతులకు:** సాహిత్య నికేతన్

**ఫోన్ :** 040-2763236, 9290127329 9440589722

**పేజీలు:** 88, **వెల:** రూ. 100/-

ఈ పుస్తకంలో "ఆద్యంతరహితమైన శాశ్వత సత్యాలు, కాలానుగుణ్యంగా పరివర్తన శీలమైన కొన్ని విషయాలు ఈ పుస్తకంలో ప్రస్తావనకు వస్తాయి. మన పరంపరాగతమైన శాశ్వత విషయాలపై ఈరోజు చోటుచేసుకుంటున్న వక్రభాష్యాలను, కొన్ని వికృత వ్యవహారాలను సరి చేసుకోవటానికి కావలసిన వ్యాఖ్యానాలు కూడా మనకు ఈ పుస్తకంలో కనబడతాయి. కాలానుగుణ్యమైన మార్పులు చేసుకోవటం మన సమాజ సహజస్వభావం.

21వ శతాబ్దంలో చోటు చేసుకొన్న అనేక క్రొత్త క్రొత్త ఆలోచనలను ఎట్లా అనుసంధానం చేసుకోవాలి, ఎటువంటివి కాల ప్రవాహంలో కొద్దికాలం ఉండి పడిపోతాయి, ఎటువంటివి ఈ కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోవలసినవి – ఈ పుస్తకంలో చర్చకు వచ్చాయి. ఇప్పుడున్న కొన్ని పరిస్థితులు కాలక్రమంలో వాటికవే సర్దుకు పోవటమో లేక కాలగర్భంలో కలిసిపోవటమో జరుగుతాయి కాబట్టి సమాజ నిరంతర జీవనంలో ఏ విషయాలు మనం ఆలోచించాలి అనేది ఇందులో ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చాయి.

ప్రస్తుత సంక్షుభిత ప్రపంచంలో పరిస్థితులు, మన దేశంలో, మన చుట్టూ ఉన్న పరిస్థితులను ఒక హిందువుగా మనం చూడవలసిన దృష్టికోణం వాటిని చక్కదిద్దుకోవటానికి మన ఆలోచనలు ఎట్లా ఉండాలి అనే విషయాలు ఈ పుస్తకంలో మనకు స్పష్టంగా వివరించారు. మనం అందరం ఈ పుస్తకాన్ని అధ్యయనం చేసి పరంపరాగతమైన మన జీవనశైలిని కాపాడుకొందాము.

మన హిందూసమాజం నిరంతర గంగా ప్రవాహం లాంటిది. గంగా ప్రవాహంలో ప్రవాహానికి అనేక అడ్డంకులు ఒడుదొడుకులు వస్తుంటాయి. వాటన్నిటిని అధిగమిస్తూ గంగా ప్రవాహము వేల సంవత్సరాల నుంచి ఏ రకంగా ప్రవహిస్తున్నదో ఈ హిందూ సమాజం కూడా వేల సంవత్సరాలనుండి అనేక భీషణ పరిస్థితులను ఎదుర్కొంటు నిలబడి ఉన్నది.

అటువంటి శక్తి సామర్థ్యాలు కలిగినటు వంటిది హిందూ సమాజం. నిజానికి హిందుత్వం అన్నది సంఘ పరిధిలో, చింతనలో పాత అంశమే. ఇప్పుడు బయట ఇంత చర్చకు పెట్టవలసిన అవసరం ఏమిటి? అంటే– ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్‌ను నాయకత్వ స్థానంలో మొత్తం హిందూ సమాజం, భారతీయ సమాజం చూస్తున్నది కాబట్టి. అందుకే హిందూత్వం అనే పదం అసలు అర్థం వెల్లడించడం ఇవ్వాల్టి తక్షణ అవసరం. ఆ ప్రయత్నం ఇందులో జరిగింది. ఈ విషయాలను మనం గమనించి వర్తమాన పరిస్థితులలో మన హిందూత్వానికి ఏ రకమైన వ్యాఖ్యానం చేసుకోవాలి అనేది తెలుసుకోవాలి. దానికోసమే ఈ పుస్తక ప్రయత్నం. అయినా హిందూ అన్న పదాన్ని అర్థం చేసుకోవడం దగ్గర ఇప్పుడు కూడా మనం గందరగోళానికి గురికావడం ఒకింత అవమానమే కూడా. అంధకారంలో ఉంచి, మనది కాని ఒక అవమానకర అస్తిత్వాన్ని మన మెడలో వేలాడదీస్తే దానిని ఇంకా ఎందుకు మోయాలి?

**– రాంపల్లి మల్లికార్జునరావు**

# పోస్ట్‌మెన్‌లకు సన్మానం



**నల్లగొండ :** జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా అక్టోబర్ 30న నల్లగొండ జిల్లా అనుముల మండలం, హాలియాలో పోస్టుమాన్‌లకు సిబ్బందికి సన్మానం జరిగింది. ఇందులో నల్లగొండ విభాగ్ గ్రామవికాస్ ప్రముఖ్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి, ఖండ సంపర్క ప్రముఖ్ రాయప్రోలు మురళికృష్ణ, పర్యావరణ ప్రముఖ్ వీరయ్య, సంస్కృతభారతి సంయోజక్ గాయకవాడ అక్కయబాబు, కంచర్ల సోమారెడ్డి, అత్తులూరి పాపారావు, కొత్తూరు చినరామయ్యలు పాల్గొన్నారు.

## ధర్మాచార్యుల సమ్మేళనం





**కందకుర్తి:** లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా ఇందూరు జిల్లాలోని త్రివేణి సంగమ (గోదావరి, మంజీరా, హరిద్రా నదుల) క్షేత్రమైన కందకుర్తిలో అక్టోబర్ 27న సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ధర్మాచార్యుల సమ్మేళనం జరిగింది. 7 జిల్లాల నుండి ధర్మాచార్యులు, స్వామీజీలు వారి శిష్య బృందం 100 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభంలో లోకమాత అహల్యాబాయి హోల్కర్ పుష్కరఘాట్ దగ్గర గోదావరి నది హారతి సామూహికంగా నిర్వహించి, అహల్యాబాయి చిత్రపటానికి, నదీమ తల్లికి పూలు సమర్పించారు. అహల్యాబాయ్ హోల్కర్ జీవితంపై కొత్తగా ప్రచురించిన పుస్తకాన్ని, మలయాళస్వామి జీవిత సూక్తుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమరసతా వేదిక రాష్ట్ర సంయోజకులు సమ్మేళనం ఉద్దేశాన్ని ప్రస్తావన రూపంలో సభ ముందుంచారు. స్వామీజీలు సమరసతకు సంబంధించిన వ్యక్తిగత అనుభవాలను, ఆవశ్యకతను తెలియజేసారు.

# కేశవ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ






**భాగ్యనగర్ :** నవంబర్ 3న జాగృతిభవన్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం జరిగింది. సమితి కార్యదర్శి కొప్పరపు బాలయ్య సంస్థ ఉద్దేశ్యం, చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కాఫోర్జ్ ఐటీ ఉపాధ్యక్షుడు రమాకాంత్, విద్యానగర్ ఎయిర్‌కండిషనర్ పంపిణీదారు సత్యానంద్, జాగృతి ట్రస్ట్ కార్యదర్శి రాఘవేంద్ర, రక్షణమంత్రిత్వ శాఖ సీనియర్ సంచాలకులు శ్రీరవిచంద్ర, కేర్ ఆసుపత్రికి చెందిన ఫిజియోథెరపిస్ట్ ప్రణీత్ గౌడ్ కోర్సుల గురించిన విషయం వాటి ప్రాముఖ్యం, జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన విలువల గురించి అభ్యర్థులకు వివరించారు.

## సేవాభారతి సేవలు అమోఘం



**జగిత్యాల :** సేవాభారతి ద్వారా నిరుపేద, గ్రామీణ విద్యార్థులకు, మహిళల అభ్యున్నతికోసం వాల్మీకి ఆవాసం, జగిత్యాలశాఖ అందిస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణా(మూడవబ్యాచ్) కార్యక్రమం ముగింపు సందర్భంగా అక్టోబర్ 26న సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆడువాలజ్యోతి, సేవాభారతి ప్రాంత సంఘటనా కార్యదర్శి వాసు, ఆవాసం కమిటీసభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లాలోని ఎండపెల్లి మండలం గొల్లకోట గ్రామానికి చెందిన ప్రవాసభారతీయుడు జల్లెల కిరణ్‌కుమార్(ఖతార్ దేశంలో ఓ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్) రూ.50వేలు విలువచేసే కుట్టుమిషన్లు పంపిణీచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.




## చింతలరాయస్వామి దేవాలయం - తాడిపత్రి



### తెలుసుకుందాం

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రిలో పెన్నా నది ఒడ్డున ఈ ఆలయం కొలువుదీరింది. విష్ణు స్వరూపమైన వేంకటేశ్వరుడికి ఈ ఆలయాన్ని అంకితమిచ్చారు. ఇక్కడి స్వామివారిని చింతల వెంకటరమణస్వామి అని పిలుస్తారు. శ్రీకృష్ణదేవరాయల సమకాలీనుడైన పెమ్మసాని తిమ్మనాయుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. విష్ణువు తనకు తాడిపత్రిలో ఆలయాన్ని నిర్మించాలని కలలో తిమ్మనాయుడుకు చెప్పారని చరిత్ర చెబుతోంది. ఆలయ గోడలపై విజయనగర రాజుల వాస్తు శిల్పకళ ఉట్టిపడుతూ ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉంటుంది.

## కథ | బడాయి ఎలుక!



అరవిందాపురం అనే ఊరిలో పాపయ్య అనే రైతు ఉండేవాడు. తన ఆవులను రోజూ పొలానికి తీసుకెళ్తూ ఉండేవాడు.

పొలం గట్టు కలుగులో ఉంటున్న ఎలుక కొన్ని పిల్లలను పెట్టింది.

ఆ పిల్లలు ఒకరోజు పొలంలో గడ్డి మేస్తున్న ఆవును చూశాయి.

అంత పెద్ద ఆవును చూసి భయంతో పరుగెత్తుకుని వెళ్లి తల్లికి చెప్పాయి.

అక్కడే ఉన్న మరో ఎలుక.. ఏమిటి నాకంటే పెద్ద జంతువా? అని ప్రశ్నించింది.

చాలా పెద్దదని ఎలుక పిల్లలు చెప్పాయి.

## పద్యం



లావుగలవాని కంటెను
భావింపగ నీతిపరుఁడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ!

**భావం :** లోకమునందు శరీరబలమున్న వాని కంటే న్యాయంగా ఉండేవాడు బలవంతుడని లెక్కించు కోవాలి. ఎట్లనగా పర్వతమంతటి ఏనుగు కంటెనూ, చిన్నవాడైన మావటివాడు అయదానిని లొంగదీసు కొని ఎక్కుచున్నాడు కదా! కనుక శరీర బలం కలవాని కంటే బుద్ధి బలం కలవాడే నిజముగా బలవంతు డని అర్థము.

## శ్లోకం

అపి స్వర్ణమయిలంకా
సమేలక్ష్మణ! రోచతే
జననీ జన్మభూమిశ్చ
స్వర్గాదపి గరీయసి

**భావం :** 'లక్ష్మణా! ఈ లంక స్వర్ణమయ మైనప్పటికీ నాకు రుచించదు. జనని, జన్మభూమి – ఈ రెండూ స్వర్గం కంటే గొప్పవి' అని శ్రీరామచంద్రుడు సోదరుడిని ఉద్దేశించి చెప్పిన మాటలు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| అతిపెద్ద నది | ఆస్ట్రిచ్ |
| అతిపెద్ద పక్షి | తిమింగలం |
| అతిపెద్ద జంతువు | రష్యా |
| అతిపెద్ద దేశం | చైనా వాల్ |
| అతిపెద్ద నిర్మాణం | అమెజాన్ |

**సమాధానాలు :** అతిపెద్ద నది–అమెజాన్; అతిపెద్ద పక్షి–ఆస్ట్రిచ్; అతిపెద్ద జంతువు–తిమింగలం; అతిపెద్ద దేశం–రష్యా; అతిపెద్ద నిర్మాణం–చైనా వాల్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### సర్దార్ మరుపిళ్ల చిట్టి



ఏపీకి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. ఈయన అసలు పేరు వారపు అప్పలస్వామి. 1898, నవంబర్ 27న కృష్ణా జిల్లాలో జన్మించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో చురుగ్గా వ్యవహరించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు 1942 ఆగస్ట్ 18న అరెస్ట్ కూడా అయ్యారు. వ్యక్తి సత్యాగ్రహంలో క్రియాశీలకంగా పాల్గొని 18 నెలల జైలుశిక్షతో పాటు 500 రూపాయల జరిమానా కట్టారు. ఈయన అలీపురం, వెల్లూరు, నాగపూరు, అమరావతి జైళ్లలో శిక్షను అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. 1971, జూలై 18న మరణించారు.



ఆ ఎలుక కలుగులోకి పోయి బాగా ఆహారం తిని వచ్చి.. ఇప్పుడు చూడండి మీరు చూసిన జంతువు శరీరం ఇంతకంటే పెద్దగా ఉంటుందా అని ప్రశ్నించింది.

ఇంకా పెద్దగా ఉంటుందని జవాబిచ్చాయి.

ఈసారి ఇంకా పెద్దగా కనిపించాలని ఇంకా ఎక్కువ ఆహారం తిని వచ్చింది.

దీంతో కాసేపటికే ఆయాసంతో పొట్ట పగిలి చచ్చిపోయింది.

తాహతుకు మించి బడాయికి పోకూడదని ఎలుక పిల్లలకు అర్థమైంది. ★

## జనరల్ నాలెడ్జ్

1. అత్యంత వేడిగా ఉండే ఖండం ఏది?
2. జపాన్ కరెన్సీ ఏది?
3. ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశం ఏది?

సమాధానాలు : 1. ఆఫ్రికా; 2. యెన్; 3. ఖతార్;

## మెదడుకు మేత

తెల్లకోటు తొడుక్కున్న
ఎర్రముక్కు దొర..
ఏమిటది?

జవాబు : కొవ్వొత్తి

## మంచిమాట

మీకు నచ్చిన వారితో ప్రేమగా మెలుగు, నిన్ను మెచ్చిన వారితో నిజాయతీగా ఉండు!



# వారఫలాలు

11-17 నవంబర్ 2024




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. రుణాలు తీరతాయి. విద్యార్థులకు శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఇంటి నిర్మాణాలలో ఆటంకాలు క్రమేపీ తొలగుతాయి. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగాలలో ఊహించని హోదాలు. రచయితలు, క్రీడాకారులు, రాజకీయవర్గాలకు విశేష గుర్తింపు, సత్కారాలు జరుగుతాయి. 11,12 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. వివాదాలు. శివాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆత్మీయులు, బంధువుల నుంచి ఊహించని ఆహ్వానాలు. వివాహాది శుభకార్యాల నిర్వహణపై దృష్టి సారిస్తారు. స్థిరాస్తి వివాదాల నుంచి బయట పడతారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా కొనసాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు సంభవం. వైద్యులు,పారిశ్రామికవేత్తలు, వ్యవసాయదారులకు అన్ని విధాలా సానుకూలత ఉంటుంది. 14,15 తేదీల్లో అనారోగ్యం. మానసిక అశాంతి. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం రాగలదు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. వాహనాలు, భూములు కొంటారు. శత్రువులు కూడా మిత్రులుగా మారతారు. వ్యాపారాలు సజావుగా సాగు తాయి. ఉద్యోగాలలో కొత్త హోదాలు దక్కుతాయి. వైద్యులు, రచయితలు, క్రీడాకారులకు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. 11,12తేదీల్లో ఆరోగ్యభంగం. మిత్రులతో కలహాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయం విషయంలో మరింత పురోగతి కనిపిస్తుంది. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. అత్యంత చాకచక్యంగా కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలు అనుకున్న విధంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో ఉన్నతస్థితి పొందుతారు. రాజకీయవేత్తలు, కళా కారులు, వైద్యులకు మరింత ప్రోత్సాహకరమైన కాలం. 12,13 తేదీల్లో అనారోగ్యం. శ్రమాధిక్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

సమాజంలో పరపతి పెరుగుతుంది. స్నేహితుల ద్వారా ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. చిన్ననాటి విషయాలు గుర్తుకు తెచ్చుకుంటారు. ఆరోగ్యసమస్యలు కొంత చికాకు పరుస్తాయి. బంధువుల సలహాలు స్వీకరిస్తారు. ఒక వివాదం నుంచి గట్టెక్కుతారు. ఉద్యోగాలలో అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. వివాదాలు కొన్ని తీరతాయి. 15,16 తేదీల్లో మానసిక అశాంతి. కుటుంబంలో కొన్ని సమస్యలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

స్థిరాస్తి వివాదాలు, కోర్టు కేసుల నుంచి విముక్తి లభిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఆలయాల సందర్శన. వాహనాలు, భూములు కొనుగోలు. విద్యార్థులకు ఫలితాలు రావచ్చు. వ్యాపారాలు లాభసాటి. ఉద్యోగాలలో కోరుకున్న రీతిలో మార్పులు. రచ యితలు, వ్యవసాయదారుల ఆశలు ఫలిస్తాయి. 16, 17 తేదీల్లో అనారోగ్యం. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయం కొంత నిరాశపర్చినా అవసరాలకు లోటు ఉండదు. ఆలోచనలు అమలు చేస్తారు. ప్రముఖులతో ముఖ్య విషయాలపై ఉత్తర ప్రత్యుత్తరాలు. పాతమిత్రులను కలుసుకుని కష్టసుఖాలు విచారిస్తారు. కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో పురోగతి. 12,13లలో వ్యయప్రయాసలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతం. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. మీ నిర్ణయాలు కుటుంబ సభ్యులను ఆకట్టుకుంటాయి. వివాహ, ఉద్యోగయత్నాలలో పురోగతి. కొత్త భాగస్వాములతో విస్తరిస్తారు. వైద్యులు, వ్యవసాయదారులు, రచయిత లకు అన్ని విధాలా అనుకూల సమయం. 11,12 తేదీల్లో వ్యయప్రయాసలు. ఆరోగ్యసమస్యలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొన్ని వ్యవహారాలు నిదానంగా పూర్తి కాగలవు. ఆదాయం కొంత నిరుత్సాహపరుస్తుంది. అయితే అవసరాలు తీరతాయి. స్వల్ప అనారోగ్య సూచనలు. వ్యాపారాలు క్రమేపీ పుంజుకుంటాయి. ఉద్యోగాలలో కొన్ని మార్పులు సంభవం. పారిశ్రామిక, రాజకీయవేత్తలు క్రీడాకారులకు శ్రమానంతరం ఫలితం కనిపిస్తుంది. 14,15 తేదీల్లో సన్నిహితులతో విభేదాలు. శ్రమ తప్పదు. ఆంజనేయ దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆదాయానికి లోటు ఏర్పడి అప్పులు చేస్తారు. ఆరోగ్య, కుటుంబసమస్యలు వేధిస్తాయి. నిర్ణయాలు కొన్ని మార్చుకుంటారు. విద్యార్థులకు ఒత్తిడులు మరింత పెరుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఇంటి నిర్మాణయత్నాలు సాగవు. ఉద్యోగాలలో ఒత్తిడులు ఉండవచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, వైద్యులకు విదేశీ పర్యటనలు వాయిదా. 13,14 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొన్ని సమస్యలను నేర్పుగా పరిష్కరించుకుంటారు. విద్యార్థులు ప్రతిభను నిరూపించుకుంటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యపరంగా కొద్దిపాటి చికాకులు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పరిచయాలు మరింత పెరుగుతాయి. వ్యవసాయదారులు, రాజకీయవేత్తలు, కళాకారులు కొన్ని ఇబ్బందులు అధిగమిస్తారు. 16,17 తేదీల్లో మానసిక ఆందోళన. విష్ణుధ్యానం చేయండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

చేపట్టిన వ్యవహారాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. రాబడి మరింత మెరుగ్గా ఉండి రుణాలు తీరుస్తారు. గృహ నిర్మాణయత్నాలు సానుకూలం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మేర విస్తరిస్తారు. ఉద్యోగాలలో అనుకోని హోదాలు రావచ్చు. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు గౌరవ పురస్కారాలు, విదేశీయానం. 13,14 తేదీల్లో శ్రమాధిక్యం. గణేశ్ స్తోత్రాలు పఠించండి. ★

నిర్వహణ : పోపూరి విశ్వనాథ్ 9133197111

# పదరసం-487

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | ■ | 3 | | 4 | ■ |
| | ■ | | ■ | 5 | | | ■ | | ■ |
| 6 | | | ■ | | ■ | 7 | | | |
| | ■ | 8 | 9 | | | ■ | ■ | | ■ |
| ■ | 10 | ■ | | ■ | ■ | 11 | | | ■ |
| ■ | | ■ | 12 | | | | ■ | ■ | 13 |
| 14 | | 15 | | ■ | ■ | 16 | | | |
| | ■ | | ■ | 17 | ■ | | ■ | ■ | |
| 18 | | | | | ■ | 19 | | | |
| | ■ | | ■ | | ■ | 20 | | ■ | ■ |

### ఆధారాలు

**అడ్డం**

1) ఆకాశంలో ఇది కనిపిస్తే అరిష్టమంటారు (4)

3) దీనిని హారతికి వాడతారు (3)

5) శ్రీకృష్ణుని భార్య (3)

6) నమూనా (3)

7) అపసవ్యంగాఉన్న చూపుడువేలు (4)

8) "కన్యాశుల్కం" నవలారచయిత ఇంటిపేరు (4)

11) వినిపించని జబ్బు (3)

12) బతికుంటే ఇది తినొచ్చని సామెత (4)

14) నెలవు (4)

16) ఎన్నిసార్లైనా, నిస్సందేహంగా (4)

18) నిలకడలేనిదాన్ని దీనితో పోలుస్తారు (6)

19) సంపాదన (3)

20) చిన్నకొమ్మ (2)

**నిలువు**

1) వనానికి ఉండే కాపరి (4)

2) బంధుత్వం (4)

3) చిన్నముక్క, బొట్టు (3)

4) శ్రీరంగంలో కొలువైయున్న దేవుడు (5)

5) పైకొచ్చిన కుమార్తె (3)

9) తప్పులెన్నుతూ తిట్టు (4)

10) పనికిరానివాడు, అప్రయోజకుడు (3)

11) నిప్పుపుట్టించే ఉక్కుముక్క (4)

13) చక్కగా, విశేషంగా చేసే స్తుతి (4)

14) నీటిప్రవాహాన్ని నియంత్రించేందుకు కట్టేది (4)

15) బయట బాగుండలేదు (4)

17) ఎముకలు (3)

19) కొన్నిప్రాంతాలలో పెద్దమ్మని (తల్లి అక్క) ఇలా అంటారు (2)

### పదరసం - 486 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ[1] | చూ | కి[2] | | అ[3] | | | టో[4] | క[5] | రా |
| లో | | ర్త[6] | స్క | సం | ఘ | సం[7] | | ల | |
| చ[8] | ల | నం | | పూ | | పా[9] | పా | యి | |
| న | | | మూ[10] | ర్తి | | ద | | క[11] | క[12] |
| | పా[13] | వ | లా | | పా[14] | న | కం[15] | | టు |
| | ప | | ధా[16] | తు | వు | | ద[17] | ద్దు | రు |
| వె[18] | ట | కా | రం | | రా | | దుం | | |
| | బి | | | ఉ[19] | లు | కు[20] | ప | లు[21] | కు |
| ము[22] | ళ్ళ | పూ | డి[23] | | | బే | | గు | |
| ల్లె | | | తా[24] | రు | మూ | రు | | మి[25] | న్ను |




'మహానటి, సీతారామం' చిత్రాలతో తెలుగువారికి చేరువయ్యాడు ప్రముఖ మలయాళీ నటుడు మమ్ముట్టీ తనయుడు దుల్కర్ సల్మాన్. అతని తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' దీపావళి కానుకగా విడుదలైంది. గత యేడాది ధనుష్ హీరోగా 'సార్' చిత్రాన్ని రూపొందించిన వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆ సినిమాను నిర్మించిన సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థే ఇప్పుడు 'లక్కీ భాస్కర్'ను ప్రొడ్యూస్ చేసింది. తొంభైవ దశకంలో బ్యాంకింగ్ వ్యవస్థలోనూ, షేర్ మార్కెట్ లోనూ జరిగినన్ని ఘోరాలు ఇన్నీ అన్నీ కావు. దిగువ మధ్య తరగతి వారిని కోటీశ్వరులను చేసింది. కోటీశ్వరులను రాత్రికి రాత్రి బికారులుగానూ మార్చేసిన కాలమది. ఆ నేపథ్యంలో తెలుగులో పూర్తి స్థాయి సినిమాలేవీ రాలేదు. హిందీలో కొన్ని వెబ్ సీరిస్ లు వచ్చాయి. ఇప్పుడా లోటు ను భర్తీ చేయడానికి అన్నట్టుగా వచ్చిందే 'లక్కీ భాస్కర్'.

# బ్యాంకింగ్ వ్యవస్థ లోపాలను ఎత్తి చూపే 'లక్కీ భాస్కర్'

ఇది 1990లలో ముంబైలో జరిగే కథ. మగధ బ్యాంక్ ఉద్యోగి అయిన భాస్కర్ (దుల్కర్ సల్మాన్) కథ. మధ్య తరగతి మనిషికి ఉండే సినిమా కష్టాలు అతనికీ ఉంటాయి. తండ్రి అనారోగ్యం, తమ్ముడి చదువు, చెల్లి పెళ్ళి, ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య, ఒక్కగానొక్క కొడుకు... వీళ్ళందరి బాధ్యతలను నెరవేర్చాల్సింది భాస్కరే. అతనికొచ్చే జీతం సరిపోదు. వీధీవాడా అంతా అప్పులు చేస్తుంటాడు. వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతుంటాడు. ఆ టైమ్‌లో సాయం కోసం అతని దగ్గరికి స్నేహితుడు సాంబ (రాజకుమార్ కసిరెడ్డి) ద్వారా ఆంటోనీ (రాంకీ) పరిచయం అవుతాడు. బ్యాంక్ లాకర్ లోని డబ్బుల్ని పై అధికారులకు తెలియకుండా కమీషన్ కు కక్కుర్తి పడి రాంకీకి చేరవేస్తాడు. దాని ద్వారా అతను చేసే ఇల్లీగల్ బిజినెస్‌లో భాగస్వామిగా మారతాడు. అక్కడ నుండి భాస్కర్ కష్టాలన్నీ తీరిపోతాయి. రాత్రికి రాత్రి లక్షాధికారి అయిపోతాడు. అదే సమయంలో హర్ష మెహ్రా సహాయకుడితో చేతులు కలిపి, షేర్స్ ట్రేడింగ్ లోకి అడుగుపెడతాడు. ఇప్పుడు కోట్లు గడిస్తాడు. అయితే... చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వాళ్ళు ఎక్కడో చోట దొరికిపోతారు. సమాజం, చట్టం దృష్టిలో దోషులుగా నిలబడతారు. అలాంటి పరిస్థితిని భాస్కర్ ఎప్పుడు? ఎలా ఎదుర్కొన్నాడు? అతనితో పాటు ఈ భారీ స్కామ్ లో భాగస్వాములైన వారి పరిస్థితి ఏమిటీ? అనేదే మిగతా కథ. సినిమా టైటిల్ కు తగ్గట్టుకునే ప్రతి కీలకమైన మలుపులోనూ భాస్కర్ లక్కీ అనేది తేటతెల్లమౌతుంది. ఓ రకంగా ఈ సినిమాను దీపావళికి విడుదల చేసిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సైతం లక్కీ అనే చెప్పాలి.

బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలతో పాటు దలాల్ స్ట్రీట్ లో జరిగే మోసాలను ఈ సినిమాలో దర్శకుడు వెంకీ అట్లూరి కళ్ళకు కట్టినట్టు చూపాడు. 1990లతో పోల్చితే ఇప్పటి వారికి షేర్ మార్కెట్ మీద మంచి అవగాహనే ఉంది. అదో రకమైన జూదం అని తెలియడంతో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పైగా ప్రతి ఒక్కరూ షేర్ ట్రేడింగ్‌లో భాగస్వాములయ్యే వ్యవస్థలూ ఇప్పుడు మనకున్నాయి. ఊహించని సంఘటనలు, అధికార పార్టీ తీసుకునే కీలక నిర్ణయాలు, పరాయి దేశాల ఎన్నికలు, యుద్ధాల కారణంగా షేర్స్ ధరలు పెరగడం, తగ్గడం అనేది ఎంతమాత్రం సమంజసం కాదు. కంపెనీల పనితీరు ఆధారంగా అది జరిగితే మంచిది. కానీ దానికి భిన్నమైన రీతిలోనే షేర్ మార్కెట్ కొనసాగుతోంది. ఈ వ్యవస్థ తొలినాళ్ళలోని లోపాలను ఎత్తి చూపిన చిత్రమే 'లక్కీ భాస్కర్'. నిజానికి భాస్కర్ చేసిన ఆర్థిక నేరాలకు అతనికి శిక్ష పడాల్సింది. కానీ మెజారిటీ ప్రేక్షకుల మనోభావాలకు తగ్గట్టుగా సినిమాలో భాస్కర్ కుటుంబంతో సహా విదేశాలకు వెళ్ళి స్థిరపడినట్టు చూపించారు. మన సినిమాలలో నేరస్థులకు తగిన శిక్షలు పడి చాలా సంవత్సరాలే అయ్యింది. ఇదీ ఆ కోవకు చెందిన సినిమానే. అయితే భాస్కర్ కుటుంబం కోసం పడే కష్టం చూస్తే... అతను చట్టం చేతికి చిక్కకూడదనే అంతా భావిస్తారు. అదే సమయంలో అతన్ని బలిపశువును చేయాలని కొందరు ప్రయత్నించినప్పుడు దాని నుంచి అతను తెలివిగా బయట పడటమే కరెక్ట్ అనీ అనుకుంటారు. అదే ఈ సినిమాకు ప్రధాన బలం. బ్యాంక్ స్కామ్‌ను రిజర్వ్ బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లే క్రమంలో భాస్కర్ చేతికీ కొంత అవినీతి బురద అంటుకున్నా... అది పెద్ద తప్పుగా ప్రేక్షకుడికి అనిపించదు. ఆ రకంగా ప్రేక్షకులను కన్విన్స్ చేయడంలో దర్శకుడు వెంకీ అట్లూరి సఫలీకృతుడయ్యాడు. సైబర్ నేరాల నేపథ్యంలో దుల్కర్ సల్మాన్ ఆ మధ్య 'కనులు కనులను దోచాయంటే' సినిమాలో నటించాడు. ఎవరూ మంచి వాళ్లు కాదు... ఎవరూ చెడ్డవాళ్లు కాదు... పరిస్థితులను బట్టి వ్యక్తుల గుణగణాలు మారిపోతుం టాయి అనేదే ఆ సినిమా థీమ్. ఇక తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'ను కుటుంబ నేపథ్యంలో తెరకెక్కించి, హ్యూమన్ ఎమోషన్స్‌ను దట్టించడంతో సహజంగానే ఫ్యామిలీ ఆడియన్స్ కూడా కనెక్ట్ అయ్యే ఛాన్స్ దక్కింది.

నటీనటుల విషయానికి వస్తే భాస్కర్ పాత్రలో దుల్కర్ సల్మాన్ ఒదిగిపోయాడు. అతని భార్య సుమతిగా మీనాక్షి చౌదరి చక్కగా నటించింది. దుల్కర్ తండ్రిగా సర్వదమన్ బెనర్జీ, బ్యాంక్ అధినేతగా టీనూ ఆనంద్, దాని నిర్వాహకుడిగా సచిన్ ఖేడేకర్ చేశారు. ఇతర ప్రధాన పాత్రలను సాయికుమార్, మాగంటి శ్రీనాథ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, రాంకీ, మానసా చౌదరి, రఘుబాబు, శివన్నారాయణ, గాయత్రి భార్గవి, సుధ, కల్యాణీ రాజ్, మాస్టర్ రుత్విక్ తదితరులు పోషించారు. పాత్రధారులందరి నుంచి కావలసిన నటనను వెంకీ అట్లూరి చక్కగా రాబట్టుకున్నాడు. అప్పటి ముంబై వాతావరణాన్ని తన కెమెరాతో చక్కగా కాప్చర్ చేశాడు నిమీష్ రవి. ఇక సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ నేపథ్య సంగీతంతో సన్నివేశాలను అద్భుతంగా ఎలివేట్ చేశాడు. ద్వితీయార్థంలో కొన్ని సన్నివేశాలకు అతని బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రాణం పోసింది. మాటలూ బాగున్నాయి. తెలుగు తెరపైకి కొత్త కథతో వచ్చిన 'లక్కీ భాస్కర్' కుటుంబ ప్రేక్షకులనూ మెప్పిస్తుంది.

**– అరుణ,**
సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



# అయోధ్యలో పాతిక లక్షల దీపాలు

పరమాద్భుతం... స్వర్గధామమే... అసాధారణం.. ఈ దీపావళి సందర్భంగా అయోధ్య పట్టణంలో వినిపించిన మాటలు ఇవే. రాముడిని ప్రతిష్ఠించుకున్న తరువాత అయోధ్యలో నిర్వహించుకున్న దీపావళి కొత్త చరిత్రను సృష్టించింది. అక్టోబర్ 30న అక్కడ పండుగ సంరంభం ఆరంభమైంది. ఈ సంవత్సరం కొత్తగా రెండు గిన్నిస్ బుక్ రికార్డులను కైవసం చేసుకుంది. ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ, అయోధ్య జిల్లా పాలనా యంత్రాంగం సహాయంతో ఇది సాధ్యమైంది. ఈ సంవత్సరం అక్కడ 25,12,585 దీపాలు సరయూ తీరంలో వెలిగించారు. ఇందుకోసం 1,121 మంది భక్తులు రేయింబవళ్లు శ్రమించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బ్రజేశ్ పాథక్ ఉత్సవంలో పాల్గొన్నారు. దీపావళి రికార్డుకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి యోగి సగర్వంగా స్వీకరించారు. దీపావళిలో భాగంగా రామకథను దీపాల ప్రదర్శనతో దర్శింపచేశారు.



From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 03


# శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం

శ్రీకాళహస్తి-తిరుపతి జిల్లా, ఆం.ప్ర. ఫోన్ : 08578-222240



**శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ద్వారా కార్తీక మాసంలో జరిగే కార్యక్రమాలు**


1. సాంస్కృతిక కార్యక్రమాలు (ప్రతిరోజు సాయంత్రం) 2. ఆకాశదీపం (ప్రతిరోజు సాయంత్రం)
3. పౌర్ణమి రోజు అమ్మవారి, స్వామివారి ఊంజలి సేవ - పుర వీధి ఉత్సవం
4. 30-11-2024 లక్ష బిల్వార్చన కుంకుమార్చన యొక్క నిమజ్జనం



ఆకాశదీపం



భక్త కన్నప్ప



పౌర్ణమినాడు అమ్మవారి, స్వామివారి ఊరేగింపు

**రాహుకేతు పూజలు జరిపించుకోండి - సకలదోష నివారణ పొందండి.**

Email : eo_srikalahasthi@yahoo.co.in Web : www.tms.ap.gov.in